
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఖమ్మం

: fb.com/vaartha Digital

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

26-6-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 145 పేజీలు: 8+16 వెల: 6.50



ఖండాంతర క్షిపణుల తయారీలో పాక్: అమెరికా

సంవిధాన్ హత్యాదివస్‌గా ఎమర్జెన్సీ: ప్రధాని మోడీ

5


# 3 నెలల్లో 'స్థానిక' సమరం



## సెప్టెంబరు 30 లోగా గ్రామ పంచాయతి ఎన్నికలు నిర్వహించాలని సర్కార్‌కు హైకోర్టు ఆదేశం

### 30 రోజుల్లో వార్డుల విభజన పూర్తి చేయాలని ఎన్నికల సంఘానికి సూచన

### రిజర్వేషన్ల ఖరారుకు 30 రోజుల గడువు కోరిన సర్కార్

### గతేడాదిలోనే పూర్తయిన సర్పంచ్‌ల పదవీకాలం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్25:** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలకు లైన్ క్లియర్ అయ్యింది. రాష్ట్రంలో స్థానిక ఎన్నికల నిర్వహణపై హైకోర్టు బుధవారం తుది తీర్పు వెల్లడించింది. సెప్టెంబర్ 30లోగా ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించింది. గ్రామ పంచాయతీ ఎన్నికలను 3 నెలల్లో నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. వీలైనంత త్వరగా 30 రోజుల్లో వార్డుల విభజన పూర్తిచేసి, ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘానికి సూచించింది. 2024 జనవరి 31వ తేదీన సర్పంచుల పదవీకాలం ముగిసిన విషయం తెలిసిందే. గడువు ముగిసి ఒకటిన్నరేళ్లయినా ఎన్నికలు నిర్వహించకపోవడంపై న్యాయస్థానంలో 6 పిటిషన్లు దాఖలు అయ్యాయి. నల్గొండ, నిర్మల్, జనగాం, కరీంనగర్ జిల్లాకు చెందిన ఆరుగురు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై హైకోర్టులో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘంతో పాటు పిటిషనర్ల వాదనలు వినిపించారు. సర్పంచ్‌ల పరిపాలన లేక గ్రామాల అభివృద్ధి వెనుకబడుతోందని బీఆర్ఎస్, బీజేపీలు ఆరోపిస్తున్న విషయం విదితమే. గ్రామపంచాయతీ ఎన్నికలపై తీర్పును జస్టిస్ టి.మాధవిదేవి బుధవారం వెలువరించారు. తొలుత పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కోర్టులో వాదనలు వినిపించారు. గతేడాది జనవరి 31వ తేదీతో సర్పంచుల పదవీ కాలం ముగిసినా ఇప్పటికీ ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందన్నారు. సర్పంచులను తప్పించి పంచాయతీల బాధ్యతలను స్పెషల్ అధికారులకు అప్పగించడం, రాజ్యాంగానికి, తెలంగాణ పంచాయతీరాజ్ చట్టాలకు విరుద్ధం అని పేర్కొన్నారు. ప్రత్యేక అధికారులు వారికున్న ఇతర విధుల్లో ఉండటంతో ప్రజల సమస్యలను పట్టించు కోవడంలేదని, రాష్ట్ర ఆర్థిక సంఘం ద్వారా నిధులు సమకూరుస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీతో పలువురు సర్పంచులు తమ సొంత నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేయించారని న్యాయస్థానానికి తెలిపారు. ప్రస్తుతం ఆ నిధులు అందక నానా అవస్థలు పడుతున్నారని, వివిధ పథకాల కింద కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు రావడం లేదని

>>2

# శుభాంశు శుక్లా అంతరిక్షయానం

### మరో ముగ్గురితో కలిసి వ్యోమయాత్ర.. నేడు ఐఎస్ఎస్‌తో అనుసంధానం

### రాకేశ్ శర్మ తర్వాత చరిత్ర సృష్టిస్తున్న శుభాంశు

### అభినందనలు తెలిపిన రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోడీ



**న్యూయార్క్,జూన్ 25:** భారత అంతరిక్ష యాత్రల చరిత్రలో మరో మైలురాయి ఆవిష్కృతమైంది. భారత వాయుసేనకు చెందిన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా యాక్సియం4 మిషన్‌లో భాగంగా అంతరిక్షంలోకి విజయవంతంగా పయనమయ్యారు. ఈ అంతర్జాతీయ బృందానికి ఆయన సారథ్యం వహిస్తున్నారు. ఈ చారిత్రాత్మక ప్రయోగం పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేస్తూ శుభాంశు శుక్లాకు, మిషన్ బృందానికి అభినందనలు తెలిపారు. రాష్ట్రపతి ముర్ము స్పందిస్తూ, "భారత్ నుంచి గ్రూప్ కెప్టెన్‌గా వెళ్లిన శుభాంశు శుక్లా భారత అంతరిక్ష చరిత్రలో ఒక నూతన అధ్యాయాన్ని లిఖించారు.

>>2



# సిబిఎస్ఇ టెన్త్ పరీక్షలు యేటా రెండుసార్లు

### విద్యాబోర్డు నిర్ణయం

**న్యూఢిల్లీ,జూన్ 25:** వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఏడాదికి రెండుసార్లు 10వ తరగతి బోర్డ్ పరీక్షలు నిర్వహించనుననట్లు కేంద్ర మాధ్యమిక విద్యాబోర్డు (సిబిఎస్ఇ) నిర్ణయించింది. ఒకపర్యాయంఫిబ్రవరిలో, రెండోపర్యాయం మేలో నిర్వహించాలని నిర్ణయించింది. తొలి విడత ఫలితాలు ఏప్రిల్‌లోను, రెండో విడత రిజల్ట్స్ జూన్‌లోను విడుదల చేయనుంది. అయితే,

>>2

# ఐఏఎస్‌లు వారంలో రెండు స్కూళ్లను సందర్శించాలి

### బడుల్లో సోలార్ కిచెన్లు.. విద్యా శాఖ సమీక్షలో సిఎం రేవంత్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్25:** తెలంగాణలో విద్యా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్లు వారంలో కనీసం రెండు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించాలని సీఎం సూచించారు. విద్యా శాఖపై ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్(ఐసీసీసీ)లో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో 48 వేల మంది చేరారని అధికారులు సీఎంకు వివరించారు. పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నూతన గదులు నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు అవసరమైన వసతులను పాఠశాలల్లో కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. మధ్యాహ్న భోజనం తయారీకి సంబంధించి గ్యాస్, కట్టెల పొయ్యిల బాధల నుంచి మధ్యాహ్న భోజనం తయారు చేసే మహిళలకు విముక్తి కల్పించాలని... సోలార్ కిచెన్ల ఏర్పాటుపై తక్షణమే దృష్టి సారించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు తెలియజేశారు. పదో తరగతిలో ఉత్తీర్ణులవుతున్న విద్యార్థుల సంఖ్యకు, ఇంటర్మీడియట్‌లో నమోదు అవుతున్న విద్యార్థుల సంఖ్యకు మధ్య వ్యత్యాసం ఎక్కువ ఉండడంపై ముఖ్యమంత్రి అధికారులను ప్రశ్నించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులంతా కచ్చితంగా ఇంటర్మీడియట్‌లో చేరేలా చూడాలని సీఎం సూచించారు. ఇంటర్మీడియట్ అనంతరం జీవనోపాధికి అవసరమైన స్కిల్స్ కోర్సుల్లో శిక్షణ పొందవచ్చని.. తద్వారా వారి జీవితానికి ఢోకా ఉండదని సీఎం అభిప్రాయపడ్డారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ ఏ.శ్రీదేవసేన, విద్యా శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎం.హరిత

>>2



బుధవారం హైదరాబాద్‌లో నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష చేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

# బనకచర్లను అడ్డుకుంటాం

### 30న ప్రజాభవన్‌లో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్

### ఎన్‌డిఎస్ఎ కన్సల్టెంట్‌గా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ

### తక్షణమే నాగార్జున సాగర్‌లో పూడికతీతకు ఆదేశాలు: నీటిపారుదల మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్ జూన్ 25 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన గోదావరి-బనకచర్లను చట్టపరంగా అడ్డుకుంటామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణా రైతాంగం ప్రయోజనాలకు భంగం వాటిల్ల కుండా చూడడమే తమ ముందున్న కర్తవ్యమని ఆయన తేల్చిచెప్పారు .ఈ ప్రాజెక్టును నిర్మిస్తే తెలంగాణా ప్రాంత ప్రయోజనాలు ఏ విధంగా దెబ్బ తింటాయో, నష్టం ఎలా వాటిల్లుతుందో నన్న అంశంలో బలమైన వాదనలు వినిపించి ప్రాజెక్టు నిర్మాణాన్ని నిలువరిస్తామన్నారు.బుధవారం మధ్యాహ్నం ఎర్రమంజిల్ కాలనీలోని నీటిపారుదల శాఖా కేంద్ర కార్యాలయంలో నీటిపారుదల శాఖా ఉన్నతాధికారులతో సుదీర్ఘంగా సమీక్షించారునీటి పారుదల శాఖా ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్,ఇ.ఎన్.సి మహమ్మద్ అంజత్ హుస్సేన్, ఇ ఎన్ సి ఒక అండ్ ఎం డిప్యూటీ ఇ. ఎన్ సి శ్రీనివాస్ లతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్ట్ తో తెలంగాణాకు సంభవించనున్న ముప్పును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి ఈ నెల 19న కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్ పాటిల్‌కు సవివరంగా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌ను ఇచ్చామన్నారు.బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించిన ప్రీఫిజిబిలిటీని నివేదికను ఎట్టిపరిస్థితుల్లోనూ ఆమోదించవద్దని తేల్చిచెప్పామన్నారు. ఈ ప్రాజెక్టును నిర్మిస్తే తెలంగాణా రాష్ట్ర నీటి కేటాయింపులపై ప్రభావం చూపుతుందని దానిని దృష్టిలో పెట్టుకుని నివేదికను తిరస్కరించాలని కోరామన్నారు.అందుకు స్పందించిన కేంద్రమంత్రి పాటిల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమర్పించిన నివేదికను ఆమోదించ లేదని,త్వరలోనే అపెక్స్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని ఆయన వివరించారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో గోదావరి-బంకచర్ల ప్రాజెక్టు పురుడు పోసుకొందని, అది నిర్మిస్తే తెలంగాణా ప్రయోజనాలకు జరిగే నష్టం పై ఈ నెల 30 న ప్రజాభవన్ లో మధ్యాహ్నం 3 గంటలకు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ను ఏర్పాటు చేశామన్నారు.టన్నెల్ నిర్మాణాలలో అపారమైన అనుభవం కలిగిన సుప్రసిద్ధ సైనికాధికారు లిద్దరిని నీటిపారుదల శాఖలోకి తీసుకునేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు.ఇటీవల రోహ్తాంగ్,జోజిలా టన్నెల్ నిర్మాణంలో పనిచేసిన ఇద్దరు అధికారులను వినియోగించుకునేందుకు నీటిపారుదల శాఖా కసరత్తు చేస్తుందన్నారు.భారత సైన్యంలో ఇంజినీర్ ఇన్‌చీఫ్‌గా పనిచేసిన జనరల్ హార్పల్ సింగ్ ను తెలంగాణా రాష్ట్ర నీటిపారుదల శాఖకు సలహా దారుడిగా ఉండమని ఆహ్వానించామని అన్నారు.అంతర్జాతీయ స్థాయిలో పేరు గడించిన టన్నెల్ టెక్నాలజీ నిపుణులు కర్నల్ పరిక్షిత్ మెహ్రా ఈ జులైలో రాష్ట్ర నీటిపారుదల శాఖలో

>>2

# అర్విందు కుమార్‌కు ఎసిబి నోటీసులు

### 'ఫార్ములా కార్' కేసు..

### ఒకటిన విచారణకు పిలుపు

**హైదరాబాద్, జూన్ 25, ప్రభాతవార్త:** ఫార్ములా ఈ కార్ రేసుకు సంబంధించి ఎసిబి విచారణ వేగం పుంజుకుంది. ఈ కేసులో నిందితుడుగా వున్న సీనియర్ ఐఎఎస్ అధికారి అర్వింద్ కుమార్‌కు ఎసిబి అధికారులు బుధవారం నోటీసులు జారీ చేశారు. జూలై ఒకటవ తేదీన విచారణకు రావాలని ఆదేశించారు. ప్రస్తుతం విదేశీ పర్యటనలో భాగంగా బ్రిటన్‌లో వున్న అర్వింద్ కుమార్‌ను వెంటనే వెనక్కి రావాలని ప్రభుత్వం ఆదేశించడం తెలిసిందే. ఈ నెలాఖరుకు ఆయన భారత్‌కు వచ్చే వీలుంది. కాగా ఫార్ములా ఈ కార్ రేసుకు సంబంధించి ఎసిబి అధికారులు ఈ నెల 16వ తేదీన కెటిఆర్‌ను విచారించి ఈ కేసులో కీలక ఆధారాలు సేకరించడం విదితమే. గతంలో

>>2



**వేడుకలకు రూ.20 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం: మంత్రి పొన్నం**

# నేటి నుంచి బోనాలు

**హైదరాబాద్ జూన్ 25 ప్రభాతవార్త:** తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబంగా ఉండే ఆషాఢ మాసం బోనాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. పల్లె పట్నం అమ్మవారి పూజలతో హోరెత్తనున్నాయి. హైదరాబాద్‌లో అంగరంగ వైభవంగా బోనాల ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. బోనాలకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ఆది పరాశక్తిని తమ ఇంటి ఆడబిడ్డగా తెలంగాణ ప్రజలు భావిస్తారు. అమ్మవారిని అత్తింటి నుంచి పుట్టింటి తీసుకువచ్చి నైవేద్యాలు సమర్పించి, సారెతో అత్తవారింటికి తిరిగి సాగనంపే సంప్రదాయమే బోనాల పండుగ. ఆడబిడ్డను కొలిచినట్టు తెలంగాణ సంస్కృతి సంప్రదాయం ఉంటుంది.ఆది పరాశక్తిని తమ ఇంటి ఆడబిడ్డగా తెలంగాణ ప్రజలు భావిస్తారు.అమ్మవారిని అత్తింటి నుంచి పుట్టింటి తీసుకువచ్చి నైవేద్యాలు సమర్పించి, సారెతో అత్తవారింటికి తిరిగి సాగనంపే సంప్రదాయమే బోనాల పండుగ. ఆడబిడ్డను కొలిచినట్టు తెలంగాణ సంస్కృతి సంప్రదాయం ఉంటుంది. ఆషాఢ మాసంలోని తొలి ఆదివారం లేదా తొలి గురువారం గోల్కొండలోని జగదాంబిక ఆలయంలో నిర్వహించే ఉత్సవాలతో బోనాల పండుగ మొదలవుతుంది. బోనాల ఉత్సవాలకు ప్రభుత్వం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేసింది.జంటనగరాల్లో జరిగే బోనాల ఉత్సవాలకు తెలంగాణ ప్రభుత్వం రూ.20కోట్లు మంజూరు

>>2



బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న పిసిసి చీఫ్ మహేష్

# బిఆర్ఎస్‌లో దెయ్యాలు కాంగ్రెస్‌లో దేవతలు..

### ఏ ఎన్నికలొచ్చినా కాంగ్రెస్‌కు తిరుగులేదు: పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, జూన్ 25,ప్రభాతవార్త:** న్యాయం స్థానం తీర్పుకు అనుగుణంగానే రాష్ట్రంలో స్థానిక సంస్థల స్థానికల నిర్వహణ ఉంటుందని టిపిసిసి చీఫ్ ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. బుధవారం గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందనిస్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి రిజర్వేషన్ల అమలుపై కాంగ్రెస్ పార్టీ చర్చించి నిర్ణయం తీసుకుంటుందని ఆయన వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పినట్లు పదేళ్ల బిఆర్ ఎస్ పాలన ఏడాదిన్నర కాంగ్రెస్ పార్టీస్డిమని ఆయన ప్రకటించారు. కాంగ్రెస్ 18 నెలల పాలన గోల్డెన్ పిరియడ్ అని ఆయన అభివర్ణించారు. బిసి రిజర్వేషన్ల విషయంలో బిజెపి నేతలు నోరు మెదపడం లేదని,బిసిరిజర్వేషన్లు ఇచ్చి తీరాలని కాంగ్రెస్ పార్టీ తపన అని ఆయన తెలిపారు. పిసిసి,పిఎసి సమావేశాలు విజయవంతంగా ముగిశాయి. ఈ సమావేశాల్లో రాబోయే స్థానిక ఎన్నికలకు,జూబ్లిహిల్స్ ఉప ఎన్నికకు పార్టీని సన్నద్ధం చేసేలా పలు కీలక నిర్ణయాలు తీసుకొన్నామని వచ్చే ఎన్నికలపై అనుసరించాల్సిన వ్యూహాలాపై చర్చించామని అన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో పోటీ చేయడమే కాదు గెలిచేది మేమే అని ఆశాభావం వ్యక్తం చేశారు.రైతు భరోసా కింద తొమ్మిది రోజుల్లో తొమ్మిది వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమచేసి రికార్డు సృష్టించామని అన్నారు.

# రైతుఖాతాల్లోకి చెప్పినంతా జమచేసాం

### గతపదేళ్లతో పోల్చితే ఇది చాలా ఎక్కువ

### ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టాం: డి.సిఎం భట్టి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్25:** మిగులు బడ్జెట్‌తో ప్రభుత్వాన్ని అప్పగిస్తే గత ప్రభుత్వ పెద్దలు వారు చెప్పిన రైతు బంధు నిధులను ఏనాడు సక్రమంగా పంపిణీ చేయలేదని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క కార్యాలయం బుధవారం ఓ ప్రకటనలో పేర్కొంది. మిగులు బడ్జెట్ ఉన్నప్పటికీ రైతుబంధు నిధుల మొత్తం తక్కువే అయినా పంపిణీకి ఒక్కో సీజన్లో 169 రోజులు సుమారు ఐదున్నర నెలలు పాటు సమయం తీసుకున్నారు. అదే ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి ఎనిమిది లక్షల కోట్ల లోటు బడ్జెట్. రైతు భరోసా కింద గత ప్రభుత్వంతో పోలిస్తే ఎకరాకు 2,000 అదనంగా కలిపి 12,000 ఇవ్వాల్సిన సందర్భం. ఛిద్రమైన ఆర్థిక వ్యవస్థను స్వల్ప సమయంలోనే గాడిలో పెట్టిన డిప్యూటీ సీఎం, ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క తక్కువ సమయంలోనే, పెద్ద మొత్తంలో రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేశారు. కేవలం తొమ్మిది రోజుల్లో రూ.8,744.13 కోట్ల నిధులు రైతుల ఖాతాల్లో జమచేసి దేశచరిత్రలోనే ఓ రికార్డు సృష్టించారు.గత ప్రభుత్వం ఎన్నికల ముందు వేయాల్సిన రైతు భరోసా నిధులను వేయకుండా వెళ్ళిపోగా రైతుల పట్ల బాధ్యత, ప్రేమ కలిగిన ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారు వదిలేసిన యాసంగి కాలం రూ.7,625 కోట్ల నిధులు రైతుల ఖాతాలో జమ చేశారు.గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో పెట్టుబడి సాయంగా అందించిన నిధులు, సమయంతో ప్రజా ప్రభుత్వం వచ్చాక రైతు భరోసా నిధుల మొత్తం, తీసుకున్న సమయాన్ని పోలిస్తే రైతుల పట్ల ఎవరికి బాధ్యత, ప్రేమ ఉన్నాయో స్పష్టం అవుతుంది. 2018-19 వానాకాలం సీజన్‌కు 10-05-2018న రైతులకు పెట్టుబడి సాయం వేయడం ప్రారంభించి 15-09-2018 నాటికి పూర్తి చేశారు.128 రోజులపాటు సమయం తీసుకొని రూ.5,237.56 కోట్ల నిధులు ఆ సీజన్లో జమ చేశారు. 2018-19 యాసంగి సీజన్‌కు సంబంధించి 20-10-2018న వేయడం ప్రారంభించి 30-03-2019 నాటికి పూర్తిచేశారు. 161రోజుల పాటు సమయంతీసుకుని రూ. 5,248.80 కోట్ల నిధులు జమ చేశారు. 2019-20 వానకాలానికి సంబంధించి 04-06-2019న రైతుబంధు

>>2



న్యూఢిల్లీలోని కృషి భవన్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్. చిత్రంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ చంద్ర శేఖర్ పెమ్మసాని తదితరులు

# నేటి నుంచి బోనాలు

>> చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని 2,783 ఆలయాలకు వివిధ కార్యక్రమాలు నిర్వహణ కోసం నిధులను చెక్కుల రూపంలో జారీ చేసిందన్నారు. ఆషాఢ మాసంలో ముందుగా నగరంలోని గోల్కొండ బోనాలు జూన్ 29న జులై 1, 2 తేదీల్లో బల్కంపేట ఎల్లమ్మ బోనాలు, జులై 13, 14 తేదీల్లో శ్రీ ఉజ్జయిని మహాకాళి దేవస్థానం బోనాలు, జులై 20న లాల్ దర్వాజా బోనాలు.జులై 23న చార్మినార్ భాగ్యలక్ష్మీబోనాలు, మిగిలిన దేవాలయాల్లో ఈ ఉత్సవాలు వైభవంగా జరుగుతాయని పేర్కొన్నారు.జంటనగరాల్లో జరిగే బోనాల ఉత్సవాలకు తెలంగాణ ప్రభుత్వం రూ.20కోట్లు మంజూరు చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని 2,783 ఆలయాలకు వివిధ కార్యక్రమాలు నిర్వహణ కోసం నిధులను చెక్కుల రూపంలో జారీ చేసిందన్నారు.

**బోనాల షెడ్యూల్**

నెల రోజులపాటు జరిగే ఈ పండుగ ఎన్నో విశేషాల సమాహారం.ఈ ఏడాదిజూన్ 26(గురువారం)జూలై 26వ తేదీ వరకూ బోనాలు జరుగుతాయి. గురువారం హైదరాబాద్‌లోని గోల్కొండ కోట పై కొలువుదీరిన జగదాంబిక అమ్మవారికి తొలిబోనం సమర్పణతో హైదరాబాద్‌లో బోనాల ఉత్సవాలు ప్రారంభం అవుతాయి.జూన్ 29 తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ కనకదుర్గమ్మకు బోనం సమర్పిస్తారు. తెలుగు రాష్ట్రాల మధ్య చక్కటి అనుబంధానికి ఈ వేడుకఅద్దం పడుతోంది.జూలై 13న లష్కర్ బోనాలు జరుగుతాయి.లష్కర్ అంటే సికింద్రాబాద్ ప్రాంతం అని అర్థం. సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర అంగరంగ వైభవంగా జరుగుతుంది.జూలై 14న లష్కర్ బోనాలు జరిగిన తర్వాతి రోజు రంగం, భవిష్యవాణి ఉంటుంది. రాబోయే సంవత్సర కాలంలో ఏం జరుగుతుందనేది మాతంగి తన భవిష్య వాణిలో వినిపిస్తుంది.జూలై 20న అసలైన హైదరాబాద్ బోనాల పండుగ ఇది. హైదరాబాద్ నగరమంతా బోనాల పండుగ జరుగుతుంది. లాల్ దర్వాజ సింహ వాహిని అమ్మవారి బోనాల పండుగ పాతబస్తీలో అంగరంగ వైభవంగా జరుగుతుంది.జూలై 21న ఉమ్మడి దేవాలయాల ఘట్టాల ఊరేగింపు చేపడతారు.ఇదేరోజు లాల్‌దర్వాజ సింహ వాహిని అమ్మవారి ఆలయం వద్ద రంగం ఉంటుంది. అంతేకాకుండా మాతంగి భవిష్య వాణి వినిపిస్తారు.జూలై 24న లష్కర్ హైదరాబాద్ బోనాలు ముగుస్తాయి.

# పరీక్షలు యేటా రెండుసార్లు

>> ఫిబ్రవరిలో జరిగే తొలి విడత పరీక్షలు తప్పనిసరిగా హాజరు కావాలని వెల్లడించింది. మేలో జరిగే పరీక్షలను విద్యార్థులు మార్కులు పెంచుకునేందుకు రాసుకోవచ్చని సూచించింది. రెండు విడతల్లో వచ్చిన ఉత్తమ స్కోరును పరిగణనలోకి తీసుకోనుంది సీబీఎస్ఈ. నూతన జాతీయ విద్యా విధానం ప్రకారం రెండుసార్లు పరీక్షలు నిర్వహించేందుకు వీలుగా నిబంధనలకు ఆమోదం తెలిపింది. ఏడాదికొకసారి ఇంటర్నల్ అసెస్‌మెంట్ ఉంటుందని ఎగ్జామినేషన్ కంట్రోలర్ సన్యం భరద్వాజ్ వెల్లడించారు. తొలి విడత పరీక్షలు ఫిబ్రవరిలో, రెండోవి మేలు జరుగుతాయి. వీటి ఫలితాలు ఏప్రిల్, జూన్‌లో విడుదలవుతాయి. ప్రతి విద్యార్థి తొలి విడత పరీక్షలు తప్పనిసరిగా రాయాలి. రెండో విడత ఎగ్జామ్స్ విద్యార్థులకు ఆప్షనల్. సైన్స్, మ్యాథ్స్, సోషల్ సైన్స్, భాషల్లో వారి మార్కులను మెరుగుపరుచుకునేందుకు మరోసారి రాసుకోవచ్చని పరీక్షల కంట్రోలర్ తెలిపారు. అయితే కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జాతీయ నూతన విద్యా విధానానికి అనుగుణంగా సీబీఎస్ఈ పరీక్షల్లో మార్పులు చేయాలని నేషనల్ కరికులమ్ ఫ్రేమ్‌వర్క్ ముసాయిదా కమిటీ ఇప్పటికే సూచించింది.

# ప్రయాణీకుల సౌకర్యం కోసం త్వరలో మెము రైళ్లు: రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్

**హైదరాబాద్, జూన్ 25 ప్రభాతవార్త:** తెలంగాణకు సంబంధించిన వివిధ రైల్వే ప్రాజెక్టుల పురోగతిపై కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిలు చర్చించారు. బుధవారం ఢిల్లీలో ఇద్దరు కేంద్ర మంత్రులు భేటి అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణాకు సంబంధించిన ప్రాజెక్టుల పురోగతిపై చర్చించారు. రైల్వే ప్రయాణాన్ని మరింత సులభతరం చేసే లక్ష్యంతో కొత్తతరం, మైన్ లైన్ ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్ (మెము) రైళ్లను త్వరలోనే ప్రవేశపెట్టనున్నట్లు ఈ సందర్భంగా అశ్విని వైష్ణవ్ వివరించారు. 16 నుంచి 20 కోచ్‌లు ఉండే మెము రైళ్లను తెలంగాణలోని ఖాజీపేట రైల్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ (ఆర్ఎంయు)లో ఉత్పత్తి చేయనున్నట్లు వెల్లడించారు. ఈ మెము రైళ్ళు, గ్రామీణ ప్రాంతాలు, సెమీఅర్బన్ ప్రాంతాలను అనుసంధానించడంలో మరీ ముఖ్యంగా పండగల సమయంలో ప్రయాణీకులకు సౌకర్యవంతంగా ఉంటుందని రైల్వేమంత్రి స్పష్టం చేశారు. రూ.716 కోట్లతో ఖాజీపేటలోని రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ నిర్మాణం పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. 2026 జనవరి నాటికి ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నామని, మే 2026 నుంచి ఈ కేంద్రం ద్వారా ఉత్పత్తి ప్రారంభం కానుందని కిషన్‌రెడ్డికి రైల్వే మంత్రి వివరించారు.

# బోనాల వేడుకల సందర్భంగా సిఎం రేవంత్ శుభాకాంక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి. హైదరాబాద్,జూన్25:** బోనాల ఉత్సవాలు ప్రారంభం సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఆషాడ మాసం బోనాల ఉత్సవాలతో రాష్ట్రంలో పండుగ వాతావరణం మొదలవుతుందన్నారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రతి ఒక్కరు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాక్షించారు. చారిత్రాత్మక గోల్కొండలో వెలసిన జగదాంబిక ఎల్లమ్మ తల్లికి ఆషాడ మాసం తొలి బోనం సమర్పించడంతో జంటనగరాల్లో బోనాల సందడి నెలకొంటుందన్నారు.

అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరు సుఖ శాంతులతో, ఆయురోగ్యాలతో జీవించాలని రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగతి సాధించే దిశగా తల్లి దీవెనలు ఉండాలని సిఎం ఆకాంక్షించారు.

# అర్వింద్ కుమార్‌కు ఎసిబి నోటీసులు

>> ఫార్ములా ఈ కార్ రేసుకు సంబంధించి గతంలో అర్వింద్ కుమార్ ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా కెటిఆర్‌ను ఎసిబి విచారిం చింది. ఇందులో ఫార్ములా ఈ కార్ రేసులో బిజినెస్ రూల్స్, అగ్రిమెంట్లు, స్పాన్సర్లు, ఆర్థిక శాఖ అనుమతులు ఇలా అనేక అంశాలపై ఎసిబి అధికారులు కెటి ఆర్ నుంచి వాంగ్మూలం తీసుకున్నారు. దీని ఆధారంగా ఇప్పుడు ఎసిబి అధికారులు అర్వింద్ కుమార్‌కు నోటీసులు ఇచ్చినట్లు తెలుస్తోంది. అవసరం అయితే ఈ కేసులో కెటిఆర్‌తో పాటు అర్వింద్ కుమార్‌ను ఉమ్మడిగా విచారించే వీలుందని తెలిసింది.

# రాష్ట్ర క్రీడా పాలసీకి సర్కార్ గ్రీన్ సిగ్నల్

## స్పోర్ట్స్ వర్సిటీ ఏర్పాటుకు నిర్ణయం

**హైదరాబాద్, జూన్ 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని తెలంగాణ సర్కార్ నిర్ణయించింది. అలాగే రాష్ట్రానికి చెందిన ప్రతిభావంతులైన క్రీడాకారులకు స్పోర్ట్స్ కోటాలో రాష్ట్రస్థాయిలో ప్రతిభావంతులైన క్రీడాకారులకు స్పోర్ట్స్ కోటా ద్వారా ఉద్యోగాల్లో రిజర్వేషన్లు అమలు చేయనుంది. ఈ మేరకు రూపొందించిన స్పోర్ట్స్ పాలసీకి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అలాగే ఒలింపిక్స్, పారాలింపిక్స్‌లలో స్వర్ణ పతకం సాధించే క్రీడాకారులకు రూ.6 కోట్లు, రజతానికి రూ.4 కోట్లు, కాంస్యానికి రూ.2.5 కోట్లు మేర నగదు ప్రోత్సాహం ఇవ్వనుంది. విశ్వక్రీడల్లో పాల్గొన్నందుకు సైతం రూ.15 లక్షల నగదు బహుమతి ఇవ్వనున్నట్లు నూతన క్రీడా విధానంలో పేర్కొంది. ప్రధానంగా తెలంగాణలో ప్రపంచ స్థాయి యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ యూనివర్సిటీ క్రీడా రంగాలలో ప్రపంచశ్రేణి నిపుణులను తయారు చేయడమే లక్ష్యంగా పనిచేయనుంది. క్రీడా కారులు, కోచ్‌ల ప్రతిభకు గుర్తింపు, ప్రోత్సాహకం, భద్రతకు భరోసా కల్పించనుంది. దీర్ఘకాలిక అథ్లెట్ డెవలప్‌మెంట్‌తో పాటు, కీలక క్రీడలకు సంబంధించి సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను కూడా ఏర్పాటు చేయనుంది. అలాగే వివిధ స్థాయిల్లో నిర్వహించే సీఎం కప్‌లో సత్తాచాటే క్రీడాకారులకు అత్యుత్తమ శిక్షణ, మద్దతు అందించనుంది. అంతేకా కుండా మానసిక ఆరోగ్య సమస్యల పరిష్కారానికి క్రీడాకారులు, సిబ్బందికి వైద్య సహాయం చేయడానికి ఆర్థికంగా సహకారం ఇవ్వనుంది. ఇక ఈ క్రీడల్లో సత్తాచాటే, క్రీడాభివృద్ధికి కృషి చేసే అథ్లెట్లు, పాఠశాలలు, కోచ్‌లు, కార్పొరేట్ భాగస్వాములు, విలేకరులు వార్షిక అవార్డులు ఇవ్వనున్నట్లు క్రీడా పాలసీలో పేర్కొంది.

## వారం - వర్జ్యం

తేది : 26-06-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, శుక్ల పక్షం
శుక్ల పాడ్యమి మ.1.29
ఆరుద్ర ఉ.8.48
వర్జ్యం రా.8.06-9.36
దు.ఉ.10.00-10.52, 2) మ.3.15-సా.4.07
శుభసమయం: సా.6.15-7.00
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** సన్నిహితులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారించుకుంటారు. వస్తు, వస్త్రా సేకరణ.

**వృషభం :** నూతన ప్రయత్నాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. వాహనయోగం.

**మిథునం:** సోదరులను కలిసి ఆనందంగా గడుపుతారు. సంతానంనకు నూతన అవకాశాలు.

**కర్కాటకం :** జీవితభాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారంచుడతారు.

**సింహం:** రాజకీయ, పారిశ్రామిక రంగాలలోనివారికి అనుకోని ఆహ్వానాలు అందుతాయి.

**కన్య :** వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. స్వల్ప ధనలాభం.

**తుల :** సన్నిహితులనుండి కీలక సమాచారం అందుకొంటారు. విందు, వినోదాలలో పాల్గొంటారు.

**వృశ్చికం:** రుణాలు తీరి ఊరటచెందుతారు. వాహనాలు, గృహాలు కొనుగోలుచేస్తారు.

**ధనుస్సు:** ఉద్యోగాలలో ఉన్నత హెూదాలు పొందుతారు. ఆర్థికపరిస్థితి మెరుగుపడుతుంది.

**మకరం:** రాజకీయ, కళా, పారిశ్రామిక రంగాలవారికి ప్రభుత్వరంగాల నుండి ఆహ్వానాలు అందుతాయి.

**కుంభం:** భాగస్వామ్య వ్యాపారాలు అభివృద్ధి సాధిస్తారు. పట్టింది బంగారంగా వుంటుంది.

**మీనం :** బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. కాంట్రాక్టులు లాభిస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# శుభాంశు శుక్లా అంతరిక్షయానం

>> మీ ప్రయాణం పట్ల దేశం మొత్తం గర్వంగా, సంతోషంగా ఉంది. మీరు, యాక్సియం4 మిషన్‌లోని ఇతర దేశాల వ్యోమగాములు వసుధైక కుటుంబం అనే భావనను మరోసారి ప్రపంచానికి చాటిచెప్పారు. నాసా, ఇస్రో మధ్య నెలకొన్న శాశ్వత భాగస్వామ్యానికి ఈ మిషన్ అద్దం పడుతోంది. ఈ యాత్ర సంపూర్ణంగా విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నాను. అంతరిక్ష కేంద్రంలో వ్యోమగాములు నిర్వహించే ప్రయోగాలు, శాస్త్రీయ అధ్యయనాలు భవిష్యత్ అంతరిక్ష యాత్రలకు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా ఈ అంతరిక్ష యాత్ర విజయంపై స్పందించారు. భారత్, హంగేరీ, పోలాండ్, అమెరికా దేశాలకు చెందిన వ్యోమగాములతో కూడిన ఈ ప్రయోగం విజయవంతం కావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. భారత వ్యోమగామి, గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించారని ప్రధాని మోదీ అన్నారు. కోట్లాది మంది భారతీయుల కలలు, ఆశలు, ఆకాంక్షలను శుభాంశు తనతో పాటు మోసుకెళ్లారని ఆయన అభివర్ణించారు. అమెరికాలోని ఫ్లోరిడాలో ఉన్న నాసా కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి బుధవారం భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 12:01 గంటలకు ఫాల్కన్ 9 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ప్రయోగం జరిగిన నిమిషాలకే, వ్యోమగాములు ప్రయాణిస్తున్న వ్యోమనౌక రాకెట్ నుంచి విజయవంతంగా విడిపోయి, భూకక్ష్యలోకి ప్రవేశించింది. సుమారు 28 గంటల ప్రయాణం అనంతరం, గురువారం సాయంత్రం భారత కాలమానం ప్రకారం 4:30 గంటలకు ఈ వ్యోమనౌక అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంతో అనుసంధానం కానుంది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో శుభాంశు శుక్లా నేతృత్వంలోని బృందం 14 రోజుల పాటు బస చేస్తుంది. ఈ సమయంలో వారు భారరహిత స్థితిలో పలు కీలక ప్రయోగాలు నిర్వహిస్తారు. అంతేకాకుండా, అంతరిక్షం నుంచే ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో, పాఠశాల విద్యార్థులతో, ఇతర ప్రముఖులతో సంభాషించనున్నారు. ఈ యాత్ర ద్వారా అంతరిక్ష విజ్ఞాన రంగంలో మరిన్ని కొత్త ఆవిష్కరణలు సాధ్యమవుతాయని శాస్త్రవేత్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. భారత గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాను అంతరిక్షంలోకి సాగనంపిన ఫాల్కన్ 9 రాకెట్ భూమికి తిరిగి చేరుకుంది. ప్రయోగం మొదలైన 8 నిమిషాల్లోనే డ్రాగన్ క్యాప్సూల్ ను అంతరిక్షంలో వదిలి తిరిగి వచ్చింది. శుక్లాతో పాటు నలుగురు వ్యోమగాములు ఉన్న డ్రాగన్ క్రూ క్యాప్సూల్ నిర్ణీత సమయానికి ఫాల్కన్ 9 రాకెట్ నుంచి విడిపోయింది. ఆ తర్వాత అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) వైపు తన ప్రయాణాన్ని ప్రారంభించింది. ఈ క్యాప్సూల్ దాదాపు 28 గంటల పాటు ప్రయాణించి రేపు సాయంత్రం 4 గంటల ప్రాంతంలో భూమికి 400 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న ఐఎస్ఎస్ కు చేరుకుంటుంది. సాయంత్రం 4:30 గంటలకు ఐఎస్ఎస్ తో అనుసంధానమవుతుందని స్పేస్ ఎక్స్ శాస్త్రవేత్తలు తెలిపారు.

**8 నిమిషాల్లోనే తిరిగి రాక..**

భారత కాలమానం ప్రకారం ఈ రోజు మధ్యాహ్నం 12:01 గంటలకు డ్రాగన్ క్రూ క్యాప్సూల్ తో ఫాల్కన్ 9 రాకెట్ నింగిలోకి ఎగిసింది. కెన్నెడీ స్పేస్ సెంటర్ లోని 39ఏ లాంచ్ కాంప్లెక్స్ నుంచి ఈ ప్రయోగం జరిగింది. నింగికెగిరిన ఫాల్కన్ రాకెట్ షెడ్యూల్ ప్రకారం ప్రయాణించింది. డ్రాగన్ క్యాప్సూల్ ను అంతరిక్షంలోకి వదిలి తిరిగి భూమి వైపు ప్రయాణం మొదలుపెట్టింది. ప్రయోగం ప్రారంభించిన తర్వాత 8 నిమిషాలకు రాకెట్ తిరిగి భూమిని చేరుకుంది. స్పేస్‌ఎక్స్ కంపెనీ తయారుచేసిన ఈ ఫాల్కన్ 9 రాకెట్ ప్రపంచంలోనే తొలి ఆర్బిటల్‌క్లాస్ పునర్వినియోగ రాకెట్ అని శాస్త్రవేత్తలు తెలిపారు.

# నటుడు మంచు విష్ణు కార్యాలయంలో జీఎస్టీ సోదాలు

**హైదరాబాద్,జూన్25, ప్రభాతవార్త:** 'కన్నప్ప' చిత్రంపై జీఎస్టీ పన్నులు చెల్లించడకపోవడంతో కేంద్ర జీఎస్టీ ఇంటలిజెన్స్ అధికారులుదాడులు చేపట్టారు. బుధవారంహైదరాబాద్‌లోని మాదాపూర్, కావూరిహిల్స్‌లోని ఆయన రెండు చోట్ల కార్యాలయంలో ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారు. అనంతరంసినిమాకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. విషయంతెలుసుకున్న విష్ణుతో పాటుతండ్రి మంచుమోహన్‌బాబు,రచయిత కోనవెంకట్‌కు తరలివెళ్లారు. ఈ విషయంపై విష్ణును మీడియా ప్రశ్నించగా..'మీరు చెప్పే వరకు తనకు తెలియద్ను' అని బదులిచ్చి వెళ్లారు.

# వారంలో రెండు స్కూళ్లను సందర్శించాలి

>> తదితరులు పాల్గొన్నారు.

**సిఎంకు టోనీబ్లెయిర్ ప్రశంసలు**

తెలంగాణ రైజింగ్ విజన్ 2047లోని స్పష్టత, నిర్దేశించుకున్న లక్ష్యాలు ఎంతో ఆకట్టుకున్నాయంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఇంగ్లాండ్ మాజీ ప్రధానమంత్రి టోనీబ్లెయిర్ అభినందనలు తెలియజేశారు.తెలంగాణ రైజింగ్ విజన్-2047లో నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు ఇండియాలోని (టిబిఐజిసి) ప్రతినిధి తెలంగాణ ప్రభుత్వానికి సహకరిస్తారని టోనీ బ్లెయిర్ తెలియజేశారు. ఈమేరకు రెండు రోజుల క్రితం సిఎం రేవంత్‌రెడ్డికి టోనీ బ్లెయర్ లేఖ రాశారు ఈ లేఖను బుధవారం సిఎం కార్యాలయం మీడియాకు విడుదల చేసింది. రైజింగ్ విజన్ రూపకల్పన క్రమంలో సీఎంవోకు ఏవైనా సందేహాలు ఉంటే ఎటువంటి సంకోచాలు లేకుండా తమ టిబిఐజిసి భారత ప్రతినిధిని సంప్రదించాలని సీఎం రేవంత్ రెడ్డికి టోనీబ్లెయిర్ సూచించారు. తెలంగాణ రైజింగ్ విజన్-2047 డాక్యుమెంట్ ఆవిష్కరణకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డికి టోనీబ్లెయిర్ తెలియజేశారు.ఇటీవల ఢిల్లీలో ఇంగ్లాండ్ మాజీ ప్రధానమంత్రి టోనీబ్లెయిర్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ విజన్-2047 గురించి టోనీబ్లెయిర్‌కు ముఖ్యమంత్రి వివరించారు. తెలంగాణ రైజింగ్ విజన్-2047లో నిర్దేశించుకున్న 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ, పెట్టబడుల సాధన, రైతులు, మహిళా, యువ సాధికారిత, మౌలిక వసతుల కల్పన, ఐటీ, ఇతర రంగాల అభివృద్ధి లక్ష్యాలను, చేరుకునే మార్గాలను ముఖ్యమంత్రి వివరించారు.ఈసందర్భంగా తెలంగాణరైజింగ్ విజన్‌రూపకల్పన అమలుకు సంబంధించి లెటర్ ఆఫ్ ఇంటెంట్‌లను టోనీ బ్లెయిర్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ ఛేంజ్ (టిబిఐజిసి), తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధులు మార్చుకున్నారు.

# రైతుఖాతాల్లోకి చెప్పినంతా జమచేసాం

>> నిధులు వేయడం ప్రారంభించి 14-10-2019 నాటికి పూర్తి చేశారు. 132 రోజుల సమయం తీసుకుని రూ.6,125.54 కోట్ల నిధులు జమ చేశారు. 2019-20 యాసంగి కాలానికి సంబంధించిన రైతుబంధు నిధులను 28-1-2020న ప్రారంభించి 16-3-2020కి పూర్తి చేశారు. 48 రోజుల్లో రూ.4406.48 కోట్ల నిధులను విడుదల చేశారు. 2020-21 వాన కాలానికి సంబంధించిన రైతుబంధు నిధులను 22-6-2020 న ప్రారంభించి 8-12-2020 న పూర్తి చేశారు. 169 రోజుల్లో రూ.7288.70 కోట్ల నిధులను విడుదల చేశారు.2020-21 యాసంగి కాలానికి సంబంధించి 28-12-2020న ప్రారంభించి 22-3-2021కి పూర్తి చేశారు. 84 రోజుల్లో రూ.7367.32 కోట్ల నిధులను విడుదల చేశారు. 2021-22 వానాకాలంకి సంబంధించిన రైతుబంధు నిధులను 15-6-2021న ప్రారంభించి 25-6-2021న పూర్తి చేశారు. పది రోజుల్లో రూ.7360.41 కోట్ల నిధులు విడుదల చేశారు 2021-22 యాసంగి పంటలకు సంబంధించి 24-12-2021న ప్రారంభించి 20-1-2022న పూర్తి చేశారు. 27 రోజుల్లో రూ.7412.53 కోట్ల నిధులను విడుదల చేశారు. 2022-23 వానకాలానికి సంబంధించిన రైతుబంధు నిధులను 28-6-2022న ప్రారంభించి 5-9-2022న పూర్తి చేశారు. 69 రోజుల్లో రూ.7434.67 కోట్ల నిధులు విడుదల చేశారు. 2022-23 యాసంగి కాలానికి సంబంధించిన నిధులను 21-12- 2022 న ప్రారంభించి 18 -5-2023 న పూర్తి చేశారు. 148 రోజుల్లో రూ.7308.35 కోట్ల నిధులు విడుదల చేశారు. 2023- 24 వానాకాలానికి సంబంధించిన రైతుబంధు నిధులను 26-6-2023 న ప్రారంభించి 12-10-2023కు పూర్తి చేశారు. 108 రోజుల్లో రూ.7637.91 కోట్ల నిధులు విడుదల చేశారు. ప్రజా ప్రభుత్వం పాలనాపగ్గాలు చేపట్టగానే గత ప్రభుత్వ పెద్దలు ఎన్నికల ముందు వేయకుండా వెళ్లిపోయిన రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయడం ప్రారంభించారు.



జమ్మూ కాశ్మీర్‌లోని రాజౌరి జిల్లాలో బుధవారం భారీ వర్షాలు కురవడంతో వరద నీటిలో కొట్టుకుపోయిన వాహనం

# బనకచర్లను అడ్డుకుంటాం

>> చేరనున్నారని ఆయన పేర్కొన్నారు.అదేవిధంగా మేడిగడ్డ ,అన్నారం,సిందిళ్ళ బ్యారేజి లపై ఎన్.డి.ఎస్.ఏ ఇచ్చిన నివేదికలపై సమీక్షించినారు. పునరుద్ధరణ పనులకై ఎన్.డి.ఎస్.ఏ డిజైన్ కన్సల్టెంట్ గా వ్యహారిస్తుందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు .ఎన్.డి.ఎస్ ఏ ఇచ్చిన ఆదేశాలను సత్వరమే అమలులోకి తీసుకు రావాలని ఆయన అధికారులను ఆదేశించారు. పునరుద్ధరణ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు వీలుగా ప్రతివారం సమీక్షిస్తూ ఎప్పటికప్పుడు తనకు నివేదికను సమర్పించాలన్నారు.కేంద్ర జలసంఘం సూచనలకు అనుగుణంగా పనులను వేగవంతం చేయాలన్నారు.డిండి ప్రాజెక్ట్ పై ఆయన మాట్లాడుతూ భూసేకరణ విషయమై సంబంధిత జిల్లా కలెక్టర్లతో సమావేశం నిర్వహించాలన్నారు. శ్రీశైలం ఎడమ కాలువ పనుల పురోగతి పై సమీక్షించిన ఆయన పునరుద్ధరణ పనుల కోసమై అంతర్జాతీయ స్థాయి ఏజెన్సీ లతో చర్చించి ప్రతిపాదనలు స్వీకరిస్తున్నామన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం తో పునరుద్ధరణ పనులు చేపట్టే విధంగా అధికారులకు ఆదేశాలు ఇచ్చామని పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు ఖర్చుకు వెనకాడకుండా ముందుకు పోవాలని ఆయన అధికారులను ఆదేశించారు.అదే సమయంలో నీటిపారుదల శాఖలో పెండింగ్ లో ఉన్న పదోన్నతుల ప్రక్రియను వేగవంతం చేయాలని,బదిలీల తంతును వెంటనే పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.ప్రధాన ప్రాజెక్టులలో పూడిక తీత పనులపై ఆయన స్పందిస్తూ అనేక జలాశయాలు పూడికతో పూడి పోయి ఉన్నందున 20 నుండి 25 శాతం మేర నీటిసామర్థం తగ్గిన నేపద్యంలో కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన జాతీయ మార్గదర్శకాలకు అనుగుణంగా మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.నాగార్జునసాగర్,నిజాంసాగర్ తదితర ప్రాజెక్టుల పూడిక తీత పనులపై ఆయన అడిగి తెలుసుకున్నారుప్రత్యేకంగా నాగార్జునసాగర్ పూడిక తీత పనులను సత్వరం ప్రారంభించాలన్నారు.ఈ విషయమై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సమాచారం అందించాలని అధికారులను సూచించారు.దేవాదుల ప్రాజెక్టు మూడో దశ పనుల పురోగతితో పాటు సీతారామ ప్రాజెక్టుకు ప్రస్తుతం కేటాయించిన నిధుల పరిమితులకు లోబడి అదనపు ప్యాకేజి లను రూపొందించే అంశలపై అధికారులు దృష్టి సారించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

# 'స్థానిక' సమరం

>> తెలిపారు. వెంటనే గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని, లేదంటే పాత సర్పంచులకే బాధ్యతలు అప్పగించాలని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కోరారు. తెలంగాణ ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించిన అదనపు అడ్వొకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికల ప్రక్రియను చేపట్టాల్సి ఉందన్నారు.ఈ ప్రక్రియ పూర్తికావడానికి కనీసం మరో నెల రోజుల సమయం అవసరమని తెలిపారు. ఈ దశలో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ ఎన్నికల నిర్వహణపై గతంలో ఒకసారి హామీ ఇచ్చి కూడా ఎందుకు మీరు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఎన్నికల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది జి.విద్యాసాగర్ వాదనలు వినిపిస్తూ బీసీ రిజర్వేషన్లను ఖరారు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని తెలిపారు. ఇది పూర్తికాగానే గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు ఆమోదం తెలిపిన అనంతరం ప్రక్రియ పూర్తి చేయడానికి మరో రెండు నెలల సమయం పడుతుందన్నారు. దీనిపై న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ సకాలంలో ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే స్టేట్ ఎలక్షన్ కమీషన్ చొరవ తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసినందున ఆ దిశగా ఎందుకు చర్యలు తీసుకోలేదని అడిగారు. దీనికి న్యాయవాది సమాధానమిస్తూ రిజర్వేషన్ల ఖరారుతో పాటు ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వానిదేనన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి వచ్చే మూడు నెలల్లో గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని తీర్పును వెలువరించారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా వివిధ వర్గాలకు రిజర్వేషన్లు ఖరారు చేసి, ప్రకటించడానికి 30 రోజుల గడువు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు విజ్ఞప్తి చేసింది. 30 రోజుల్లో బాధ్యతలను నెరవేర్చి రాష్ట్ర ఎన్నికల సంఘానికి తమ సమ్మతి తెలియజేస్తామని చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యతను నెరవేర్చాక 60 రోజుల్లో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేస్తామని ఎన్నికల సంఘం హైకోర్టుకు తెలిపింది. అందరి వాదనలు విన్న అనంతరం తీర్పును రిజర్వు చేసిన హైకోర్టు.. రాజకీయవర్గాల్లో ఉత్కంఠకు తెరదించుతూ.. ప్రభుత్వం, ఎన్నికల సంఘం అభ్యర్థనలను పరిగణలోకి తీసుకుని సెప్టెంబర్ 30లోగా ఎన్నికలు జరపాలని ఆదేశిస్తూ తీర్పు వెల్లడించింది.

# రేర్ ఎర్త్ ఎగుమతులపై చైనా ఆంక్షలు

## ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించండి

## కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరిన మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్, జూన్ 25 ప్రభాతవార్త:** రేర్ ఎర్త్ ఎగుమతులపై చైనా విధించిన ఆంక్షలు తెలంగాణలోని తయారీ రంగంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయని, వెంటనే ఈ విషయంలో జోక్యం చేసుకుని ప్రత్యామ్నాయాలపై కేంద్రం దృష్టి సారించాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో ప్రత్యేకంగా సమావేశమై వినతి పత్రం సమర్పించారు. 'ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తికి అవసరమైన రేర్ ఎర్త్ మాగ్నెట్లు, కీలక ముడి పదార్థాలు, రసాయనాలు ఎక్కువగా చైనా నుంచే దిగుమతి అవుతున్నాయని తెలిపారు. ఈ తరహా పదార్థాల ఎగుమతులపై ఆ దేశం తాజాగా ఆంక్షలు విధించింది. ఆ ప్రభావం ఎలక్ట్రానిక్స్, ఈవీలు తయారు చేసే పరిశ్రమలపై పడిందన్నారు. రాబోయే రోజుల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగితే తీవ్ర నష్టం వాటిల్లుతుందని తెలిపారు. ముఖ్యంగా తెలంగాణలో తయారీ రంగంపై ఈ ప్రభావం ఎక్కువగా పడుతుంది అని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. ఎలక్ట్రానిక్స్, ఈవీ తయారీ పరిశ్రమలకు ఇబ్బంది కలగకుండా వాస్తవ పరిస్థితిని సమీక్షించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు.

రాష్ట్రంలో పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్రం పూర్తి స్థాయి సహకారం అందించాలని కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌ను మంత్రి శ్రీధర్ బాబు కోరారు. ముఖ్యంగా హైదరాబాద్-నాగ్‌పూర్, హైదరాబాద్-వరంగల్, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-విజయవాడ ఇండస్ట్రియల్ కారిడార్ల అభివృద్ధి వివరాలు వివరించారు. జహీరాబాద్‌లో అభివృద్ధి చేస్తున్న ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కింద అవసరమైన మౌలిక సదుపాయాల కోసం రూ.400 కోట్ల నిధులు పిఎం గతిశక్తి పథకం కింద మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా హైదరాబాద్-వరంగల్ ఇండస్ట్రియల్ కారిడార్ నిలిచిపోయిందని కేంద్రమంత్రికి శ్రీధర్‌బాబు వివరించారు. అయితే ఇందులో భాగంగాఉన్న ఫార్మా సిటీని ప్రభుత్వం ఇప్పుడు ఫ్యూచర్ సిటీగా అభివృద్ధి చేస్తోందని తెలిపారు. ఇందుకు సహకరించాలని కోరారు. అలాగే వరంగల్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధి సహా పలు నోడ్స్‌కు కేంద్రం నిధులు విడుదల చేసేలా చొరవ చూపాలని కోరారు.

**తెలంగాణకు ప్రాధాన్యం ఇవ్వండి...**

కేంద్రం ప్రతిపాదించిన 100 పారిశ్రామిక పార్కుల పథకం కింద తెలంగాణలో పార్కుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తిగా ఉందని, ఇప్పటికే ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తమ అభిప్రాయాలు పంపినట్లు గుర్తు చేశారు. ఈ ప్రాజెక్టులకు తగిన నిధులు మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరారు.

## రేపు ప్రావిడెంట్ ఫండ్ సమావేశాలు

**హైదరాబాద్, జూన్ 25, ప్రభాతవార్త :** ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వివిధ సంస్థల యాజమాన్యాలు, ఉద్యోగులకు జిల్లా అట్రీచ్ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించే విస్తృత లక్ష్యంతో 'నిధి ఆప్కే నికాబ్ - 2.0' (ఎన్ఎఎన్)ను నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ పిఎఫ్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 2025 నెలకు సంబంధించి ఈనెల 27వ తేదీన ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.45 గంటల వరకు ఈ సమావేశాలు జరుగుతాయి. వికారాబాద్ జిల్లాకు సంబంధించి తాండూరు మున్సిపల్ కార్యాలయంలోను, మహబూబ్‌నగర్ జిల్లా సమావేశం మెట్టుగూడ ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ కార్యాలయంలోను, రంగారెడ్డి జిల్లా సమావేశం ఆమన్‌గల్ మున్సిపల్ కార్యాలయంలో, నాగర్ కర్నూలు జిల్లా సమావేశం అచ్చంపేటలోని ఫారెస్ట్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ వైల్డ్‌లైఫ్ మేనేజ్‌మెంట్ డివిజన్ కార్యాలయంలోను జరుగుతాయి. అదేవిధంగా హైదరాబాద్ సమావేశం మణికొండలోని గోల్డెన్ టెంపుల్ రోడ్డులో గల ప్రతిభ హైస్కూలులోను, నారాయణపేట జిల్లా సమావేశం మక్తల్ మున్సిపల్ కార్యాలయంలోను, గద్వాల జిల్లా సమావేశం నది అగ్రహారంరోడ్డులోని సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఆపరేషన్స్) కార్యాలయంలోను, వనపర్తి జిల్లా సమావేశం పెబ్బేరు మున్సిపల్ కార్యాలయంలోను జరుగుతాయని ఆయన తెలిపారు. ఈ సమావేశాల్లో నిధి ఆప్కే నికాబ్ - 2.0 పథకానికి సంబంధించి యాజమాన్యాలకు, ఉద్యోగులకు అవగాహన కల్పించడం జరుగుతుందని ఆయన వివరించారు. ఆయా జిల్లాలోని వివిధ సంస్థల యాజమాన్యాలు, ఉద్యోగులు ఈ సమావేశాలకు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

## సిపిఎస్‌యు భూముల సమస్యను పరిష్కరించండి

### నష్టపరిహారం చెల్లించకుండా ప్రైవేట్‌కు బదలాయిస్తే రాష్ట్రానికి నష్టం

### ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించాలంటూ కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమార స్వామిని కోరిన మంత్రి శ్రీధర్ బాబు


**హైదరాబాద్, జూన్ 24 ప్రభాతవార్త:** తెలంగాణలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ(సిపిఎస్‌యు)లకు కేటాయించిన భూముల సమస్య పరిష్కారానికి కేంద్రం చొరవ చూపాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమార స్వామిని కోరారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమార స్వామిని కలిసి వినతి పత్రం సమర్పించారు. 1960లలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పన కోసం హైదరాబాద్ చుట్టుపక్కల, ఇతర ప్రాంతాల్లో విలువైన భూములను రాయితీ ధరకు హిందుస్తాన్ కేబుల్స్ లిమిటెడ్(324.87 ఎకరాలు), హిందుస్తాన్ ఫ్లోరోకార్బన్స్ లిమిటెడ్(126.33 ఎకరాలు), ఐడిపిఎల్(551.03 ఎకరాలు), హెచ్ఎంటి(888.05 ఎకరాలు) సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (2,272.85 ఎకరాలు), ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ(3,020 ఎకరాలు) తది తర సంస్థలకు కేటాయించిందని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు కేంద్ర మంత్రికి వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలోని సిపిఎస్‌యుల్లో కొన్ని మూత పడ్డాయి. మరికొన్నింటిలో ఉత్పత్తి నిలిచిపోయింది. ఫలితంగా ఆ పరిశ్రమలకు కేటాయించిన భూములు నిరుపయోగంగా మారాయి. కొన్ని సంస్థలు ఈ భూములను వాణిజ్య పరంగా వినియోగించుకునేందుకు వీలుగా ప్రైవేట్ సంస్థలకు బదలాయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయని తెలిపారు. సరైన పరిహారం చెల్లించకుండా భూములను ప్రైవేట్ కంపెనీలకు బదిలీ చేయడం వల్ల రాష్ట్రానికి తీవ్ర నష్టం జరుగుతుంది. ఇలాంటి తరుణంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రయోజనాలకు భంగం కలగకుండా నిరుపయోగంగా ఉన్న సిపిఎస్‌యు భూముల వినియోగానికి మార్గదర్శకాలు రూపొందించాలి అనికోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి త్వరలోనే ఈ సమస్య పరిష్కారానికి ఉన్నత స్థాయి సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లుగా మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

## విద్యుత్ షాక్‌తో తండ్రి, కొడుకు మృతి

**ఇల్లందు టౌన్, జూన్ 25, ప్రభాతవార్త:** ఇల్లందు మండలం మర్రిగూడెం గ్రామ పంచాయతీలోని ఎల్లాపురం గ్రామంలో బుధవారం తెల్లవారుజామున జరిగిన ఘోర విద్యుత్ షాక్ ఘటనలో తండ్రి, కొడుకు మృతి చెందారు. మరో మహిళ తీవ్రంగా గాయపడింది. గ్రామానికి చెందిన ఏనుగు నరసయ్య (55) తెల్లవారుజామున మూత్ర విసర్జన కోసం బాత్రూంకు వెళ్తుండగా, అనుకోకుండా విద్యుత్ తీగకు తగిలి షాక్‌కు గురయ్యాడు. తండ్రి ప్రాణాలతో కొట్టుమిట్టాడుతుండగా గమనించిన అతడి కుమారుడు ప్రవీణ్ (30), తండ్రిని కాపాడేందుకు హుటాహుటిన వెళ్లి ప్రయత్నించాడు. దురదృష్టవశాత్తు ప్రవీణ్ కూడా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. నరసయ్య భార్య ఎర్రమ్మ వారిద్దరినీ కాపాడేందుకు ప్రయత్నించగా ఆమె కూడా విద్యుత్ షాక్‌కు గురై స్పృహ కోల్పోయి గాయాలతో బయటపడింది. గ్రామస్థులు ఈ ఘటనను గమనించి వెంటనే ఎర్రమ్మను ఇల్లందులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతోంది. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకోగా స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. విద్యుత్ షాక్‌కు కారణమైన సాంకేతిక లోపంపై అధికారులు ఆరా తీస్తున్నారు.

## నోబెల్ శాంతిపురస్కారానికి ట్రంప్ పేరు నామినేట్!

### ప్రతినిధులసభ సభ్యుడు బడ్డీ కార్టర్ నోబెల్ కమిటీకి లేఖ



**న్యూఢిల్లీ,జూన్ 25:** నోబెల్ శాంతి పురస్కారం అందుకోవాలన్న తహతహ ట్రంప్‌లో రోజురోజుకూ పెరిగిపోతోంది. తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరును అమెరికా ప్రతినిదుల సభ సభ్యుడు బడ్డీకార్టర్ నార్వేలోని నోబెల్‌కమిటీకి ఒక లేఖను కూడా పంపిస్తూ ట్రంప్‌పేరు ప్రతిపాదిం చారు. అసాధ్యం అనుకున్న సంక్షోభాల్లో వేగంగా ఒప్పందాలు చేయించడంలోట్రంప్ కీలకపాత్రపోషించారు. ఇరాన్ ఇజ్రాయెల్ మధ్య శాంతి ఒప్పందానికి విశేష కృషిచేసారు. ప్రపంచంలోనే ఉగ్రవాదులను పోషించే అతిపెద్ద దేశానికి అత్యంత వినాశకర ఆయుధం అందకుండాచేసారు. ఆయన నాయకత్వాన్ని నోబెల్ పురస్కారంతో గుర్తించాలని ఆయన ఆ లేఖలో నోబెల్‌కమిటీకి విజ్ఞప్తిచేసారు. ఇరాన్ ఇజ్రాయెల్‌మధ్య 12 రోజులనుంచి జరుగుతున్న యుద్ధాన్ని ఆపుతూ ఆయన ఒప్పందం చేసారని ఆయన ప్రస్తావించారు. సహజంగా నోబెల్ శాంతి పురసానకరానికి ఆ దేశం జాతీయ పార్లమెంటు సభ్యులు, విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు, ఇతరులు నామినేషన్లు అందించవచ్చు. మరోవైపు నోబెల్ శాంతి బహుమతి తనను వరించకపోవచ్చని ఇటీవలే ట్రంప్ నిరాశను కూడా వ్యక్తంచేసారు. పేను ఏంచేసినా నాకు నోబెల్ రాదు. భారత్ పాక్‌మధ్య యుద్ధం ఆపినా, సెర్బియా కొసవాఓ మధ్య పోరాటం నిలిపినా తనకు మాత్రం లభించదని ఆయన నిర్వేదం వ్యక్తంచేసారు. ఈమేరకు తన ట్రూత్‌లో పోస్టుకూడా పెట్టారు. ట్రంప్‌పేరును ఉక్రెయిన్ చట్టసభ సభ్యుడు ఒలెక్జాండర్ మెరెఝూకో కూడా నోబెల్‌కు ప్రతిపాదించారు. అయితే అమెరికా అధ్యక్షుడు రష్యా ఉక్రెయిన్‌యుద్ధాన్ని ఆపడంలో విఫలం కావడంతో ఆనామినేషన్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించి తనకు ట్రంప్‌పై నమ్మకం పోయిందని వ్యాఖ్యానించారు. అలాగే ట్రంప్ పేరును పాకిస్థాన్ ప్రభుత్వం నోబెల్‌కు సిఫారసుచేసింది. ఆమర్నాడే ఆయన ఇరాన్‌పై బంకర్ బస్టర్ బాంబులతో దాడులుచేయించారు. ఈపరిశామంతో పాకిస్తాన్ షాక్‌కు గురయింది. పాక్‌ప్రతిపక్షాలు అధికార పక్షాన్ని తప్పుపట్టాయి. నోబెల్‌ప్రతిపాదనలు వెనక్కితీసుకోవాలని డిమాండ్‌చేసాయి. భారత్‌కూడా పాక్‌తో తమ ఘర్షణలను ట్రంప్ నిలువరించలేదని పలు పర్యాయాలు స్పష్టంచేసింది.

# అంజలి హత్యకేసులో ప్రధాన నిందితుడు శివ అరెస్టు

### సహకరించిన మైనర్లను జువెనైల్ కోర్టుకు తరలింపు

### వివరాలను వెల్లడించిన బాలానగర్ పోలీసు డిప్యూటీ కమిషనర్ సురేశ్‌కుమార్



బుధవారం మీడియా సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న బాలానగర్ డిపిసి సురేశ్‌కుమార్

**హైదరాబాద్ (కుత్బుల్లాపూర్), జూన్ 25 ప్రభాతవార్త:** కన్నతల్లి తనపై చూపేప్రేమ కనుమగవటాన్ని జీర్ణించుకోలేని ఆ అమ్మాయి ప్రేమికుడితో కలిసి హత్యకు రూపకల్పన చేసిన తీరు తీవ్రకలకలం రేపింది. జీడిమెట్ల పరిధిలోని న్యూలాల్ బహాదూర్‌నగర్‌లో మంగళవారం జరిగిన అంజలి హత్యపలు మలుపులు తిరుగుతూ అనేక కొత్త విషయాలు వెలుగుచూస్తున్నాయి. బుధవారం బాలానగర్ డిప్యూటీ పోలీసు కమిషనర్ సురేశ్‌కుమార్ తన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో హత్యలో మేయర్‌గా వున్న నిందితుడు సురేశ్‌అరెస్టువివరాలతో పాటు హత్యలో భాగస్వాములైన ఇద్దరు మైనర్ బాలిక, బాలుడి వివరాలను వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతిక విభాగంలో కళాకారిణిగా విధులు నిర్వర్తిస్తున్న అంజలికి ఇద్దరు కుమార్తెలు. మొదటి భర్త కుమార్తె పదవతరగతి చదువుతుంది. రోడ్డుప్రమాదంలో మొదటిభర్త చనిపోవడంతో మరో వివాహం చేసుకుంది. రెండవ భర్తకు కలిగిన చిన్న కుమార్తెపై ప్రేమ చూపుతూ మొదటిభర్త కూతురునైన తన ప్రేమ చూపకపోగా చిన్నకూతురు ముందే పెద్దకూతురును తిట్టడంతోపాటు అవమానించే తల్లిపై తీవ్రంగా కలతచెందింది. అంజలి తన పెద్దకూతురును నిర్లక్ష్యం చేయడంలో పెద్దకూతురు తన పదవతరగతికే శివ (19) అనే డిజె ఆపరేటర్‌తో ప్రేమలో పడింది. గతంలో శివ అంజలి వున్నఇంట్లోనే పక్కింట్లో అద్దెకు ఉన్నసమయంలో శివతో పెద్దకూతరు ప్రేమాయనం సాగించింది. ఈవిషయం తల్లికి నచ్చచెప్పి తమకు పెళ్లి చేసిపంపించాలని కోరింది. మొదట పెళ్లికి అంగీకరించిన అంజలి తిరిగి పదవ తరగతికే ప్రేమలు,పెళ్లి ఏంటని మంద లించి కూతరును బుద్ధిగా చదువుకోవాలని మందలించింది. దీనిని వ్యతిరేకించిన పెద్దకూతురు ప్రేమించిన శివతో అతని నల్లగొండ జిల్లా కట్టంగూర్‌కు వెళ్లిపోయింది. తనకూతురు కనిపించడం లేదని ఈనెల19న అంజలిజీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేయటం, పోలీసులు ప్రేమికులిద్దరితో మాట్లాడి రప్పించి మైనర్‌అయిన పెద్దకూతురును తల్లికి అప్పగించడం జరిగింది. దీనితో అంజలి పెద్దకుమార్తె తనతల్లి బతికివుండగా తమ పెళ్లి జరగదని ప్రియుడితో చర్చించి హత్యకు పథకం వేసింది. అయితే అంజలి తన కూతురు ప్రేమించిన శివ వద్దకూడా డబ్బులు వసూలుచేసేందుకు కుట్ర పన్నిందని తెలిసింది. దీనిలో భాగంగా సోమవారం సాయంత్రం తల్లి పూజ చేస్తున్న సమయంలో తన ప్రియుడు శివకు ఫోన్ చేయడం శివ తన మైనర్ సోదరుడిని తీసుకుని వచ్చి అం జలితో ప్రేమవ్యవహారంపై చర్చించడం ముగ్గురు కలిసి అంజలిని చున్నీతో గొంతునులిమి చంపడం తెలిసిందే. ఈ కేసులో మైనంలు అయిన అంజలి పెద్దకుతురు, శివ తమ్ము డిని జువైనల్ హోమ్‌కు పంపి హత్యలో ప్రధానపాత్ర పోశించిన శివను కోర్టుకు పంపి అనంతరం చర్లపల్లికి జైలుకు తరలిం చారు. విలేకరులసమావేశంలో బాలానగర్ అడిషనల్ డిసిపి పి.సత్య నారాయణ, ఎసిపి రమేశ్‌రెడ్డి, జీడిమెట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గడ్డంమల్లేశ్, డిటెక్టివ్ సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ కనకయ్య పాల్గొన్నారు.

# ఎమర్జెన్సీ పాలన దేశానికి ఓ మాయని మచ్చ

### ఇందిరను మించిన దురాలోచన రాహుల్ గాంధీది

### ప్రతిపక్ష ప్రభుత్వాలను కూల్చేందుకు 99 సార్లు 356 ఆర్టికల్‌ను దుర్వినియోగం చేసిన కాంగ్రెస్

### కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

**హైదరాబాద్, జూన్ 24 ప్రభాతవార్త:** దేశంలో ఎమర్జెన్సీ పాలనకు 50 ఏళ్లు నిండాయని, 1975 జూన్ 25 నుండి 21 నెలలపాటు ఎమర్జెన్సీ పాలన పేరుతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి దేశ ప్రజల గొంతును నొక్కేశారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికార దాహానికి ఎమర్జెన్సీ పాలన ఓ నిదర్శనం. అధికారాన్ని నిలుపుకోవడానికి రాజ్యాంగ విరుద్ధంగా ఎన్ని అడ్డదారులైన తొక్కేందుకు, చివరకు ప్రజల ప్రాణాలను తీసేందుకు, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేందుకు కాంగ్రెస్ పార్టీ వెనుకాడదనే దానికి ఎమర్జెన్సీ పాలనే ఓ ఉదాహరణ అని అన్నారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన ప్రతిపక్ష నాయకులను, ఆర్ఎస్ఎస్, ఏబివిపి, జనసంఘ్ నాయకులను మీసా కింద జైళ్లలో పెట్టారని, పత్రికలపై సెన్సార్ విధించారని అన్నారు. పౌరుల ప్రాథమిక హక్కులను హరించారు. మానవ హక్కులను, స్వేచ్ఛను హరించి వేశారని, ప్రశ్నించిన ఎంపిల సభ్యత్వాన్ని కూడా రద్దు చేసిన నీచమైన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన డిఎస్‌పి రెడ్డి, జంగారెడ్డి, వి.రామారావు, జూపూడి యజ్ఞ నారాయణ, పివి చలపతి రావు, వెంకయ్య నాయుడు, సిహెచ్ విద్యాసాగర్ రావు, ఇంద్రసేనా రెడ్డి, అశోక్ యాదవ్ తదితర ఏబివిపి, జనసంఘ్ కార్యకర్తలతోపాటు చాలా మంది సంఘ్ పరివార్ కార్యకర్తలను అరెస్ట్ చేసిన చరిత్ర కాంగ్రెస్‌దే అన్నారు. ఎమర్జెన్సీ కాలంలో సంజయ్ గాంధీ బృందం చేసిన అరాచకాలకు అంతులేదని, ఎమర్జెన్సీ పాలనతో విసిగిన ప్రజలు కాంగ్రెస్‌ను ఓడించినా ఆ పార్టీ నేతల్లో మార్పు రాకపోవడం సిగ్గు చేటు అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్నంత కాలం రాష్ట్రాల్లోని ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలను కాంగ్రెస్ కూలదోసారని, 1947 నుంచి 2014 వరకు రాష్ట్రాల్లోని ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాన్ని కూలదోసేందుకు కాంగ్రెస్ ఏకంగా 90 సార్లు ఆర్టికల్ 356ను దుర్వినియోగం చేసిందన్నారు. అబద్ధాలను ప్రజల్లోకి ప్రచారం చేయడం, ఎన్నికల యంత్రాంగంపై నిరాధార ఆరోపణలు, మైనారిటీల బుజ్జగింపు, ఓటుబ్యాంకు రాజకీయాలు, విభజన రాజకీయాలు, ఎన్నికల హింస, ఓటర్లను ప్రలోభ పెట్టడం, రాజ్యాంగం దాని సూత్రాల పట్ల గౌరవం లేకపోవడం వంటివి కాంగ్రెస్ లక్షణాలు అన్నారు. బిజెపి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని తారుమారు చేస్తుందని, రిజర్వేషన్లను నాశనం చేస్తుందని, ఎస్సీ, ఎస్టీ, ఓబిసి రిజర్వేషన్లను బిజెపి రద్దు చేస్తుందని పార్లమెంట్ ఎన్నికల్లో తప్పుడు ప్రచారం చేసి ఓట్లు పొందాలని చూసిన కాంగ్రెస్‌కు దేశ ప్రజలు తగిన బుద్ధి చెప్పినా ఆ పార్టీ నేతలు మారలేదని అన్నారు. ఈ విషయంలో రాహుల్ గాంధీ నానమ్మ ఇందిరాగాంధీని మించి పోయారన్నారు. భారత దేశాన్ని అస్థిరపరచడంలో, బలహీనపరచడంలో విదేశీ శక్తుల పాత్ర ఉందనే సాకుతో అధికారాన్ని నిలుపుకునేందుకు ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధిస్తే, అధికారం కోసం ఆయన మనవడు రాహుల్ గాంధీ వివిధ దేశాల్లో పర్యటిస్తూ ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉదనే అనే ముసుగులో భారత్ లో పాశ్చాత్య దేశాల జోక్యం అవసరమంటూ నిస్సిగ్గుగా వేడుకుని దేశ ప్రతిష్టను దెబ్బతీసేందుకు యత్నించారని అన్నారు. ఇకనైనా కాంగ్రెస్ కుటిల రాజకీయాలను, చీకటి ఒప్పందాలను వీడి ప్రతిపక్షంగా ప్రజల పక్షాన నిలబడాలి. పార్లమెంట్ సమావేశాల్లో ప్రజాసమస్యలపై అర్థవంతంగా చర్చ జరిగేందుకు సహకరించాలని, వాటికి పరిష్కార మార్గాలను సూచించాలని కోరుతున్నానని అన్నారు.

# సంవిధాన్ హత్యాదివస్‌కు 50 యేళ్లు

### జార్ఖండ్ ఝరియా మాస్టర్‌ప్లాన్‌కు 5940కోట్లు

### పుణె మెట్రో విస్తరణకు 3626 కోట్లు

### అంతర్జాతీయ పొటాటో సెంటర్ ఏర్పాటుకు రూ.115.5కోట్లు

### కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు



**న్యూఢిల్లీ,జూన్ 25:** ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఆర్థికవ్యవహారాలకేబినెట్‌కమిటీ బుధవారం సమవాఏశం అయి నిర్ణయాలను ఆమోదించింది. సమావేశం ప్రారంభంకాగానే ముందు ఎమర్జెన్సీ బాధితులకు నివాళిగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించి.. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా తీర్మానాన్ని ఆమోదించింది. ఈ ఏడాదితో సంవిధాన్ హత్యాదివస్‌కు 50 ఏళ్లు పూర్తయిందని కేబినెట్ వివరాలను కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. శుభాంశు శుక్లాతో కూడిన మిషన్ విజయవంతంగా అంతరిక్షంలోకి ప్రవేశించడాన్ని స్వాగతించింది. 140 కోట్లమంది భారతీయుల ఆశయాలను శుభాంసు అంతరిక్షంలోకి మోసుకెళ్లారని శుభాంశుతోపాటు ఇతర వ్యోమగాములందరినీ అభినందించింది. మరో తీర్మానానికి ఆమోదం తెలిపిన మంత్రివర్గం పుణె, ఆగ్రాలలో పలు ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మంగళవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో అత్యవసర పరిస్థితి ప్రకటనకు 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కేంద్ర మంత్రివర్గం తీర్మానాన్ని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ చదివి వినిపించారు. 'ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గం ఈ రోజు అత్యవసర పరిస్థితిపై పోరాడిన లెక్కలేనన్ని మంది త్యాగాలను గుర్తుంచుకోవాలని నిర్ణయించింది. రాజ్యాంగాన్ని హత్య చేసే ప్రయత్నాన్ని విఫలం చేసిన ఈ ప్రజాస్వామ్య వాదులకు కేంద్ర మంత్రివర్గం నివాళులర్పించిందని పేర్కొన్నారు. పుణే మెట్రో రైలు ప్రాజెక్టు దశ2ను కేబినెట్ ఆమోదించిందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఈ రెండు ఎలివేటెడ్ కారిడార్లు 12.75 కి.మీ. విస్తరించి 13 స్టేషన్లు ఉంటాయని తెలిపారు. చాందినీ చౌక్, బవ్ధాన్, కోత్రుడ్, ఖరడి, వాఘోలి వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న శివారు ప్రాంతాలను కలుపుతాయని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టును నాలుగు సంవత్సరాలలోపు పూర్తి చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అలాగే జార్ఖండ్‌లోని ఝరియా బొగ్గు గనుల నిర్వాసితుల పునరావాసానికి ఝరియా మాస్టర్ ప్లాన్‌కింద రూ.5,940 కోట్లు కేటాయిం చినట్లు పేర్కొన్నారు. నిర్వాసిత కుటుంబాలకు ఆర్థిక స్వావలంబన కల్పించడం కోసం నైపుణ్య శిక్షణ, స్థిరమైన ఉపాధి అవకాశాలను కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలోని సింగ్నాలో దక్షిణాసియా ప్రాంతీయ కేంద్రం ఆఫ్ ది ఇంటర్నేషనల్ పొటాటో సెంటర్ ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీనికి రూ. 111.5 కోట్లు కేటాయించింది. ఆహారం, పోషకాహార భద్రత, రైతుల ఆదాయం, ఉపాధి కల్పనను పెంచడం దీని ప్రధాన ప్రధాన లక్ష్యప్రపంచంలోనే రెండో అతిపెద్ద బంగాళాదుంప ఉత్పత్తి చేస్తున్న దేశం భారత్ కాగా ఇందులో ఉత్తరప్రదేశ్ ముందువరుసలో ఉన్నది. పొటాటో సెంటర్ ఏర్పాటుతో బంగాళాదుంప ఉత్పత్తి, ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, రవాణా, మార్కెటింగ్, విలువ గొలుసులో గణనీయమైన ఉపాధి అవకాశాలను సృష్టించే సామర్థ్యం పెరుగుతుందని పేర్కొ న్నారు. అలాగే, యూపీలో ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపింది. యూపీ గౌతమ్‌బుద్ధ నగర్‌లో రూ.417కోట్లతో ఈఎంసీ క్లస్టర్ ఏర్పాటు చేయనున్నది కేంద్రం.

## 13గేట్ల ద్వారా దిగువకు.. జూరాలకు పెరుగుతున్న వరద

### 92,000 క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదు

**మహబూబ్‌గర్ బ్యూరో, జూన్ 25, ప్రభాతవార్త:** ప్రియదర్శిని జూరాల డ్యామ్ కు వరద క్రమంగా పెరుగుతున్నది. ఎగువ ప్రాంతం కర్ణాటక నుంచి వరద పోటెత్తడంతో జూరాల నిండుకుండలా మారింది. దీంతో 13 గేట్ల ద్వారా దిగువన శ్రీశైలం జలాశయానికి నీటి విడుదల కొనసాగుతున్నది. బుధవారం జూరాలకు 92,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా ఏడు గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేశారు. జూరాల కెపాసిటీ 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం జూరాలలో 8.010 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. పవర్ హౌస్ కు 33,169 క్యూసెక్కులు స్పిల్ వే ద్వారా 51779 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతున్నది. అదేవిధంగా బీమా లిఫ్టు -1కు 650 క్యూసెక్కులు, కోయిల్ సాగర్ లిఫ్ట్ కు 315 క్యూసెక్కులు, ఆర్డీఎస్ కెనాల్ కు 150 క్యూసెక్కులు,ఎడవ కాలువకు 550, క్యూసెక్కులు, కుడి కాలువకు 298 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 85805 క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదయింది.

# తరగతి గదిలోకి ఆవు మెదడు!

### వివాదాస్పదమైన ఓ టీచర్ ప్రదర్శన

### హిందూ సంఘాల ఆందోళన, టీచర్‌పై కేసు నమోదు

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి,యాలాల, జూన్ 25, ప్రభాతవార్త :** తరగతి గదిలో విద్యార్థులకు ఆవు మెదడు తెచ్చి ప్రదర్శించిన ఓ సైన్స్ టీచర్ నిర్వాహకం వివాదాస్పదంగా మారింది. వికారాబాద్ జిల్లా యాలాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న సైన్స్‌టీచర్ ఖాసీంబీ మంగళవారం పదవ తరగతి విద్యార్థులకు పాఠ్యాంశంలో భాగంగా ఆవు మెదడు తెచ్చి దాని భాగాలను చూపించారు. ఇది ఆవు మెదడని, తన భర్త ఆవు మాంసం ఇంటికి తెచ్చారంటూ ఆమె విద్యార్థులకు చెప్పడంతో తరగతి గదిలో ఆందోళనకు గురైనారు. తరగతి గదిలో దుర్వాసన వ్యాపించడంతో సహచర ఉపాధ్యాయులు కూడా ఆమెను ప్రశ్నించగా ఆవు మెదడు అని సమాధానం ఇచ్చారు. దాంతో బుధవారం విద్యార్థుల తల్లి దండ్రులు, భజరంగ్‌దళ్, బీజేపీ, హిందూ వాహినీ, ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున యాలాల మండల కేంద్రంలో ఆందోళన వ్యక్తం చేశారు. స్కూలు ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేయడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రూరల్ సీఐ నాగేష్, ఎస్సై గిరన్న సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మాజీ ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా కూడా అక్కడికి చేరుకుని ఆందోళనకారులను సముదాయించారు. దాంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. పోలీసులు సమగ్ర విచారణ జరిపి టీచర్‌పై కేసు నమోదు చేస్తున్నట్లు ప్రకటించారు. దాంతో హిందూ సంఘాలు ఆందోళన విరమించాయి.

**వివాదాస్పద సైన్స్ టీచర్ సస్పెన్షన్**

వివాదాస్పద నిర్ణయం తీసుకున్న యాలాల జడ్పీహెచ్ఎస్ (బాలికల) సైన్స్ టీచర్‌ను సస్పెండ్ చేస్తూ డీఈవో రేణుకాదేవీ ఆదేశాలు జారీ చేశారు. సైన్స్ టీచర్ ఖాసీంబీ తరగతి గదిలోకి ఆవు బ్రేయిన్‌ను తెచ్చి చూపిస్తూ పదో తరగతి విద్యార్థులకు పాఠాలు భోధించినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని డీఈవో తెలిపారు. ఈ సంఘటనపై వచ్చిన ఫిర్యాదు ఆధారంగా మండల విద్యాధికారి రమేష్ బుధవారం ప్రాథమికంగా విచారణ జరిపారు. స్కూల్‌లో పనిచేస్తున్న సహచర ఉపాధ్యాయులను, విద్యార్థులను అడిగి వివరాలు సేకరించారు. అనంతరం డీఈవోకు సమగ్ర నివేదిక సమర్పించారు. సీరియస్‌గా తీసుకున్న డీఈవో సదరు ఉపాధ్యాయురాలుపై వేటు వేశారు.

## పెండింగ్ బిల్లులపై మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు

### మాజీ సర్పంచ్‌ల జెఎసి అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్

**హైదరాబాద్, జూన్ 25 ప్రభాతవార్త:** దీర్ఘకాలంలో పెండింగ్‌లో ఉన్న మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లును ఇప్పించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని మాజీ సర్పంచ్‌ల జేఏసీ అధ్యక్షుడు యాదయ్య గౌడ్ మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు బుధవారం ఫిర్యాదు చేశారు. అప్పులబాధతో రోజుకో సర్పంచ్ మరణిస్తున్నా స్పందించనిప్రభుత్వంపై చర్య తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## కొండపై మోస్తరుగా భక్తులు

**తిరుమల,జూన్ 25 ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం గత ఇరవైరోజులుగా భక్తులతో కిటకిటలాడిన తిరుమల బుధవారం ఉదయానికి కొంత మేరకు తగ్గింది. ఉదయం 6గంటలకు వైకుంఠమ్‌లోని 21కంపార్టుమెంట్లలో భక్తులు



దర్శనానికి వేచివున్నారు. సర్వదర్శనానికి 14గంటల సమయం నిరీక్షిస్తున్నారు. సాయంత్రానికి వైకుంఠం క్యూకాంప్లెక్స్ లలోని కంపార్టుమెంట్లు నిండాయి. భక్తులకు సంతోషకరమైన మహాలఘు దర్శనం చేయించేలా అధికారులు ఏర్పాట్లుచేశారు. క్యూలైన్లలో భక్తులకు సకల సౌకర్యాలు అందుతున్నాయి. సాయంత్రం వరకు 41వేలమంది భక్తులు శ్రీవారిని దర్శనం చేసుకున్నారు. ఎస్ఇడి దర్శనాలకు నాలుగు గంటల సమయం, టైమ్‌స్లాట్ దర్శనాలకు మూడుగంటల సమయం పడుతుంది.

## అందరికీ మంచి జరగాలి : ఎమ్మెల్సీదువ్వాడ

**తిరుమల,జూన్ 25ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనం సంతృప్తిగా చేసుకు



న్నామని, స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని ఎంఎల్‌సి దువ్వాడ శ్రీనివాస్ ఆకాంక్షించారు. బుధవారం ఉదయం విఐపి బ్రేక్‌లో ఆయన దువ్వాడ మాదురితో కలసి స్వామిని దర్శించుకున్నారు. టిటిడి అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఎమర్జెన్సీ చీకటిరోజులు గుర్తుంచుకునేలా యువతలో అవగాహన : బిజెపి

**తిరుపతి,జూన్ 25ప్రభాతవార్తప్రతినిధి:** మన రాజ్యాంగాన్ని బలహీన పరిచి దేశంలో అత్యవసర పరిస్థితి విధించడంఒక చీకటి అధ్యాయమని, దీన్ని మనం ఎప్పటికీ మరచిపోలేమని బిజెపి కేరళ రాష్ట్ర కో ఇన్‌ఛార్జి అపరాజిత సారంగి



తెలిపారు. 1975లో అప్పటి అత్యవసర పరిస్థితిని వ్యతిరేకించిన వ్యక్తులను జైల్లో పెట్టిన అదే పార్టీ ఇప్పుడు ఏవేవో మాట్లాడుతుందన్నారు. దేశంలో అప్పటి ఇందిరాగాంధీ ప్రభుత్వం ఎమర్జాన్సీ విధించి 50ఏళ్ళు పూర్తయిన సందర్భంగా బుధవారం తిరుపతిలో ఓ సమావేశం హాలులో తిరుపతి జిల్లా బిజెపి అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, రాష్ట్రనేత భానుప్రకాశ్‌రెడ్డి, జల్లిమధుసూదన్, జిల్లా సాంస్కృతిక విభాగం గుండాల గోపీనాథరెడ్డి, నాయకులు సుబ్రమణ్యంయాదవ్, మల్లారపురవిప్రసాద్, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి తదితరులతో కలసి అపరాజిత సారంగి మేధావుల సదస్సులో పాల్గొన్నారు. ఆనాటి పరిస్థితులు ప్రదర్శనను తిలకించారు. ఎమర్జెన్సీ సమయంలో ప్రాణాలు కోల్పోయిన వారిని స్మరించుకుంటూ రెండు నిమిషాలు మౌనంపాటించారు. చీకటి అధ్యాయాన్ని ఎవరూ మరచిపోలేరన్నారు.

## రైలు ఢీకొని వ్యక్తి మృతి

**కోవూరు (నెల్లూరు), జూన్ 25, ప్రభాతవార్త :** వేసి ఉన్న గేటు లోంచి దూరివచ్చిన ఎస్.కె హుస్సేన్ భాష (68) రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి పడుగుపాడు రైల్వే గేట్ ప్రాంతంలో జన శతాబ్ది రైలు ఢీకొనడంతో ఈ పరిస్థితిచోటు చేసుకుంది. పెద్ద పడుగుపాడు ప్రాంతానికి చెందిన ఎస్కే హుస్సేన్ భాష స్థానిక బజాజ్ సెంటర్లో మంచాలు అల్లుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి పని ముగించుకొని మోపెడ్‌లో ఇంటికి వెళుతుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది.

సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ T.S లిమిటెడ్
ఆపరేషన్ సర్కిల్, సరూర్‌నగర్
సంక్షిప్త టెండర్ ప్రకటన నం.02/2025-26
[illegible] www.tgsouthernpower.org [illegible] 8712472302.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్/ఎలక్ట్రికల్, OP/సరూర్‌నగర్ సర్కిల్, హైదరాబాద్
DIPR.No.4102-PP/CL/Advt/1/2025-26, తేది: 25.06.2025

వార్త

పోగొట్టుకున్న ధనాన్ని తిరిగి సంపాదించుకోవచ్చు. కానీ పోగొట్టుకున్న కాలాన్ని తిరిగి సంపాదించలేం. కనుక ధనం కన్నా కాలం విలువైనది.

-సైరన్

# 'అణు'వంత రహస్యం!


ఎలాగోలా యుద్ధం ముగిసింది కాని వాటి తాలూకు సందేహాలు ఇంకా ఉండనే ఉన్నాయి. అది తాత్కాలికమా, శాశ్వతమా అన్న విషయాల్లో ప్రేక్షకులు, వీక్షకులు ఎటూ తేల్చుకోలేకపోవచ్చు. అసలేం జరిగింది అన్న అంశాలపై లోతు విషయాలు ఆయా దేశాలకే తెలుసు తప్ప మరొకరికి తెలుసుకోవడం సాధ్యం కాదు. కొండమాళిగలో ఉన్న 408 కెజిల యురేనియం ఎక్కడికి పోయింది? అన్న ఊహాగానాలే తప్ప అసలుసిసలు వివరాలు బయటపడలేదు. దీని విషయంలో ఇఆరనన అత్యంత జాగరూకత వహించినట్లేఉంది. లేకుంటే ఈ పాటికి 'యురేనియం పంచాయతి' పెద్దఎత్తున జరిగేఉండాలి. ఎవరి వ్యూహాలతో వారు ముందుకుదిగినా ఎవరు నెగ్గారు? ఎవరు తగ్గారు? అనే విషయాలను క్రోడీకరించుకోవాల్సి వస్తే కష్టనష్టాలు ఇరువురికీ సమపాళ్లే. కానీ ఇరాన్‌లో దుర్భేద్యమైన 'ఫోర్డో' అణు తయారీ కేంద్రంలోపలి చిదంబర రహస్యమే ఎవరికీ అంతుబట్టడం లేదు. ప్రస్తుతం జరిగింది 12 రోజుల యుద్ధానికి తాత్కాలిక ముగింపు మాత్రమే. ఇప్పటికే ప్రపంచంలో రష్యా–ఉక్రెయిన్, ఇజ్రాయెల్– గాజా యుద్ధాలతో సతమతమవుతుండగా మధ్యలో భారత్,పాక్ యుద్ధం చెలరేగి విరామ చెప్పుకొంది సరికదా! ఇరాన్ ఇజ్రాయెల్ దేశాలమధ్య అణు సంబంధిత విరోధం కలిగి యుద్ధాన్ని ఓ స్థాయికి తీసుకెళ్లాయి. అమెరికా ఖతార్‌ల మధ్యవర్తిత్వంలో కాల్పుల విరమణ ఒప్పందంతో కొంత వరకు పశ్చిమాసియా శాంతించినట్లే. అలా అనివారు అదే మాటమీద నిలబడతారని చెప్పలేం. ఈ యుద్ధంలో 'ఆపరేషన్ రైజింగ్ లయన్' పేరిట ఇరాన్‌పై ఇజ్రాయెల్‌కు చెందిన 200 యుద్ధవిమానాలు దాడులు చేశాయి. ఇరాన్ అణు కేంద్రాలతోపాటు యురేనియం కన్వర్షన్ ప్లాంట్లు, క్షిపణి అభివృద్ధి కేంద్రాలు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కోర్ (ఐఆర్‌జిసి) కేంద్రాలను ఇజ్రాయెల్ సమూలంగా నాశనం చేసింది. ఇరాన్, ఇజ్రాయెల్ అణుయుద్ధానికి నేపథ్యమైన ఇరాన్ అణుకార్యక్రమం గురించి చెప్పుకోవాల్సివస్తే, ఇరాన్‌అణు కార్యక్రమాన్ని ఆపాలనే ఆరాటంతోఅందులో పనిచేస్తున్న 10 మంది ఇరాన్ సైంటిస్ట్‌లను ఇజ్రాయెల్ బలగాలు 'ఆపరేషన్ నార్నియా'తో మట్టుపెట్టింది. ఎవరికీ తెలియని ఓ రహస్య ఆయుధాన్ని ఇజ్రాయెల్ వాడింది. ఎంతో పకడ్బందీ ప్రణాళికతో వ్యూహరచన చేసే ఇజ్రాయెల్ ఇరాన్ 'ఫోర్డో' స్థావరం ఎక్కడుందో తెలుసుకోగలిగింది తప్ప అక్కడ వున్న యురేనియం తరలింపును గ్రహించలేకపోయింది. ఈ యుద్ధంలో చెప్పుకోవాల్సింది ఇరుదేశాల వ్యూహ ప్రతివ్యూహాల గురించే. ఇరాన్‌లోని మూడు అణుపరిశోధనా కేంద్రాలపై అమెరికా ఆరుబంకర్ బస్టర్ బాంబులతో దాడిచేసినా అక్కడ ఉన్న యురేనియాన్ని ఎలా ముందుగానే ఎక్కడికి తరలించారన్నది అంతుపట్టని రహస్యంగా మారింది. ఈ యురేనియం శుద్ధి విషయంలోనే ఆది నుంచి ఇజ్రాయెల్ మండిపడుతోంది. దాని ఆచూకీ ఒదిలిపెట్టి భూగర్భ స్థావరాలను ధ్వంసం చేయడమొక్కటే ఇజ్రాయెల్ విజయంగాచెప్పాలి. అంతకు ముందు అమెరికా ఫోర్స్ దూకుడుపనికొచ్చింది. ఆ తర్వాత కానీ తెలియలేదు. యురేనియం నిల్వలు స్థలం మారాయని,ఈ విషయంలో సమాచారంసేకరణలో ఇజ్రాయెల్ వెనుకబడి ఉన్నట్లు అర్థమౌతోంది. కాగా ఈ యురేనియం నిల్వలపై ప్రపంచ దేశాలన్నీ ఆందోళన చెందుతున్నాయి. ప్రస్తుతం మాయమైన యురేనియం నిల్వలతో 10అణ్వస్త్రాలను తయారు చేయొచ్చనిఅమెరికా ఉపాధ్యక్షుడు జెడివాన్స్ వెల్లడించారు. విశేషమేమిటంటే యురేనియం నిల్వలను రహస్యప్రదేశానికి గుట్టుచప్పుడు కాకుండా తరలించారు. తాజాగా ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికాలు ఏదైనా అణ్వస్త్ర ఒప్పందం చేసుకోదలిస్తే మొన్నటి దుర్ఘటనలో మాయమైన యురేనియం నిల్వలను సాకుగా చూపించి 'గొంతెమ్మ కోరికలు' బయట పెట్టే అవకాశముంది. అంటే షరతులు పెట్టే స్థాయిలో ఇరాన్ ఉంటుందన్నమాట. ఇరాన్‌లోని నతాంజ్,ఇస్ఫహాన్, ఫోర్డో, అణు పరిశోధనా కేంద్రాలపై దాడికి ముందుగానే యురేనియం నిల్వలతోపాటు కొన్ని కీలక పరికరాలను వేరొక సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఆ సమయంలో తీసిన ఉపగ్రహ చిత్రాలను పరిశీలిస్తే వరుసగా బయట16 ట్రక్కులు కనిపించాయి. వీటనన్నిటినీ మరో భూగర్భ అణుస్థావరానికి పంపించి ఉంటారని ఇజ్రాయెల్ ఊహిస్తోంది. 'కొండను తవ్వి ఎలుకను పట్టిన' చందాన ఇరాన్ అణు కేంద్రాలపై దాడి వ్యవహారం కనిపిస్తోంది. భారీ స్థాయిలో అమెరికా బి2బంకర్లను, ఆపై ఇజ్రాయెల్ 12 బంకర్ బస్టర్ బాంబులు వేసినా అక్కడ దొరికిందేమీ లేదు. పట్టుకున్నదేమీలేదు. స్థావర విధ్వంసం తప్ప. అణ్వస్త్ర సంపదనేమీ పట్టుకోలేకపోయారు. తమ దేశ శాంతియుత ప్రయోజనాల కోసమే తాము అణుశక్తిని ఉపయోగించుకునే చట్టబద్ధ హక్కులకోసమే తమ ఆరాటమని, వాటిని తప్పక కాపాడుకోగలమని ఇరాన్‌అధ్యక్షుడు పెజిష్కియాన్ స్పష్టం చేశారు. అయినా ఇరాన్ వాదనను ఇజ్రాయెల్ నమ్మకపోగా యుద్ధం ప్రకటించింది. దాదాపు 700 మంది సైనికులు,పౌరుల మరణం తప్ప ఇజ్రాయెల్ సాధించిందేమీలేదు. అమెరికాదాడులకు ముందేఇరాన్‌లోని ఫోర్డో కేంద్రం 408కిలోల యురేనియం నిల్వలను తరలించినట్లు ఇజ్రాయెల్ అధికారులే ధృవీకరించారు. కాగా దానిని ఎక్కడికి తరలించారో మరో మానవ మాత్రుడికి తెలియకుండా ఇరాన్ జాగ్రత్త పడింది. అణ్వాయుధాల తయారీని ఇజ్రాయెల్ ఆపగలదో లేదో ఇప్పుడే చెప్పలేం. ఆ దాచిపెట్టిన యురేనియంతో ఈసారి ఇరాన్ నిజంగానే అణ్వాయుధ తయారీకి పూనుకోవచ్చు. ఏమయినా అసలు 'అణు' రహస్యం తెలిస్తే కదా!

పని మూడు రుగ్మతలను నిర్మూలిస్తుంది. అవి విసుగు, దుర్గుణం, దారిద్ర్యం.



తిరుక్కురళ్

పేద జనానికి తిండి తిప్పలు సమకూర్చినప్పుడే నిజమైన నాగరికత ఉన్నట్లు లెక్క.



వి. జాన్సన్

## ప్రజావాక్కు



### డిఎస్సీ నోటిఫికేషన్స్‌పై అభ్యర్థుల ఆశలు

తెలంగాణరాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో మోడల్ స్కూల్స్‌లో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ జారీకోసం లక్షలాదిమంది అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 11062 టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసి పరీక్షల నిర్వహణ నియామక ప్రక్రియ త్వరగా పూర్తి చేశారు. గతఏడాది డిఎస్సీ నిర్వహణ సమయంలోనే మరో 5వేల టీచర్ పోస్టులు భర్తీచేస్తామని జాబ్ క్యాలండర్ ఇస్తామని పేర్కొన్నారు. వివిధరకాల సమస్యలవల్ల జాబ్ క్యాలండర్ వాయిదా పడిన విషయంతెలిసిందే. గత డిఎస్సీ పరీక్షలు జరిగి దాదాపు సంవత్సరం అవుతుంది కాబట్టి పదవి విరమణ ద్వారా ఏర్పడిన ఖాళీలు క్లియర్ వెకెన్సి కలిపి దాదాపు 10వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కాబట్టి త్వరగా డీ.ఎస్సీ పైనిర్ణయం తీసుకోవాలి.

**- రావుల రామ్మోహన్ రెడ్డి, హైదరాబాద్**

### పాకిస్థాన్ స్వయంకృతాపరాధమే

పహెల్గాం దాడి తరవాత దాయాదిదేశం చేస్తున్న దాష్టికాలను, అది చేస్తున్న కుయుక్తులను ప్రపంచం ముందు పెట్టడంలో ఆదేశ ప్రభుత్వ నేతలు మేము తీవ్రవాదులకు రక్షణగా ఉన్నాం. మాదేశం అలావాలంగా ఉంది అనిపించడంలో భారత్ సఫలీకృతమైంది. మరోవైపు సింధు నది జలాలు నిరాకరించడం వల్ల ప్రపంచ వ్యాపితంగా ఇతర దేశాలు పాకిస్థాన్‌కు మద్దతుగా మాట్లాడే సాహసం చేయ డంలేదు.అంటేదానికి ప్రధానకారణం పాకిస్థాన్ స్వయకృతా పరాదమే కారణం. గయానా లాంటి చిన్న దేశాలకు కూడా ఈ భావజాల వ్యాప్తి చేయడంలో భారత్ విజయం సాధించడం గమనించదగ్గ అంశం.

**- భారత అవినాష్, జనగామ**

### కఠిన నిబంధనలు రూపొందించాలి

డమ్మీస్కూళ్లు, అనుమతులులేని కోచింగ్ సెంటర్ల వల్ల దేశవ్యాప్తంగా విద్యావ్యవస్థపై తీవ్రమైన ప్రభావం పడుతోంది.నాణ్యతలేనిబోధన,మౌలిక సదుపాయాల లోపం, తప్పుడు ప్రకటనలు, అసత్య హామీలు వంటి సమస్యలు పెరిగిపోతున్నాయి. విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడే పరిస్థితి నెలకొంది. దేశవ్యాప్తంగా కోచింగ్ సెంటర్లపై నియంత్రణకు మార్గదర్శకాలు రూపొందించనుంది.

**- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం**

### పాఠశాలల పనితీరు సూచికలు

ప్రపంచంలోనే అతిపెద్ద విద్యా వ్యవస్థ భారతదేశంలో ఉంది. మన దేశంలో 14.72 లక్షలకు పైగా పాఠశాలలు, 98 లక్షల మంది ఉపాధ్యాయులు, దాదాపు 24.8కోట్లమంది విద్యార్థులు ఉన్నారు. 2022-23,2023-24 కు సంబంధించి దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలోని పాఠశాలల పనితీరుసూచిక (పిజిఐ) 2.0 నివేదికను కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ విడుదలచేసింది.ఈతరహా నివేదికను కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ 2017 నుంచి విడుదల చేస్తోంది. దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలు,8కేంద్రపాలిత ప్రాంతాలలోని పాఠశాలల పనితీరుకు గ్రేడులను విడుదల చేసింది. ఈగ్రేడులలో రెండుతెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్ ,తెలంగాణలు మెరుగుపడ్డాయి. ఎపిలో ఈ విద్యాసంవత్సరంలో ప్రభుత్వం తీసుకువచ్చిన పాఠశాలల పునర్వ్యవస్థీకరణ, మధ్యాహ్నభోజనంలో సన్నబియ్యం, పాఠశాలకు వెళ్లే ప్రతి విద్యార్థికి తల్లికి వందనం,బడిబాట కార్యక్రమం తదితర కారణాలవల్లవిద్యా సంవత్సరాలలో పాఠశాలల పనితీరు నివేదికలో ఎపి స్థానం మరింత మెరుగుపడుతుంది.

**-చల్లా చంద్రశేఖర్ రెడ్డి, కలువాయి, నెల్లూరు జిల్లా**

### ప్రభుత్వ విద్యపై దృష్టిసారించాలి

ఉభయ రాష్ట్రాలో పదవతరగతి, ఇంటర్‌లో ప్రభుత్వ నిర్వహణలో ఉన్న ఎన్నోగురుకుల,జవహర్ నవోదయ, కేంద్రీయ విద్యాలయాల్లో విద్యార్థులు చక్కని ప్రతిభ చూపించారు. పోటీ పరీక్షలకు వెళ్లి ఉత్తమ ప్రమాణాలు గల కళాశాలల్లో ప్రవేశం పొందారు. ఆటలు,విజ్ఞాన ప్రదర్శనల్లోకూడా తమ నైపుణ్యాన్ని చూపారు. ప్రభుత్వ పాఠశాలలు మన సొంతవి. వాటి అభివృద్ధి కోసం ప్రభుత్వంతో పాటు మన బాధ్యత కూడా గుర్తెరగాలి. దీని వల్ల ఇతర రాష్ట్రాల్లో మనం ముందుతుంటాము. మన ఇంటిలో పండిన పళ్ళు మనము ఫలితం పొందాలి.

**-బొల్లోజు మేఘనాథం, విశాఖపట్నం**

### మారుతున్న సమాజం

సమాజంలో చాలా మార్పు కానవస్తోంది. నీతి నియమాలకు, సామరస్యధోరణులకు చోటులేకుండాపోతోంది. డబ్బుకు,సుఖాలకు ప్రాధాన్యత పెరిగిపోతోంది.అత్యాచారాలు,హత్యలు, అవినీతి, విడాకులు, అక్రమ సంబంధాలు వంటి దుష్పరిణామాలు అధికం అయిపోతున్నాయి.అసాంఘిక శక్తులు బలపడిపోతున్నాయి. ప్రభుత్వాలు, చట్టాలు, న్యాయాలు వీటిని అరికట్టడంలో విఫలం అవుతున్నాయి.

**-బి.ఎన్.సత్యనారాయణ, హైదరాబాద్**

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఆర్థిక పంపకాల్లో కేంద్రానికి సమదృష్టి అవసరం!

**భారత్ అవలంబిస్తున్న ప్రజాస్వామ్య విధానానికి పాలనలోని పద్ధతులకు ఒక విలువా, గౌరవమూ, అన్ని దేశాలలో కేవలం ప్రజాస్వామ్యం ఉన్న వాటిల్లోనే కాదు, మరో పాలనాపద్ధతి అవలంబిస్తున్న దేశాల్లో కూడా ఉంది. దానికి కారణం అంతర్గతంగా దేశంలో ఎన్ని పార్టీలు ఉన్నా ఎంతగా విభిన్న దృక్పథాలున్నా దేశం బయట మాత్రం అందరి నాయకుల, ప్రజల ధోరణి ఒక్కటే అని భారతదేశం కులమతాలకు అతీతంగా ప్రవర్తిస్తుందని ఆ గొప్ప పేరును తాత్కాలిక అవరోధాలతోటి, వైషమ్యాలతోటి, మేము గొప్ప అంటే మేము గొప్ప అనే అహంకార ధోరణులతోటి పోగొట్టుకోకూడదు. గౌతమ బుద్ధుడు, శంకరాచార్యులు, జాతిపిత మహాత్మాగాంధీ వారసులు అని ప్రపంచమంతటా భారతీయతనూ, భారతీయులను గౌరవిస్తూ విలువనిస్తూ, శ్లాఘిస్తున్నప్పుడు మనను మనం తక్కువ చేసుకోకూడదు. అందుకే ఏ పార్టీ అటు కేంద్రంలో కానీ ఇటు రాష్ట్రాల్లోకానీ, ప్రభుత్వంలోనూ అధికారంలో ఉన్నా అందరికీ పాలనాపరంగా, ఆర్థికంగా సమదృష్టితో చూడకతప్పదు.**



రావులపాటి సీతారాంరావు

కేంద్ర,రాష్ట్రాల ప్రభుత్వాల మధ్య సామరస్య ధోరణి పొరపొచ్చాలు లేకుండా ఉండాలంటే ఆర్థిక వెసులుబాటు ఇరు ప్రభుత్వాలకూ మేలు చేకూర్చే విధంగా ఉండాలి. అప్పుడే 'డబుల్ ఇంజన్' ప్రణాళిక విభిన్న పార్టీలు, ప్రభుత్వాలలో ఉన్నా, సర్దుకొనిపోయే 'ధోరణి' ప్రజల హితవు కోసం ఏర్పడుతుంది, ఫలిస్తుంది. పదహారవ ఫైనాన్స్ కమిషన్ (ఎస్.ఎఫ్.సి) చేసే ఆర్థిక వనరులను పంచే రికమెండేషన్స్ ఏప్రిల్ ఒకటి 2026 నుంచి ఆమోదించబడితే పరిగణనలోకి వస్తాయి. అరవింద్‌పనగారియా ఈ కమిషన్ ఛైర్మన్. 28 రాష్ట్రాలలో 22 రాష్ట్రాలు (బిజెపి ఏలుబడిలో ఉన్న రాష్ట్రాలతోసహా) టాక్స్ కలెక్షన్ల నుంచి ఎక్కువ షేర్‌ను అంటే 41శాతం నుంచి 50శాతం వరకు కోరాయని అనటం గమనార్హం. వారు ఆవిధంగా కోరటం సమంజసమే! అయితే కేంద్ర ప్రభుత్వం ఈ 'డివిజబుల్ పూల్'ను కుదించి తమ టాక్స్ రెవెన్యూ వనరులను 'నాన్ షేరబుల్ సెసెస్, సర్‌చార్జీల ద్వారా పెంచుకోవటం విశేషం. 2015-16 నుంచి 2019-20 (పాండమిక్ సంవత్సరాల ముందు ఉన్న 12.8శాతం టాక్స్ రెవెన్యూను2020-21, 2023-24 (బడ్జెట్ ఎక్స్‌పెండీచర్) 18.5శాతంకు పెంచుకుంది. దీనివల్ల రాష్ట్రాలు ఎక్కువగా ఆర్థిక వనరుల కోసం కేంద్రం మీద ఆధారపడే పరిస్థితి అనివార్యంగా మారింది. రాష్ట్రాలు ఆర్థిక వనరులను పెంచుకొనే స్థితి (జిఎస్టీ తర్వాత ) అంతంత మాత్రమే. అయితే జిఎస్టీ కలెక్షన్స్ బాగానే ఉన్నా, తగ్గిపోయిన రాష్ట్రాల వనరులను ఏవిధంగా పెంచుకోవాల్నో ఇంకా కేంద్రం తేల్చని పరిస్థితి. ప్రస్తుతం అమలులో ఉన్న ఫార్ములా జనాభా నిష్పత్తిని ఎక్కువగా పరిగణనలోకి తీసుకోవటంతో ఆర్థిక వనరులు రాష్ట్రాలకు పంచటంలో చాలా తేడాలు రాష్ట్రాల మధ్య కొట్టొచ్చినట్లు కన్పడుతున్నాయి. జనాభాను కేంద్ర మార్గదర్శక సూత్రాల ప్రకారం అదుపులో పెట్టటం దక్షిణాది రాష్ట్రాలకు శాపంలా మారింది. బాధ్యతాయుతంగా పాలన సాగించటం వల్ల ఈ రాష్ట్రాలు తక్కువ ఆర్థిక వనరులను జనాభా దామాషా మీద పొందటం ఒక విధంగా పెనాల్టీగానే చెప్పాల్సిన పరిస్థితి. ఉత్తరాది రాష్ట్రాలు (ప్రత్యేకంగా రాష్ట్రాలను ఇక్కడ బట్టబయలు చేయనవసరం లేదు)కానీ జనాభా పెరుగుదలను లెక్క చేయకుండా పాలన సాగించటం వల్ల ఈ విధమైన విభజన వారిని ఎక్కువ లాభం పొందేస్థాయికి కేంద్ర ఫార్ములా ఎత్తేసినట్లుగా, దక్షిణాది రాష్ట్రాల వారు ఎత్తిచూపటంలో తప్పులేనే లేదు. ఈ విధంగానే ఆర్థిక వనరులను రాష్ట్రాలకు ఫైనాన్స్ కమిషన్ రికమెండేషన్ల పేరుతో పంచటం, మార్పు లేకుండానే ఈ పరిస్థితిని కొనసాగించటం, 'కోపరేటివ్ ఫెడరలిజం'ను ప్రక్కకు నెట్టేసినట్లే. బిజెపి ప్రభుత్వం ఈ మూల సూత్రాన్ని పదేపదే వల్లించటం మాటలకు చేతలకూ ఉన్న వ్యత్యాసాన్ని బట్టబయలు చేస్తుంది. ఛైర్మన్ పనగారియా కూడా 50శాతం(9పాయింట్ల పెంపుతో) కేంద్రం తమవంతు రాష్ట్రాల స్థితిగతులకు కుదుపు తెచ్చినట్లే అని భావించారు.



అయితే ప్రస్తుత పహెల్గాం సంఘటన వల్ల డిఫెన్స్ ఖర్చులు, ఆయుధాల ఉత్పత్తి సరఫరా, ఆర్మీని ఆధునీకరించడం చేపట్టాల్సిన అవసరం రావటంతో ఇబ్బడిముబ్బడిగా పెరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి. డిఫెన్స్ కోసం చేసే ఖర్చులే కాకుండా ఇతర ప్రాజెక్టుల ఖర్చులను కాదనలేక, పెరుగుదలకు అనివార్యంగా కేంద్రం భావించకపోవటం కమిషన్ పరిగణనలోకి తీసుకోక తప్పటంలేదు. అందుకనే కమిషన్,కేంద్రం షేరును తగ్గించటం కష్టసాధ్యం అనుకొని రాష్ట్రాల షేర్‌ను 41శాతం దగ్గరే స్థిరీకరించే ఆలోచనను చేయక తప్పటం లేదేమో! అయితే ఈ పరిస్థితి వల్ల ఫెడరల్ విధానంలో లొసుగులు ఏర్పడే అవకాశం ఉంది. వ్యక్తికైనా, సమాజానికి అయినా, రాష్ట్రాలకైనా, ఆర్థిక పరిస్థితుల మెరుగుదల ఉంటేనే ప్రజాస్వామ్య విధానం పట్ల మరింత పటిష్టమైన నమ్మకం ఏర్పడుతుంది. అంత పెరుగుదల (టాక్స్ రెవెన్యూ పంపకంలో) లేకపోయినా కొంతలో కొంత పెంచటం రాష్ట్రాలకు తృప్తి కలిగిస్తుంది. ఫైనాన్స్ కమిషన్ సెసెస్‌ను సర్‌చార్జీలను అడ్డగోలుగా వాడకుండా శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించాల్సిన అవసరం ఉంది. నిర్దిష్టంగా కేంద్రం గ్రాస్ టాక్స్ రెవెన్యూను స్థిరీకరించడం కూడా కమిషన్ సూచించటం మంచిది. జనాభా ఫార్ములా మీదనే పూర్తిగా ఆధారపడకుండా, రాష్ట్రాలలోని సుపరిపాలనను కేంద్రం పరిగణనలోకి తీసుకొని ఆర్థిక వనరులు వసూలు చేయబడ్డ పన్నులను విభజించటంలో, నిష్పక్షపాతంగా వ్యవహరించినప్పుడే 'కోపరేటివ్ ఫెడరలిజమ్'కు నిజమైన అర్థం ఏమిటో ప్రజల ప్రయోజనార్థం తెలిసివస్తుంది. రాష్ట్రాల అవసరాలు, విస్తీరణ, ప్రభుత్వాల సమర్థపాలన కూడా కేంద్రం పరిగణనలోకి తీసుకొని ఆర్థిక వనరులను పెంచటంలో సమతుల్యతతోపాటు సమంజసమైన వైఖరిని అవలంబించాలి. మా ప్రభుత్వం అధికారంలో ఉంది కాబట్టి మళ్లీ ఎన్నికలలో గెలవటానికి ఎక్కువ వనరులు వారి పలుకుబడి ఈసారి ఏలుబడిలో ఉన్న రాష్ట్రాలకే సమకూర్చాలని ఏ కేంద్ర ప్రభుత్వం భావించినా అది ప్రజాస్వామ్య వ్యవస్థకు పనికిరాదు. పైగా ఆ వ్యవస్థ విలువలను తగ్గించి మరోదిశగా పాలన సాగించినట్లే!. ఆ అవగాహన ఉన్నప్పుడే కేంద్రం అన్ని రాష్ట్రాల ప్రజలను సమదృష్టితో చూడటమే కాకుండా సుపరిపాలన,ప్రజాక్షేమం, అభివృద్ధికి తోడ్పడినట్లు అని మన ప్రజలే కాదు, ప్రపంచమంతా భావిస్తుంది.భారత్ అవలంబిస్తున్న ప్రజాస్వామ్య విధానానికి పాలనలోని పద్ధతులకు ఒకవిలువా,గౌరవమూ, అన్ని దేశాలలో కేవలం ప్రజాస్వామ్యం ఉన్న వాటిల్లోనే కాదు, మరో పాలనాపద్ధతి అవలంబిస్తున్న దేశాల్లో కూడా ఉంది.దానికి కారణం అంతర్గతంగా దేశంలో ఎన్ని పార్టీలు ఉన్నాఎంతగా విభిన్న దృక్పథాలున్నా దేశం బయటమాత్రం అందరి నాయకుల, ప్రజల ధోరణి ఒక్కటే అని భారతదేశం కులమతాలకు అతీతంగా ప్రవర్తిస్తుందని ఆ గొప్ప పేరును తాత్కాలిక అవరోధాలతోటి, వైషమ్యాలతోటి, మేము గొప్ప అంటే మేము గొప్పఅనే అభిజాత్య అహంకారధోరణులతోటి పోగొట్టు కోకూడదు. గౌతమ బుద్ధుడు, శంకరాచార్యులు, జాతిపిత మహాత్మా గాంధీవారసులు అని ప్రపంచమంతటా భారతీ యతనూ, భారతీయులను గౌరవిస్తూ విలువనిస్తూ, శ్లాఘి స్తున్నప్పుడు మనను మనం తక్కువ చేసుకోకూడదు. అందుకే ఏ పార్టీ అటు కేంద్రంలో కానీ ఇటు రాష్ట్రాల్లో కానీ,ప్రభుత్వంలోనూ అధికారంలో ఉన్నా అందరినీ పాలనాపరంగా, ఆర్థికంగా సమదృష్టితో చూడకతప్పదు. ●

# 'వ్యయ'సాయం కోరుతున్న వ్యవసాయం

డి జె మోహన రావు

వ్యవసాయం భారతదేశానికి కేవలం ఓ ఆర్థిక కార్యకలాపం కాదు. అది దేశానికి గుండెచప్పుడు,సంస్కృతిలో అంతర్లీనంగా పెనవేసుకున్న జీవన విధానం. కోట్ల మందికి అన్నం పెడుతూ, సగం మందికి పైగా జనాభాకు ఉపాధిని కల్పిస్తూ దేశ స్థూల విలువ జోడింపుకి గణనీయమైన వాటాను అందిస్తోంది. ఒకప్పుడు ఆహార కొరతతో అల్లాడిన మన దేశం, నేడు అనేక వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేసే స్థాయికి ఎదగడం హరిత విప్లవం, తదనంతర విధానాల విజయాన్ని చాటుతుంది. వ్యవసాయ రంగం ఎంత కీలకమైనదైనా, అది అనేక లోతైన, నిర్మాణాత్మక సవాళ్లతో సతమతమవుతోంది. ఈ సమస్యలు దాని పూర్తి సామర్థ్యాన్ని దెబ్బతీయడమే కాకుండా, కోట్లాది మంది రైతుల ఆర్థిక స్థిరత్వాన్ని కూడా కదిలిస్తున్నాయి. అత్యంత తీవ్రమైన సమస్యలలో ఒకటి భూకమతాల విపరీతమైన విభజన. తరతరాలుగా వారసత్వ పంపకాల వల్ల చిన్న కమతాలుగా మారిపోయి ఆర్థికంగా లాభదాయకం కాని పరిమాణాలకు కుంచించుకుపోతున్నాయి. నాబార్డ్ సర్వే ప్రకారం దేశంలో సగటు భూకమతాల పరిమాణం 2016 17లో 1.08 హెక్టార్ల నుంచి 2021-22 నాటికి కేవలం 0.74 హెక్టార్లకు తగ్గింది. ఇది యాంత్రీకరణను, వనరుల సరైన వినియోగాన్ని కష్టతరం చేస్తుంది. సాగునీటి సౌకర్యాలు పెరిగినప్పటికీ, దేశంలో దాదాపు 50-51శాతం నికర సాగు విస్తీర్ణం రుతుపవనాలపై ఆధారపడిన వర్షాధారంగానే ఉంది. ఇది వాతావరణ మార్పులు, అస్తవ్యస్తమైన వర్షపాతం, కరువులు, వరదలు వంటి తీవ్ర వాతావరణ పరిస్థితులకు వ్యవసాయాన్ని గురిచేస్తుంది. సమయానికి, సరసమైన ధరలకు అప్పులు అందకపోవడం చిన్న, సన్నకారు రైతుల కష్టాలను మరింత పెంచుతోంది. చాలా మంది రైతులు అనధికార వడ్డీ వ్యాపారులపై ఆధారపడి అధిక వడ్డీ రేట్లతో అప్పుల ఊబిలోకి కూరుకుపోతున్నారు. కిసాన్ క్రెడిట్ కార్డ్ పథకం కొంతవరకు ఆదుకున్నప్పటికీ, కౌలుదారులు, భూమి పత్రాలు లేనివారికి రుణాలు అందడంలో సవాళ్లున్నాయి. ఇక పంట కోతానంతర నష్టాలు, సరఫరా గొలుసులోపాలను చూస్తే తగినంత శీతల గిడ్డంగులు, ఆధునిక గోదాములు, పటిష్టమైన రవాణా వ్యవస్థలు లేకపోవడంవల్ల చాలా వ్యవసాయ ఉత్పత్తులు మార్కెట్‌కు చేరకముందే పాడైపోతున్నాయి. 2022లో నాబార్డ్ కన్సల్టెన్సీ సర్వీసెస్ అధ్యయనం ప్రకారం ధాన్యం, ఇతర తృణధాన్యాలలో 3.89శాతం, 5.92శాతం నష్టాలు, పండ్లు, కూరగాయలలో 5శాతం, 15శాతం నష్టాలు సంభవిస్తున్నాయి. ప్రత్యక్ష మార్కెటింగ్ అనుసంధానాలు లేకపోవడం వల్ల మధ్యవర్తుల




ద్వారా విక్రయించాల్సివచ్చి రైతుల లాభాలు తగ్గుతున్నాయి. ఈ సవాళ్లను ఎదుర్కోవడానికి సాంకేతిక పురోగతి, పటిష్టమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి, లక్షితవిధాన సంస్కరణలను సమగ్రంగా అమలు చేయాల్సిన అవసరం ఉంది. రైతు భూకమతాల విభజనవల్ల కలిగే నష్టాలను తగ్గించడానికి, చిన్న, సన్నకారు రైతులను ఏకం చేసే ఉత్పత్తిదారుల సంస్థలను బలోపేతం చేయడం అత్యవసరం. ఇవిఉత్పత్తిని పెద్దఎత్తున సేకరించడానికి, తక్కువ ధరకు ముడిసరుకులను కొనుగోలు చేయడానికి, యంత్రాలను పంచుకోవడానికి, మార్కెట్లో మెరుగైన ధరల కోసం సమిష్టిగా బేరం చేయడానికి వీలు కల్పిస్తాయి. 2028 నాటికి 10,000 కొత్తగా ఇటువంటి సంస్థలను ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ లక్ష్యం ఈ దిశగా ఒక ముఖ్యమైన అడుగు. ప్రతి బొట్టుకు అధిక పంట నినాదంతో మైక్రోఇరిగేషన్ పద్ధతులైన డ్రిప్, స్ప్రింక్లర్ వ్యవస్థలను వేగవంతం చేయాలి. వర్షపు నీటి సంరక్షణ, వాటర్‌షెడ్ అభివృద్ధి వంటి వాటిలో పెట్టుబడులు వాతావరణ మార్పులకు వ్యవసాయాన్ని మరింత తట్టుకునేలా చేస్తాయి. పంట కోతానంతర నష్టాలను తగ్గించడానికి, మార్కెట్ అనుసంధానాలను మెరుగుపరచడానికి ఆధునిక శీతల గిడ్డంగులు, శీతలీకరించిన రవాణా నెట్‌వర్క్‌లు, సమగ్రలాజిస్టిక్స్ పరిష్కారాలపై గణనీయమైన పెట్టుబడి అవసరం. భారత ప్రభుత్వం వ్యవసాయ రంగ సవాళ్లను పరిష్కరించడానికి అనేక చర్యలు చేపట్టింది. 2016 నుండి 2024 డిసెంబర్ వరకు సుమారు 95 లక్షల హెక్టార్ల భూమిని మైక్రోఇరిగేషన్ కిందకు తీసుకువచ్చారు. ప్రధాన మంత్రి కృషి సించాయీ యోజన పథకం దీనికి మద్దతునిస్తుంది. కిసాన్ క్రెడిట్ కార్డ్ పథకం ద్వారా డిసెంబర్ 31, 2024 నాటికి 7.72 కోట్ల మంది రైతులకు 10.05 లక్షలకోట్ల రుణపరిమితితో ప్రయోజనం చేకూరింది. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా 2025 ఫిబ్రవరి నాటికి 23.22 కోట్ల మందికిపైగా రైతులకు 1.75 లక్షల కోట్ల క్లెయిమ్‌లను పంపిణీ చేశారు. పిఎం కిసాన్ వంటి ప్రత్యక్ష ఆదాయ మద్దతు పథకాలు 2024 జూలై నాటికి 11 కోట్ల మందికి పైగా లబ్ధిదారులకు 3.24 లక్షల కోట్ల ప్రయోజనాలను అందించాయి. వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి కింద 1లక్ష కోట్ల పథకంలో, 2024 ఆగస్టు నాటికి 47,575 కోట్ల విలువైన 74,508 ప్రాజెక్టులకు అనుమతులు లభించాయి. ఇది గోదాములు వంటి కీలక ఆస్తులను సృష్టిస్తోంది. నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్ (ఇనామ్)లో 2024 అక్టోబర్ నాటికి 1.78 కోట్ల మంది రైతులు, 2.62లక్షలమంది వ్యాపారులు నమోదు చేసుకున్నారు.ఇది రైతువినియోగదారుల డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా మధ్యవర్తుల సంఖ్యను తగ్గించి, రైతులకు మెరుగైన ధరలను అందిస్తుంది. అనేకరంగాలపై వ్యూహాత్మకంగా దృష్టి సారించడం ద్వారా, నిరంతర విధాన మద్దతు, తాజా సాంకేతిక పురోగతులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా, భారతదేశం తన వ్యవసాయ రంగంలోని అపారమైన సామర్థ్యాన్ని నిజంగా ఆవిష్కరించగలదు. ●

# స్థానిక ఎన్నికల పోరుకు సిద్ధమవుతున్న పార్టీలు!

కామిడి సతీష్ రెడ్డి

స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతున్న నేపథ్యంలో రాజకీయ వర్గాల్లో ఒక్కసారిగా సందడి మొదలైంది. బిసి రిజర్వేషన్ల విషయాన్ని ప్రభుత్వం తేల్చితే షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది. రిజర్వేషన్ల అనంతరం రంగంలోకి దిగేందుకు నాయకులు సిద్ధం అవుతూ ఉన్నారు. జిల్లా మండల పరిషత్, పంచాయతీ ఎన్నికలకు వారంలో షెడ్యూల్ వస్తుందని చర్చ జరుగుతోంది. ఇటీవల మంత్రులు పలు సందర్భాలలో ఎన్నికల గూర్చి ప్రకటనలు చేస్తున్నారు. ప్రభుత్వం ఏ సమయంలోనైనా షెడ్యూల్ విడుదలచేసే అవకాశం ఉండటంతో అధికారులు సైతం సిద్ధంగా ఉన్నారు. గ్రామపంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌లు, మునిసిపాలిటీలకు పాలకవర్గాల గడువు ముగిశాక సకాలంలో ఎన్నికలు నిర్వహించలేకపోవడంతో ప్రస్తుతం అవన్నీ ప్రత్యేకాధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. పాలకవర్గాలు లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి నేరుగా వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు, వాటితో పాటు రాష్ట్రప్రభుత్వం జతచేయాల్సిన రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోవడంతో పల్లెలు, పట్టణాల్లో ఎక్కడి పనులక్కడే నిలిచిపోవడంతోపాటు పాలన గాడి తప్పింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బిసిలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇవ్వడంతో దాన్ని తక్షణం అమలు చేశాకే ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేస్తోంది. దీంతో ఎన్నికల్లో రిజర్వేషన్లపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశం సర్వత్రా ఆసక్తికరంగా మారింది. వార్డు మొదలు, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గం వరకు ఏ స్థానం, ఏ కేటగిరికి కేటాయిస్తారనే దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది.సుప్రీం కోర్టు నిబంధనల ప్రకారం అధికారిక రిజర్వేషన్లు 50శాతానికి మించి ఉండడానికి ఆస్కారం లేకపోవడంతో, తాజా కులగణన నివేదిక ప్రకారం రిజర్వేషన్ల అమలులో భాగంగా బిసిలకు తమ పార్టీ నుంచి 42శాతం సీట్లు కేటాయిస్తామని, జనరల్ స్థానాల్లో బిసిలకు ప్రాధాన్యం పెంచుతామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ఈ విషయంపై క్షేత్రస్థాయి నాయకుల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. ఎప్పుడైనా షెడ్యూల్ వచ్చే అంచనాలో అధికార యంత్రాంగం ఉంది. పంచాయతీరాజ్ సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సన్నద్ధమవుతున్న సంకేతాలతో అధికారయంత్రాంగం,పోటీ చేయా




లనుకునే ఆశావహులు అప్రమత్తమయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జెడ్‌పిటిసి ఎంపిటిసి స్థానాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. పోలింగ్, పోలీస్ సిబ్బంది నియామకానికి ఎంతమంది అవసరమవుతారనే అంశంలో ఇప్పటికే ప్రాథమికంగా సమాచారం సిద్ధం చేశారు. పరిషత్‌లకు పార్టీల ప్రాతిపదికన, గ్రామపంచాయతీలకు, వార్డు సభ్యులకు పార్టీ రహితంగా ఎన్నికలు నిర్వహించాల్సి ఉండడంతో, అందుకోసం వేర్వేరుగా బ్యాలెట్ పత్రాలు, గుర్తులను ఇప్పటికేసిద్ధం చేశారు. రిజర్వేషన్లను ఎలా ఖరారు చేయాలనే అంశంపై ప్రభుత్వం విధానపర నిర్ణయం తీసుకున్న మేరకు రిజర్వేషన్ల కోటా, కేటాయింపులు చేస్తారు. ముందుగా పరిషత్‌లకు, తదుపరి పక్షంరోజుల వ్యవధిలో గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఆలోచిస్తున్నట్టు తెలుస్తోంది. ముందుగా ఏ ఎన్నికలు నిర్వహించినా, ఫలితాలు ప్రకటించకుండా కోడ్ కొనసాగిస్తూ, ఎన్నికలు ముగించాలని, గ్రామాల్లో ఘర్షణలకు ఆస్కారం లేకుండా చూడడంతో పాటు, పాలనాపర ఇబ్బందులను అధిగమించవచ్చనేది ప్రభుత్వ ఉన్నతస్థాయి వర్గాల ఆలోచనగా అధికారులు చెబుతున్నారు. స్థానిక సంస్థలకు 2019లో జరిగిన ఎన్నికల్లో ఎస్టీలకు 7శాతం, ఎస్సీలకు 15 శాతం, బిసిలకు 25శాతం, మహిళలకు అన్ని కేటగిరిల్లో 50శాతం రిజర్వేషన్లు కేటాయించారు. జడ్పీటీసీ స్థానాలకు, ఎంపీపీ పదవులకు పంచాయతీరాజ్ కమిషనర్ స్థాయిలో జిల్లాల వారీగాకోటాను ఖరారు చేస్తే, జిల్లాల్లో కలెక్టర్ల నేతృత్వంలో ఆ కోటా ప్రకారం రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు అనుగుణంగా సీట్లను కేటాయించారు. ఎంపీటీసీ స్థానాలకు, సర్పంచ్ పదవులకు కలెక్టర్లస్థాయిలో మండలాల వారీగా కోటా ఖరారు చేసి, ఆర్డీవోల నేతృత్వంలో ఆయా మండలాల్లో సీట్లను కేటాయించారు. ఈసారి రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వం ఎలాంటి తుది నిర్ణయం తీసుకున్నా మొత్తం రిజర్వేషన్ల కోటా 50 శాతానికి మించకుండా నిబంధనలు రూపొందిస్తారని,ఆ మేరకు కోటా ఖరారు, సీట్ల కేటాయింపు గతం మాదిరిగానే చేపడతారా? లేక కోటా ఖరారు, కేటాయింపులపై మార్పులు, చేర్పులు తీసుకుంటారా? అనే విషయం తేలాల్సి ఉంది. ఈ వారంలోనే అన్ని అంశాలపై స్పష్టత వస్తుందని, వారంలోపే రిజర్వేషన్లపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని రాజకీయ, అధికార వర్గాల్లో చర్చసాగుతోంది. ఇప్పటికే గ్రామాల్లో, మండలాల్లో సర్పంచులుగా, ఎంపీటీసీ సభ్యులుగా, జడ్పీటీసీ, ఎంపీపీ పదవులపై ఆశలు పెంచుకున్న స్థానిక నాయకులు రిజర్వేషన్లు వారికి అనుకూలంగా వస్తే కదనరంగంలోకి దూకేందుకు అన్నిరకాలుగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పోటీ చేసే వారు ఆయా పార్టీల ప్రముఖులను ప్రసన్నం చేసుకుంటున్నారు. ●

# ఖండాంతర క్షిపణుల తయారీలో పాక్



## 5,500 కి.మీ దూరంలోని లక్ష్యాన్ని ఛేదించే సామర్థ్యం

### అమెరికా నిఘా సంస్థలు వెల్లడి

**వాషింగ్టన్,జూన్ 25:** పాకిస్థాన్ అత్యంత రహస్యంగా ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులను అభివృద్ధి చేస్తున్నట్లు అమెరికా నిఘా సంస్థలు సంచలన విషయాలు వెల్లడించాయి. ఈ క్షిపణులు 5,500 కిలోమీటర్లకు పైగా దూరంలో ఉన్న లక్ష్యాలను కూడా ఛేదించగలవని సమాచారం. భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్' అనంతరం, పాకిస్థాన్ చైనా సహాయంతో తమ ఆయుధ సంపత్తిని గణనీయంగా పెంచుకోవాలని నిర్ణయించుకున్నట్లు వాషింగ్టన్‌లోని నిఘా వర్గాలు రూపొందించిన ఒక నివేదిక స్పష్టం చేస్తోంది. ఇందులో భాగంగానే, అమెరికాలోని పలు కీలక ప్రాంతాలను లక్ష్యంగా చేసుకోగల సామర్థ్యం ఉన్న ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులను పాక్ రహస్యంగా తయారు చేస్తోంది. ఈ తరహా ఖండాంతర క్షిపణులను అభివృద్ధి చేయడం లేదా సమకూర్చుకోవాలని పాకిస్థాన్ ప్రయత్నిస్తే, ఆ దేశాన్ని అణ్వాయుధ ప్రత్యర్థిగా గుర్తిస్తామని అమెరికా అధికారులు స్పష్టం చేసినట్లు సదరు నివేదిక పేర్కొంది. తమ దేశానికి ముప్పు కలిగించే అవకాశం ఉన్న లేదా అణ్వాయుధాలు కలిగిన ఏ దేశాన్నైనా అమెరికా తన ప్రత్యర్థిగా ప్రకటిస్తుందని నివేదికలో తెలిపారు. ప్రస్తుతం రష్యా, చైనా, ఉత్తర కొరియాలను అమెరికా తమ శత్రుదేశాలుగా పరిగణిస్తోంది. కొంతకాలంగా పాకిస్థాన్ స్వల్ప, మధ్యశ్రేణి క్షిపణుల అభివృద్ధి పైనే ప్రధానంగా దృష్టి సారించింది. ప్రస్తుతానికి ఆ దేశం వద్ద ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులు (ఐసీబీఎం) అందుబాటులో లేవు. 2022లో పాకిస్థాన్ భూమి నుంచి భూమిపైకి ప్రయోగించే మధ్యశ్రేణి బాలిస్టిక్ క్షిపణి షాహీన్‌ని, అలాగే 2023లో మధ్యంతరశ్రేణి బాలిస్టిక్ క్షిపణి 'ఘౌరీ'ని విజయవంతంగా పరీక్షించింది. ఇదిలా ఉండగా, 'ఆపరేషన్ సింధూర్' కొనసాగుతున్న సమయంలోనే తాము 450 కిలోమీటర్ల పరిధి కలిగిన అబ్దాలి వెపన్ సిస్టమ్ క్షిపణిని పరీక్షించినట్లు ఇస్లామాబాద్ ప్రకటించింది. గత ఏడాది పాకిస్థాన్ చేపట్టిన సుదూర లక్ష్యాలను ఛేదించే బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమంపై అమెరికా పలు ఆంక్షలు విధించింది. ఈ క్షిపణి కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థ నేషనల్ డెవలప్‌మెంట్ కాంప్లెక్స్‌తో పాటు మరో మూడు సంస్థలతో అమెరికన్‌కంపెనీలు ఎలాంటి వ్యాపారకార్యకలాపాలునిర్వహించకుండా నిషేధం విధించింది. పాకిస్థాన్ ఇటువంటి క్షిపణులను తయారుచేయడ తమ దేశ భద్రతకు కూడా ముప్పేనని అమెరికా ఆందోళన వ్యక్తం చేసింది. అయితే, అమెరికా పక్షపాత ధోరణితో తమపై ఇటువంటి చర్యలు తీసుకుంటోందని పాకిస్థాన్ ఆరోపించింది.



## ఎమర్జెన్సీ.. ప్రజాస్వామ్య వ్యతిరేకతకు ప్రతీక: అమిత్‌షా

**న్యూఢిల్లీ, జూన్25:** కాంగ్రెస్ పార్టీపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హయాంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ప్రకటించిన అత్యవసర పరిస్థితి జాతీయ అవసరం కాదని, కాంగ్రెస్ ప్రజాస్వామ్య వ్యతిరేక మనస్తత్వానికి అది ప్రతీక అని అమిత్ షా ఆరోపించారు. కేవలం తన పదవిని కాపాడుకోవడానికి మాత్రమే అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ 1975, జూన్ 25న అత్యవసర పరిస్థితిని విధించారన్నారు. ఆ సమయంలో దేశంలో పత్రికా స్వేచ్ఛను హరించివేశారని, న్యాయవ్యవస్థ చేతులు కట్టేశారని, సామాజిక కార్యకర్తలను జైళ్లలో బంధించారని షా పేర్కొన్నారు. దీంతో ప్రజలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరగబడ్డారని తెలిపారు. ప్రభుత్వం నియంతలా మారినప్పుడు, దానిని పడగొట్టే శక్తి ప్రజలకు ఉంటుందని ఈ రోజు అందరికీ గుర్తు చేస్తోందని షా అన్నారు. అత్యవసర పరిస్థితి సమయంలో దేశంలోని ప్రజలు ఎన్నో హింసలు, బాధలు ఎదుర్కొన్నారని అమిత్‌షా అన్నారు. అప్పుడు వారు ఎదుర్కొన్న సమస్యలను నేటి తరానికి తెలియజేయడానికి బిజెపి ప్రభుత్వం జూన్25ను 'సంవిధాన్ హత్య దివస్'గా పాటిస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో ప్రతి భారతీయుడిలో వ్యక్తిగత స్వేచ్ఛ, ప్రజా స్వామ్య రక్షణ వంటి నియంతృత్వ శక్తులు మళ్లీ అటువంటి భయానక సంఘటలను పునరా వృతం చేయకుండా ఉంటాయని వ్యాఖ్యానించారు.



### కెప్టెన్ అభినందన్‌ను

## బంధించిన పాక్ మేజర్ హతం!

### మిలిటెంట్ల ఏరివేతలో టిటిపి కాల్పులకు మృతి

**న్యూఢిల్లీ,జూన్ 25:** భారత వైమానికదళ పైలట్, వింగ్ కమాండర్ అభినందన్ వర్ధమాన్‌ను 2019లో పాకిస్థాన్ సైన్యం అదుపులోకి తీసుకున్న ఘటనలో కీలక వ్యక్తి పాకిస్థాన్ ఆర్మీ మేజర్ మోయిజ్ అబ్బాస్ షా (37) ఉగ్రవాదుల దాడిలో మరణించారు. పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా రాష్ట్రంలో బుధవారం తెహ్రీక్ఇ తాలిబాన్ పాకిస్థాన్ (టీటీపీ) ఉగ్రవాదులతో జరిగిన తీవ్రస్థాయి ఘర్షణలో మేజర్ అబ్బాస్ షా ప్రాణాలు కోల్పోయినట్లు తేలింది. పాకిస్థాన్ సైన్యంలోని ఎలైట్ స్పెషల్ సర్వీస్ గ్రూప్ (ఎస్ఎస్‌జీ)లో అబ్బాస్ షా విధులు నిర్వర్తిస్తున్నారు. ఉగ్రవాదవ్యతిరేక ఆపరేషన్‌లో భాగంగా ఆయన బృందం కూంబింగ్ నిర్వహిస్తుండగా టిటిపి ఉగ్రవాదులు ఒక్కసారిగా కాల్పులకు తెగబడటంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుందని పాక్ సైనిక వర్గాలు అధికారికంగా ప్రకటించాయి. ఈ భీకర పోరులో మేజర్ అబ్బాస్ షాతో పాటు లాన్స్ నాయక్ జిబ్రానుల్లా అనే మరో సైనికుడు కూడా వీరమరణం పొందారని, భద్రతా బలగాలు జరిపిన ఎదురుకాల్పుల్లో 11 మంది ఉగ్రవాదులు హతమయ్యారని పాక్ సైన్యం వెల్లడించింది. 2019 ఫిబ్రవరి 27న బాలాకోట్ వైమానిక దాడుల తర్వాత రోజు, భారత గగనతలంలోకి చొరబడేందుకు ప్రయత్నించిన పాకిస్థానీ ఎఫ్16 యుద్ధ విమానాన్ని అప్పటి వింగ్ కమాండర్ అభినందన్ వర్ధమాన్ తన మిగ్21 బైసన్ విమానంతో వీరోచితంగా వెంటాడి కూల్చివేశారు. ఈ పోరాటంలో అభినందన్ విమానం కూడా దెబ్బతిని నియంత్రణ రేఖకు ఆవల పాకిస్థాన్ భూభాగంలో కుప్పకూలింది. దీంతో పారాచూట్ ద్వారా సురక్షితంగా కిందకు దిగిన ఆయన్ను పాకిస్థాన్ సైనికులు అదుపులోకి తీసుకున్నారు. ఆ సమయంలో అభినందన్‌ను బంధించిన సైనిక బృందంలో మేజర్ మోయిజ్ అబ్బాస్ షా కూడా ఉన్నారని, ఆయనను చిత్రహింసలు పెట్టడంలోనూ అబ్బాస్ షా పాత్ర ఉందని అప్పట్లో వార్తలు వచ్చాయి.

## 'చీకటి రోజు'కు 50 యేళ్లు



### దీనిని 'సంవిధాన్ హత్యా దివస్'గా జరుపుకుంటున్నామన్న ప్రధాని

### నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని విమర్శ

**న్యూఢిల్లీ,జూన్ 25:** భారతదేశ చరిత్రలో ఎమర్జెన్సీ ఒక చీకటి అధ్యాయమని, ఆ రోజులను ఏ భారతీయుడూ మరిచిపోలేరని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఇందిరా గాంధీ ప్రభుత్వం దేశంలో ఎమర్జెన్సీ విధించి నేటికి సరిగ్గా 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ రోజును దేశ ప్రజలతో పాటు తాము కూడా 'సంవిధాన్ హత్యా దివస్'గా పరిగణిస్తున్నామని తెలిపారు. ఎమర్జెన్సీ కాలంలో నాటి పాలకులు భారత రాజ్యాంగంలో పొందుపరిచిన విలువలను పూర్తిగా పక్కనపెట్టారని ప్రధాని మోడీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సమయంలో ప్రాథమిక హక్కులను కాలరాశారని, పత్రికా స్వేచ్ఛను దారుణంగా అణచివేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థులు, చివరికి సామాన్య పౌరులను కూడా అన్యాయంగా జైళ్లలో నిర్బంధించారని ఆరోపించారు. ఆ సమయంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్నే అరెస్టు చేసినట్లుగా అనిపించిందని మోడీ వ్యాఖ్యానించారు. ఎమర్జెన్సీ నాటి భయానక పరిస్థితులను ఏ భారతీయుడూ అంత తేలికగా మరచిపోలేరని ప్రధాని పునరుద్ఘాటించారు. ఆ దుర్మార్గమైన పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ప్రతి ఒక్కరికీ తాను సెల్యూట్ చేస్తున్నానని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడేందుకు సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు మొక్కవోని దీక్షతో పోరాటం చేశారని గుర్తుచేశారు. వారి అలుపెరగని పోరాటం వల్లే చివరికి ఎమర్జెన్సీని ఎత్తివేయాల్సి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగంలోని మౌలిక సూత్రాలను మరింత బలోపేతం చేస్తామని, వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని మోదీ తెలిపారు. పేదలు, అణగారిన వర్గాల ప్రజల కలలను సాకారం చేయడమే తమ ధ్యేయమని అన్నారు.

ఈ సందర్భంగా, ఎమర్జెన్సీకి 50 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో 'ది ఎమర్జెన్సీ డైరీస్' పేరుతో తాను ఒక పుస్తకాన్ని తీసుకురాబోతున్నట్లు ప్రధాని మోడీ వెల్లడించారు. ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌గా తన ప్రస్థానం, ఎమర్జెన్సీ రోజుల్లో నెలకొన్న క్లిష్ట పరిస్థితులు, తన అనుభవాలను ఆ పుస్తకంలో వివరంగా పొందుపరచనున్నట్లు ఆయన తెలిపారు. ఈ పుస్తకం ద్వారా నాటి చీకటి రోజులకు సంబంధించిన అనేక తెలియని విషయాలు వెలుగులోకి వస్తాయని భావిస్తున్నారు.

## మాకు దేశం ఫస్ట్...కొందరికి మోడీ ఫస్ట్

### శశిథరూర్ వ్యాసంపై మల్లికార్జున్ ఖర్గే చురకలు



**న్యూఢిల్లీ, జూన్25:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కాంగ్రెస్ నేత శశిథరూర్ ప్రశంసించడంపై ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా స్పందించారు. మాకు దేశమే ఫస్ట్, కానీ కొందరు వ్యక్తులకు మోడీయే ఫస్ట్ అంటూ శశిథరూర్‌ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత భారతదేశం చేపట్టిన దౌత్యపరమైన చర్యలపై పత్రికలో శశిథరూర్ రాసిన వ్యాసం చుట్టూ జరుగుతున్న చర్చల నేపథ్యంలో ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ వ్యాసంలో, ప్రధానమంత్రి మోడీ శక్తి, చైతన్యం, ప్రపంచ వేదికపై నిమగ్నమవ్వాలనే ఆయన తపన భారతదేశానికి ప్రధాన ఆస్తిగా నిలుస్తోందని, అయితే దీనికి మరింత మద్దతు అవసరమని థరూర్ పేర్కొన్నారు.

ఈవ్యాఖ్యలు కాంగ్రెస్‌పార్టీని ఇబ్బందికి గురిచేయడమే కాకుండా పార్టీ హైకమాండ్‌కు, థరూర్‌కు మధ్య దూరాన్ని మరింత పెంచాయి. పార్టీ లైన్‌కు అనుగుణంగా థరూర్ మాట్లాడకపోవడంపై హైకమాండ్ అసంతృప్తితో ఉంది. ఖర్గే మాట్లాడుతూ, శశిథరూర్ ఇంగ్లీష్ చాలా ధారాళంగా మాట్లాడతారు. నాకు ఇంగ్లీష్ అంత బాగా రాదు. ఆయన భాష చాలా బాగుంటుంది. అందుకే ఆయన్ను కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడిగా నియమించామని అన్నారు. 26 మంది అమాయకులు మరణించిన పహల్గామ్ దాడి తర్వాత, ప్రతిపక్షాలన్నీ సైన్యానికి అండగా నిలుస్తాయని చెప్పాయని ఖర్గే గుర్తుచేశారు. దేశం ముందు, పార్టీ తర్వాత అన్నాం. కానీ కొందరు వ్యక్తులు మోడీ ముందు, దేశం తర్వాత అని భావిస్తున్నారు.

మేమేం చేయగలమని ఆయన అన్నారు. మరో వైపు ఓ కార్యక్రమంలో థరూర్ మాట్లాడుతూ, తాను రాసిన వ్యాసాన్ని తాను బిజెపిలో చేరడానికి చేస్తున్న ప్రయత్నంగా చూడరాదని, అది జాతీయ ఐక్యత, దేశ ప్రయోజనాలు, భారతదేశానికి అండగా నిలవడమనే ఉద్దేశంతో చేసిందని స్పష్టం చేశారు.

## మొసాద్‌కు సహకరించారన్న ఆరోపణలపై ముగ్గురిని ఉరితీసిన ఇరాన్

**టెహ్రాన్,జూన్ 25:** అమెరికా మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం ఆ మరుసటి రోజే ఇరాన్‌లో ఈ అరెస్టులు, ఉరిశిక్షల అమలు ఇజ్రాయెల్ గూఢచార సంస్థ మొసాద్‌కు సహకరించారన్న ఆరోపణలపై దోషులుగా తేలిన ముగ్గురు వ్యక్తులకు ఇరాన్ బుధవారం మరణశిక్ష అమలు చేసింది. ఆ దేశంతో సంబంధాలున్నాయనే ఆరోపణలపై సుమారు 700 మందిని అరెస్టు చేసినట్లు ప్రభుత్వ అనుబంధ నూర్‌న్యూస్ వెల్లడించింది. ఇరాన్ న్యాయవ్యవస్థకు చెందిన మిజాన్ న్యూస్ ఏజెన్సీ ముగ్గురి ఉరిశిక్ష విషయాన్ని ధ్రువీకరించింది. అమెరికా మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన మరుసటి రోజే ఈ ఘటన చోటుచేసుకోవడంగమనార్హం. 12 రోజుల పాటు తీవ్ర స్థాయిలో ఘర్షణలు చెలరేగిన అనంతరం, అమెరికా జోక్యంతో ఇరు పక్షాలు శాంతి ఒప్పందానికి అంగీకరించాయి. అయితే, ఈ ఒప్పందం జరిగి 24 గంటలు కూడా గడవక ముందే మొసాద్ కోసం గూఢచర్యం చేశారన్న అభియోగాలపై ముగ్గురికి మరణశిక్ష విధించడం, యూదుదేశంతో సంబం ధాలున్నాయనే నెపంతో వందల సంఖ్యలో ప్రజలను అరెస్టు చేయడం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చినప్పటికీ, ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు ఇంకా చల్లారలేదనడానికి ఈఘటనలునిదర్శనంగా నిలుస్తున్నాయి.

## శాంతియుత అణు కార్యక్రమ హక్కులను కాపాడుకుంటాం

### అణ్వాయుధాల తయారీ తమ ఉద్దేశం కాదన్న ఇరాన్ అధ్యక్షుడు



**టెహ్రాన్,జూన్ 25:** పశ్చిమాసియాలో గత కొన్ని రోజులుగా నెలకొన్న ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టాయి. ఇరాన్, ఇజ్రాయెల్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంతో శాంతియుత వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌కీలక వ్యాఖ్యలు చేశారు. అణ్వాయుధాలను తయారుచేయాలన్నది తమ దేశ లక్ష్యం కాదని ఆయన స్పష్టం చేశారు. అయితే, శాంతియుత ప్రయోజనాల కోసం అణుశక్తిని ఉపయోగించుకునే తమ చట్టబద్ధమైన హక్కులను మాత్రం కాపాడుకుంటామని ఆయన వెల్లడించారు. కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిన అనంతరం, యూఏఈ అధ్యక్షుడు మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌తో ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా పెజెష్కియాన్ మాట్లాడుతూ, ఇరాన్ తన చట్టబద్ధమైన హక్కులకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుంది. మా దేశం ఎప్పుడూ అణ్వాయుధాలను సమకూర్చుకోవాలని ప్రయత్నించలేదు. అలాంటి కోరికకూడా మాకులేదు.ఇరాన్ ఎలాంటి సంఘర్షణలను కోరుకోవడం లేదు. అయితే, మా హక్కులను వదులుకోవడానికి మేం సిద్ధంగా లేము. చర్చలద్వారా అన్ని సమస్యలను పరిష్కరించుకోవడానికి మేం సిద్ధంగా ఉన్నామని అన్నట్లు ఇరాన్ అధికారిక మీడియా ఇర్నా వెల్లడించింది. గత 12 రోజులుగా ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణలు చోటుచేసుకున్న విషయం విదితమే. ఈ పరిణామాలతో పశ్చిమాసియా ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో నిన్న ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిం దని తొలుత అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఆ తర్వాత కాల్పుల విరమణ అమల్లోకి వచ్చిందని ఇరాన్ మీడియా కూడా ధ్రువీకరించింది. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుసైతం ఒప్పందంకుదిరిన విషయాన్ని అంగీకరించారు. ఈ ఒప్పందంతో ప్రస్తుతానికి పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లారినట్లయింది.

**ఇక నుండి అంతర్జాతీయ అణుశక్తి సంస్థకు సహకరించం: ఇరాన్ కీలక నిర్ణయం**

ఇజ్రాయెల్‌తో కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిన 24 గంటల్లోనే ఇరాన్ కీలక నిర్ణయం తీసుకొంది. ఇక మీదట అంతర్జాతీయ అణుశక్తి సంస్థకు ఏ మాత్రం సహకరించకూడదని నిర్ణయించింది. ఇరాన్ పార్లమెంట్ ఈ నిర్ణయానికి అనుకూలంగా ఏ మాత్రం ఓటు వేసింది. దీనికి ఆ దేశ సుప్రీం నేషనల్ కౌన్సిల్ ఆమోద ముద్ర వేయాల్సి ఉంది. ఇరాన్ అణు కేంద్రాలపై జరిగిన దాడులను ఖండించడానికి అంతర్జాతీయ అణు శక్తి సంస్థ నిరాకరించింది. దీంతో విశ్వసనీయతను వేలానికి పెట్టినట్లయింది అని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బఘేర్ ఘలిబాఫ్ వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో తమ అణు కేంద్రాల భద్రతకు గ్యారెంటీ ఇచ్చేదాకా ఐఎఇఎకు సహకారాన్ని నిలిపివేయాలని పార్లమెంట్ తీర్మానించింది. తాజాగా ఇరాన్, ఇజ్రాయెల్‌మధ్య కాల్పుల విరమణ జరగడాన్ని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ స్వాగతించింది. ఈ యుద్ధం జరిగినన్ని రోజులు ఐఎఇఎ ఇన్‌స్పెక్టర్లు ఇరాన్‌లోనే ఉన్నారు.

ఈ నెల 22న తెల్లవారుఝామున అమెరికా బాంబర్ విమా నాలు ఇరాన్‌లోని నతాంజ్, ఫోర్డో, ఇస్ఫహాన్ అణు కేంద్రాలపై భారీఎత్తున దాడి చేశాయి. ఈ క్రమంలో అమెరికా బంకర్ బస్టర్లను ప్రయోగించింది. ఇవి ఆ కేంద్రాలను ఎంతవరకు దెబ్బతీశాయనే విషయం మాత్రం తెలియరాలేదు. కొన్ని అమెరికా పత్రికలు మాత్రం ఫోర్డో కేంద్రం స్వల్పంగానే దెబ్బతిన్నట్లు చెబుతున్నాయి. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో స్పందిస్తూ ఇరాన్‌పై దాడి చెప్పుకోదగిన స్థాయిలో నష్టం జరిగిందన్నారు. దీంతో ఆ దేశ అణు కార్యక్రమం చాలా వెనక్కి వెళ్లినట్లు తెలిపారు.

## న్యూయార్క్ మేయర్‌గా భారత సంతతి నేత!



**న్యూయార్క్,జూన్ 25:** న్యూయార్క్ నగర రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. బుధవారం వెలువడిన డెమోక్రటిక్ పార్టీ మేయర్ ప్రైమరీ ఎన్నికల ఫలితాల్లో భారత సంతతికి చెందిన 33 ఏళ్ల ముస్లిం యువకుడు, సోషలిస్ట్ భావజాలం కలిగిన జోహ్రాన్ మమ్దానీ సంచలన విజయం సాధించారు. రాజకీయ ఉద్ధండుడు, మాజీ గవర్నర్ ఆండ్రూ క్యూమోను ఓడించి అందరినీ ఆశ్చర్యపరిచారు. అమెరికాలోనే అతిపెద్ద నగరమైన న్యూయార్క్‌లో జరిగిన ఈ హోరాహోరీ పోరులో మమ్దానీకి 43.5శాతం ఓట్లురాగా, ఆండ్రూక్యూమో 36.3 శాతంతో వెనుకంజలో నిలిచారు. రిపబ్లికన్ల కంటే డెమోక్రాట్లు మూడు రెట్లు అధికంగా ఉన్న ఈ నగరంలో దాదాపు డజను మంది డెమోక్రటిక్ అభ్యర్థులు మేయర్ పీఠం కోసం పోటీ పడ్డారు. క్షేత్రస్థాయి రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటున్న జోహ్రాన్ మమ్దానీ, ప్రఖ్యాత భారత అమెరికన్ చిత్రనిర్మాత మీరా నాయర్, ఉగాండాలో జన్మించిన భారతీయ విద్యావేత్త మహమూద్ మమ్దానీల కుమారుడు. డెమోక్రటిక్ సోషలిస్ట్స్ ఆఫ్ అమెరికా మద్దతుతో బరిలోకి దిగిన మమ్దానీ, తక్కువ ఖర్చుతో కూడిన గృహాలు, పోలీసు సంస్కరణలు, వాతావరణ మార్పులపై చర్యలు వంటి ప్రగతిశీల అంశాలతో ప్రచారం నిర్వహించారు. తన విజయానంతరం మమ్దానీ సోషల్ మీడియా ద్వారా స్పందిస్తూ, నెల్సన్ మండేలా మాటలను ఉటంకించారు. ఇది పూర్తయ్యే వరకు అసాధ్యంలానే కనిపిస్తుంది. మిత్రులారా ఇది పూర్తయింది. దాన్ని చేసింది మీరే. న్యూయార్క్ నగర మేయర్ పదవికి డెమోక్రటిక్ అభ్యర్థిగా ఎంపికైనందుకు నేను గర్వపడుతున్నానని ఆయన పేర్కొన్నారు. గతేడాది డొనాల్డ్ ట్రంప్ అధ్యక్ష పదవికి తిరిగి వచ్చిన నేపథ్యంలో డెమోక్రటిక్ పార్టీ అంతర్గత విభేదాలతో సతమతమవుతున్న ప్రస్తుత సున్నిత తరుణంలో ఈ ప్రైమరీ ఎన్నికలు జరిగాయి. చురుకైన సోషల్ మీడియా ప్రచారం, యువ ఓటర్లమద్దతుతో మమ్దానీ సాధించినఈ విజయం పార్టీలోని వామపక్ష వర్గాల్లో నూతనోత్సాహాన్ని నింపింది.

## భారత్‌తో చర్చలకు సిద్ధమే: పాక్ ప్రధాని షెహబాజ్‌షరీఫ్



### సౌదీ యువరాజు సల్మాన్‌తో ఫోన్ సంభాషణ

**కరాచి,జూన్ 25:** భారత్‌తో తమకున్న వివిధ వివాదాస్పద అంశాలపై చర్చించేందుకు పాక్ సుముఖంగా ఉందన్న షరీఫ్ ఉగ్రవాదాన్ని నిర్మూలించే వరకు పాకిస్థాన్‌తో చర్చలు ఉండవన్న భారత్ ఉగ్రవాద కార్యకలాపాలను పూర్తిగా అరికట్టేంత వరకు పాకిస్థాన్‌తో ఎలాంటి చర్చలు జరిపేది లేదని భారత ప్రభుత్వం స్పష్టం చేస్తున్నప్పటికీ, పాకిస్థాన్ మాత్రం చర్చల అంశాన్ని పదేపదే లేవనెత్తుతోంది. ఇరు దేశాల మధ్య పరిష్కారం కాని వివాదాలపై అర్థవంతమైన చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తాజాగా మరోసారి ప్రకటించారు.

సౌదీ అరేబియా యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ (ఎంబిఎస్)తో ఇటీవల జరిపిన టెలిఫోన్ సంభాషణలో షరీఫ్ ఈ అంశాన్ని ప్రస్తావించినట్లు రేడియో పాకిస్థాన్ తెలిపింది. జమ్ముకశ్మీర్ సమస్య, ఉగ్రవాదం, వాణిజ్య సంబంధాలు, జలాల పంపిణీ వంటి కీలక అంశాలపై చర్చించడానికి పాకిస్థాన్ సుముఖంగా ఉందని ఆయన పేర్కొన్నట్లు తెలిపింది. పశ్చిమాసియాలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులపై సౌదీ యువరాజు ఎంబిఎస్, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఫోన్‌లో చర్చించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా భారత్, పాకిస్థాన్ మధ్య ప్రస్తుతం నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులను షరీఫ్ ప్రస్తావించారని, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని చెప్పినట్లు సమాచారం. గతంలో పహల్గామ్ ప్రాంతంలో ఉగ్రదాడి జరిగిన అనంతరం, భారత సైన్యం పాకిస్థాన్‌పై సైనిక చర్య చేపట్టింది.

ఈ పరిణామాల నేపథ్యంలో, అంతర్జాతీయ సమాజం నుంచి మద్దతు కూడగట్టేందుకు పాకిస్థాన్ ప్రయత్నించింది. ఇందులో భాగంగా సౌదీ అరేబియా, ఇరాన్, అజర్‌బైజాన్ వంటి దేశాలను సంప్రదించింది. పాకిస్థాన్‌తో చర్చల అంశంపై స్పందించిన భారత్, సరిహద్దు ఆవలి నుంచి ఉగ్రవాద కార్యకలాపాలు పూర్తిగా ఆగిపోయే వరకు ఎలాంటి చర్చలు ఉండవని తేల్చి చెప్పింది.

ఉగ్రవాదం, చర్చలు ఏకకాలంలో కొనసాగడం అసాధ్యమని, నీరు, రక్తం కలిసి ప్రవహించలేవనే వాస్తవాన్ని గుర్తుంచుకోవాలని భారత్ గట్టిగా హెచ్చరించింది.

## ఖాన్‌యూనిస్ నగరంలో ఇజ్రాయెల్ సైనికులపై హమాస్ దాడులు

### ఏడుగురు మృతి.. మృతదేహాల గుర్తింపు

**జెరూసలెం, జూన్ 25:** దక్షిణ గాజా నగరం ఖాన్‌యూనిస్‌లో జరిగిన పేలుడుకు ఏడుగురు ఇజ్రాయెల్‌సైనికులు మృతిచెందారని ఆదేశ మిలిటరీ ప్రకటించింది. మిలిటరీ నిబంధనలను అనుసరించి పేరు చెప్పని అధికారి మొత్తం ఆరుగురు సైనికుల పేర్లను గుర్తించి వారి మృతదేహాలు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. మరొకరిని మాత్రం అత్యంత రహస్యంగా ఉంచారు. అంతకు ముందురోజే ఖాన్ యూనిస్‌లో ఒకసైనికుడు కాల్పుల్లో తీవ్ర గాయాలపాలయ్యాడు. హమాస్ మిలిటరీ విభాగం అల్‌ఖస్సామ్ బ్రిగేడ్స్ ఇజ్రాయెల్ సైనికులను చుట్టుమట్టామని, ఒక నివాసభవనంలో ఉన్నట్లు సమాచారం అందడంతో దక్షిణగాజాలో వీరిని చుట్టుముట్టి అంతంచేసామని ప్రకటించింది. యాస్సిన్ 105 క్షిపణిని ప్రయోగించినట్లు హమాస్ వెల్లడించింది. అల్‌ఖస్సమ్ ఫైటర్లు ఈ భవనాన్ని మెషిన్‌గన్లతోకూడా టార్గెట్‌చేసారు. 21నెలలపాటు ఇజ్రాయెల్ గాజపై జరిపిన దాడుల్లో మొత్తం 56,077 మందిని చంపివేసిందని గాజా ఆరోగ్యమంత్రిత్వశాఖ వెల్లడించింది. హమాస్ దక్షిణ ఇజ్రాయెల్‌పై చేసిన దాడితో ఈ దాడులుప్రారంభం అయ్యాయి. సుమారు 1200 మంది చనిపోయారు.ఎక్కువమంది పౌరులే కావడంతో ఇజ్రాయెల్ స్పందించింది. అంతేకాకుండా 251 మందిని కిడ్నాప్‌చేసింది. కాల్పుల విరమణ ఒప్పందాల తర్వాత వారిని విడుదలచేసింది. ఇజ్రాయెల్ పాలస్తీనా యుద్ధంలో అత్యధిక మరణాలు ఈ యుద్ధంలోనే జరిగాయి. గత మార్చినుంచి చూస్తే 5759 మంది కాల్పుల్లో చనిపోయినట్లు ప్రకటించింది. అయితే ఇజ్రాయెల్‌మాత్రం తాముకేవలం మిలిటెంట్లను మాత్రమే టార్గెట్‌చేసామని, అయితే హమాస్ మాత్రం అమాయక పౌరులను టార్గెట్ చేసిందని ఆరోపించింది. తమ దాడుల్లో ఇప్పటి వరకూ 20 వేలమందికిపైగా హమాస్ మిలిటెంట్లను ఏరివేసామని ప్రకటించినా ఇందుకు ఆధారాలు మాత్రం చూపించలేకపోయింది.



బుధవారం బిఆర్ఎస్ తీర్థం పుచ్చుకుంటున్న యూత్ కాంగ్రెస్ నాయకుడు పట్లోళ్ల ప్రశాంత్ పాటిల్‌కు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న హరీష్‌రావు

# వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు అధికారం తథ్యం

## మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** అబద్దాల్లో సిఎం రేవంత్‌రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ పోటీ పడుతున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల యూత్ కాంగ్రెస్ నాయకుడు పట్లోళ్ల ప్రశాంత్‌పాటిల్ ఆందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ ఆధ్వర్యంలో బుధవారం సిద్దిపేటలో హరీష్‌రావు సమక్షంలో బిఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన ప్రశాంత్ పాటిల్‌కు బిఆర్ఎస్ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ 18 నెలలపాలనలో చేసిందేమిలేదన్నారు. కెసిఆర్ పేదలకు ఇచ్చిన పథకాలను రద్దు చేశారని తెలిపారు. రేవంత్‌రెడ్డి పాలన మాటలు ఎక్కువ పాలన తక్కువగా మారిందన్నారు. పిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ బహిరంగ చర్చకు పోదాం అంటున్నారు ఎక్కడికి రమ్మంటాడో చెప్పాలని తాను సిద్దంగా ఉన్నానని తెలిపారు. సర్కారుకు దమ్ముంటే 40రోజులు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో ఖచ్చితంగా బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చితీరుతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని గెలిపించుకొని అందరం ఐక్యతతో ముందుకు సాగుదామన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు జైపాల్‌రెడ్డి, విఠల్, మాజీ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.




బుధవారం జలసాధన కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

# రైతుల కోసం ఎంతవరకైనా వెళ్తా

## దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

**దుబ్బాక, జూన్ 25, ప్రభాతవార్త :** రైతులకు న్యాయం చేయడానికి ఎంతవరకైనా వెళ్తానని, అవసరమైతే ఎమ్మెల్యే పదవి త్యాగానికి సిద్ధంగా ఉన్నానని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండల పరిధిలోని పెద్దగుండవెల్లి గ్రామంలో బుధవారం జలసాధన కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తాను రైతు బిడ్డను వ్యవసాయంపై తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు నుంచి 12 గ్రామాల రైతులకు సాగునీరు అందించే బాధ్యత తనపై ఉందన్నారు. ఉమ్మడి జిల్లా మంత్రికి, ఇన్‌చార్జి మంత్రికి సిద్దిపేట ప్రాంతంలోని మల్లన్నసాగర్, కొండపోచమ్మ, రంగనాయక సాగర్ రిజర్వాయర్లపై కనీస అవగాహన లేదన్నారు.

దుబ్బాక నియోజక వర్గంలో ఉన్న మల్లన్నసాగర్ నుంచి ఈ ప్రాంత రైతులకు సాగు నీరు ఎందుకు అందివ్వరని ప్రశ్నించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.




బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ధర్నాలో మాట్లాడుతున్న ఆర్. కృష్ణయ్య

# తొలగించిన కేర్ టేకర్లను మళ్లీ తీసుకోవాలి

## రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (ధర్నాచౌక్), జూన్ 25, ప్రభాతవార్త:** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల నుండి తొలగించిన అసిస్టెంట్ కేర్ టేకర్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బుధవారం అసిస్టెంట్ కేర్ టేకర్ల (అగనెస్ట్ వార్డెన్) ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా హాజరై ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో పది సంవత్సరాలుగా పనిచేస్తూ, పిల్లలకు తల్లి తండ్రులకు మాదిరిగా సేవలు అందించిన 263 మంది అసిస్టెంట్ కేర్ టేకర్లను విధుల నుండి తొలగించటం అన్యాయమన్నారు. తక్షణమే ప్రభుత్వం తొలగించిన కేర్ టేకర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ జేఏసీ ఛైర్మన్ మోతిలాల్ నాయక్ మాట్లాడుతూ పది సంవత్సరాల నుండి ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న అసిస్టెంట్ కేర్ టేకర్లను అకారణంగా తొలగించటం ఏమి న్యాయమని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పాలనలో ఉద్యోగంలో చేరిన వీరిపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం పునః ఆలోచన చేసి, తొలగించిన గురుకుల ఉద్యోగస్తులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో అసిస్టెంట్ కేర్ టేకర్ల ఐక్యవేదిక అధ్యక్షులు ప్యాందుల జయేందర్, ఉపాధ్యక్షులు నర్సింగరావు, విరూప, ప్రధాన కార్యదర్శి బి.కరుణాకర్, కార్యదర్శి వలియేటి రాజు, కోశాధికారి బి.రాజు, ప్రచారకార్యదర్శి వి.మల్లేష్, మహిళా నాయకులు మమత, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

## వరకట్న వేధింపుల కేసు.. కుటుంబం అక్రమ నిర్బంధం

# ఇల్లందు ఇన్‌స్పెక్టర్‌పై సస్పెన్షన్ వేటు

**హైదరాబాద్, జూన్ 25, ప్రభాతవార్త:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పోలీసు స్టేషన్‌లో వరకట్న వేధింపుల కేసుకు సంబంధించి ఒక కుటుంబం మొత్తాన్ని పోలీసు స్టేషన్‌లో 12 గంటల పాటు నిర్బంధించి వారిపై ఒత్తిడితెచ్చి, రాజీ కుదుర్చుకోవాలని భయభ్రాంతులకు గురిచేసినందుకు ఇన్‌స్పెక్టర్ బి.సత్యనారాయణను మల్టీ జోన్ 1 ఐజి చంద్రశేఖర్ రెడ్డి సస్పెండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 19వ తేదీన రాంరెడ్డితో పాటు ఆయన భార్య ఇతర కుటుంబ సభ్యులను ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఎలాంటి కేసు నమోదు చేయకుండానే 12 గంటల పాటు అక్రమంగా నిర్బంధించారని ఫిర్యాదు అందింది. రాంరెడ్డి కోడలు చేసిన ఫిర్యాదుపై ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఎలాంటి విచారణ చేయకుండానే, కేసు నమోదు చేయకుండానే అందరిని నిర్బంధించి, భయభ్రాంతులకు గురిచేసినట్లు దీనిపై విచారించిన జిల్లా పోలీసు అధికారులు తేల్చారు. ఈ క్రమంలో రాంరెడ్డి భార్య పద్మజ పోలీసు స్టేషన్‌లోనే అనారోగ్యానికి గురై స్పృహతప్పగా ఆమెను వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఆమె ప్రస్తుతం కోలుకుంటోంది. ఈ ఘటనపై విచారించిన జిల్లా పోలీసు అధికారులు ఇందులో ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ చట్ట వ్యతిరేకంగా వ్యవహరించినట్లు తేల్చారు. దీనిపై అందిన నివేదిక ఆధారంగా ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణను ఐజి చంద్రశేఖర్ రెడ్డి సస్పెండ్ చేశారు.

# హోంగార్డులకు ఉన్ని జాకెట్లు, రెయిన్ కోట్లు

**హైదరాబాద్, జూన్ 25, ప్రభాతవార్త:** వర్షాకాలం మొదలవడంతో రాష్ట్రంలోని ఆయా జిల్లాలలో విధులు నిర్వహించే హోంగార్డులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వుండేందుకు పోలీసు శాఖ ఉన్ని జాకెట్లు, రెయిన్ కోట్లు అందించింది. డిజిపి కార్యాలయంలో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో హోంగార్డుల విభాగం అదనపు డిజి స్వాతి లక్రా వీటిని హోంగార్డులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హోంగార్డుల సంక్షేమం కోసం సర్కారు ఎన్నో చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తం గా వున్న అందరు హోంగార్డులకు ఉన్ని జాకెట్లు, రెయిన్ కోట్లు అందజేస్తామని ఆమె తెలిపారు. ఇందుకోసం ప్రత్యేకంగా బడ్జెట్ మంజూరయ్యిందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో పి అండ్ఎల్ ఐజి రమేష్‌తో పాటు హోంగార్డుల కమాండంట్ వెంకటేశ్వర్లు, డిఎస్‌పి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటక రంగ అభివృద్ధికి ప్రణాళికలు

## మంత్రి జూపల్లి కృష్ణారావు



**హైదరాబాద్, జూన్ 25 ప్రభాతవార్త:** రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని, టూరిజం అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తూ ఈ రంగం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే దిశగా ప్రభుత్వం ముందుకు వెళుతుందోందని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమశిల వెల్‌నెస్, స్పిరిచ్యువల్ రిట్రీట్ నల్లమల ప్రాజెక్టు అభివృద్ధిలో భాగంగా మంత్రి జూపల్లి సోమశిల, అమరగిరి, కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్, నార్లాపూర్ రిజర్వాయర్, కొల్లాపూర్‌లోని మాధవస్వామి ఆలయం, జెటప్రోలు మదనగోపాల స్వామి దేవాలయాన్ని సందర్శించారు. పర్యాటక అభివృద్ధికి ఉన్నఅవకాశాలనుక్షేత్ర స్థాయిలో పరిశీలించారు. సోమశిల వెల్‌నెస్, స్పిరిచ్యువల్ రిట్రీట్ నల్లమల ప్రాజెక్టుకు స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ /యూనియన్ టెరిటరిస్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్టమెంట్(సాస్కి) పథకం కింద రూ.68.10 కోట్లు మంజూరయ్యాయని, ఆ నిధులతో పర్యావరణం, జల వనరులు, ఆలయాలు, వాటర్ స్పోర్ట్స్, అడ్వెంచర్ గేమ్స్ కు పుష్కలమైన వనరులు ఉన్న సోమశిల, అమరగిరి ద్వీపం, ఈగలపెంటను అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని పర్యాటక శాఖ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం కొల్లాపూర్ క్యాంప్ కార్యాలయంలో సోమశిల వెల్‌నెస్, స్పిరిచ్యువల్ రిట్రీట్ నల్లమల ప్రాజెక్టు సంబంధించిన ప్రతిపాదనలు, కార్యాచరణపై పర్యాటక శాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ప్రపంచంలో ఎన్నో దేశాలు కేవలం టూరిజం ద్వారానే అభివృద్ధి చెందాయని, రాష్ట్రాన్ని టూరిజం హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వ శాఖలు సమన్వ యంతో ముందుకు వెళ్లాలన్నారు. త్వరలో టెండర్లు పిలవాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ. పర్యాటక రంగాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో ముందుకు తీసుకెళ్తామని, ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలను అంతర్జాతీయప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని అన్నారు. దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. సోమశిల వెల్‌నెస్, స్పిరిచ్యువల్ రిట్రీట్ నల్లమల ప్రాజెక్టుకు స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్/ యూనియన్ టెరిటరిస్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్టమెంట్(సాస్కి) పథకంకింద రూ.68.10 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. ఆ నిధులతో పర్యావరణం, జల వనరులు, ఆలయాలు, వాటర్ స్పోర్ట్స్, అడ్వెంచర్ గేమ్స్ కు పుష్కలమైన వనరులు ఉన్న సోమశిల, అమరగిరి ద్వీపం, మల్లేశ్వరం, ఈగలపెంటను అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టామని వివరించారు. క్లస్టర్ 1: ఈగల పెంట అరైవల్ జోన్, ఈగలపెంట విహార యాత్ర, ఈగలపెంట రివర్ క్రూయిజ్, చెంచు ట్రైబల్‌ఎక్స్‌పీరియన్స్, క్లస్టర్ 2: సోమశిల వెల్నెస్ అండ్ స్పిరిచ్యువల్ రిట్రీట్ ఉంటాయని అన్నారు. సోమశిలలో బోటింగ్ జెట్టి, అమరగిరి ద్వీపంలో బోటింగ్ జట్టి, కాటేజీలు, స్విమ్మింగ్ పూల్, కేఫ్టీరియా, స్పా, వెల్ నెస్ సెంటర్, ఇండోర్, అవుట్ డోర్ గేమ్స్, ఇతర సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఈ కార్యక్ర మంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ క్రాంతి వల్లూరు, కలెక్టర్ బదావత్ సంతోష్, ఇతర అధికారులు ఉన్నారు.

# ఘనంగా డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం..




**హైదరాబాద్, జూన్ 25 ప్రభాతవార్త:** అంతర్జాతీయ మాదక ద్రావ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం తెలంగాణ వ్యాప్తంగా ఎక్సైజ్ శాఖ అందరితో కలిసి డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవాల్ని జరుపుకున్నారు. నక్లెస్ రోడ్డు జల వీహార్ ముందు నిర్వహించిన డ్రగ్స్ వ్యతిరేక దినోవత్సవంలో తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్ పాల్గొన్నారు. ఎక్సైజ్ శాఖ పోలీసులు, అధికారులు సీనియర్ సిటిషన్లు, విద్యార్థులు, యువత, పలు స్వచ్ఛంద సంస్థలతో కలిసి అన్ని జిల్లా కేంద్రాల్లో డ్రగ్‌ను వినియోగించ వద్దని ప్లా కార్డులతోను, బ్యానర్లతో ర్యాలీలు నిర్వహించారు. సభలు, సమావేశాలు నిర్వహించిడ్రగ్స్ వాడకం, అమ్మకం, రవాణ ఎన్‌పీడీఎస్ యాక్ట్ కింద నేరంగా పరిణనించబడుతుందని ప్రజలకు సమాచారం అందించారు. డ్రగ్స్ వాడకం వల్ల కలిగే నష్టాలు, జీవితాలు ఎలా ఉంటాయనే విషయాలపై ఎక్సైజ్ పోలీసులు యువతకు అవగహన కలిపించారు. నిజామాబాద్, వరంగల్ అర్బన్, కరీంనగర్, మహబూబ్‌నగర్, వరంగల్, సిద్దిపేట, జనగామ, సిరిసిల్ల, నిర్మల్‌తో పాటు ఇతర జిల్లాల డిప్యూటి కమిషనర్లు, ఎక్సైజ్ సూపరిండెంట్లు పోలీసులు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా కార్యక్రమాలు నిర్వహించారు. డ్రగ్స్ పై ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించి డ్రగ్స్‌పై అవగాహన కల్పిన ఎక్సైజ్ అధికారులకు, సిబ్బందికి అబ్కారీ శాఖ కమిషనర్ సి.హరికిరణ్ , ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం డ్రగ్స్ నిషేదత దినోత్సవాన్ని తెలంగాణ వ్యాపంగా ఘనంగా నిర్వహించినందుకు అభినందించారు.

# ఏనుగుదంతాలు విక్రయిస్తున్న ముఠా అరెస్ట్



బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

**హైదరాబాద్, జూన్25, ప్రభాతవార్త:** ఏనుగులకు దంతాలు కట్‌చేసి అక్రమంగా విక్రయాలు జరుపుతున్న ముఠాను రాచకొండ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై బుధవారం ఎల్బీనగర్ సీపీ క్యాంప్ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ సుధీర్‌బాబు వివరాలను వెల్లడించారు. ఏపీలోని రాయచోటికి చెందిన రేకులకుంట ప్రసాద్, లోకేశ్వర్‌రెడ్డిలు ఒక ముఠాగా ఏర్పడి ఏనుగుదంతాలను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. ఈ క్రమంలో తిరుపతి శేషాచల అడవుల్లో ఏనుగుల దంతాలను కొల్లగొట్టి నగరానికి తరలించి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. ఇందులో భాగంగా వారిపై అటవీశాఖ, ఎస్వోటీ పోలీసుల నిఘా ఏర్పాటు చేసి జాయింట్ ఆపరేషన్ చేయగా బస్సులో 5.6కేజీల రెండు ఏనుగు దంతాలను తరలిస్తుండడంతో తనిఖీ చేసి వెలుగుచూసిందన్నారు. ప్రసాద్‌ను అరెస్ట్ చేసి దంతాలను స్వాధీనం చేసుకున్నారు. ఇది అంతర్జాతీయ మార్కెట్లో సుమారు రూ.3కోట్ల పైబడే ఉంటుందని పేర్కొన్నారు. రూ. 60లక్షల వరకు బహిరంగమార్కెట్లో విక్రయిస్తున్నారన్నారు. అయితే ఇవి ఒరిజినల్ దంతాలా కాదా అని ఫారెస్ట్ వాళ్ళతో చెక్ చేయించినట్లు వివరించారు. వారిద్దరికీ జైల్లో పరిచయం కావడంతో విడుదలై ముఠాగా ఏర్పడి అక్రమదందాకు తెరలేపారని తెలిపారు. వైల్డ్ లైఫ్ యాక్ట్ 1972 ప్రకారం ఇది చట్టరీత్యా నేరమన్నారు. అక్రమకలాపాలపై ప్రత్యేకదృష్టిసారించామని పేర్కొన్నారు. లోకేశ్వర్‌రెడ్డి పరారీలో ఉన్నాడు. త్వరలో పట్టుకుంటామని వివరించారు. గతంలో ఎర్ర చందనం స్మగ్లింగ్ కేసులో ప్రసాద్ నిందితుడిగా ఉన్నాడని సుధీర్‌బాబు తెలిపారు.

# రాష్ట్రంలో భారీగా భూ సమస్యలు, 8 లక్షలకు పైగా దరఖాస్తులు

**హన్మకొండ బ్యూరో, జూన్ 25 ప్రభాత వార్త:** తెలంగాణ రాష్ట్రంలో తలపెట్టిన రెవెన్యూ సదస్సులు ఇటీవల ముగిసిన విషయం తెలిసిందే. భూ సమస్యలపై 8 లక్షలకుపైగా దరఖాస్తులు అందాయి. 3 దశల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో భారీగా అప్లికేషన్లు వచ్చాయి. ఏప్రిల్ 17 నుంచి 30 వరకు నాలుగు మండలాల్లో ముందుగా రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఆ తర్వాత రెండో దశ కింద మరో 28 మండలాల్లో దరఖాస్తులను స్వీకరించారు. మూడో విడతగా మిగిలిన మండలాల్లో నిర్వహించారు. మొదటి దశలో ఏప్రిల్ 17 నుంచి 30వ తేదీ వరకు 4మండలాల్లో నిర్వహించిన 72 రెవెన్యూ సదస్సుల్లో 12వేల దరఖాస్తులు అందాయి. రెండవ దశలో మే 5వ తేదీ నుంచి 28 మండలాల్లో నిర్వహించిన 414 సదస్సుల్లో 46 వేల దరఖాస్తులు అందాయి. సాదాబైనామాల అంశం మినహా సుమారు 60 శాతంపైగా సమస్యలకు పరిష్కారం చూపారు. జూన్ 3వ తేదీ నుంచి 20వ తేదీ వరకు 561 మండలాల్లో 10,239 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఈ సదస్సుల్లో భూ సమస్యలకు సంబంధించి 8 లక్షలకుపైగా దరఖాస్తులు వచ్చాయి. మొత్తంగా మూడు విడతల్లో 593 మండలాల్లో 10,725 రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఇందులో 8.58 లక్షల దరఖాస్తులు వచ్చాయని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వివరించారు. అత్యధికంగా ఖమ్మం జిల్లాలో 67 వేలు, భద్రాద్రి కొత్తగూడెం 61వేలు, వరంగల్ 54 వేలు, జయశంకర్ భూపాలపల్లి 48వేలు, నల్గొండ 42వేల దరఖాస్తులు అందాయి. రెవెన్యూ సదస్సులకు ముందురోజే ఆయా గ్రామాల్లో రైతులకు ఉచితంగా దరఖాస్తులను పంపిణీ చేశారు. స్వీకరించిన వాటికి రశీదులను అందజేశారు. వచ్చిన దరఖాస్తుల్లో ఇప్పటివరకు 3.27 లక్షల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

# హైకోర్టు తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టు

## తక్షణమే 42 బిసి రిజర్వేషన్‌తో స్థానిక సంస్థల ఎన్నికలు జరపండి

### బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్

**హైదరాబాద్, జూన్ 24 ప్రభాతవార్త:** రాష్ట్ర హైకోర్టు స్థానిక సంస్థల ఎన్నికలు సెప్టెంబర్ 30వ తేదీలోపు జరిపించాలని ఇచ్చిన తీర్పు, ప్రజాస్వామ్యాన్ని అవమానించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఒక చెంపపెట్టు లాంటిదని బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ అన్నారు. బుధవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. భారతీయ జనతా పార్టీ తొలి నుంచి ప్రజాస్వామ్య పరిరక్షణకు కట్టుబడి ఉందని, 73వ, 74వ రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థలకు అధికారాలు, నిధులు కల్పించిన ఘనత భారతీయ జనతా పార్టీదే అన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో గత 18 నెలలుగా స్థానిక ఎన్నికలు జరపకపోవడం అప్రజాస్వామికం అన్నారు. ప్రజా ప్రతినిధి లేకపోవడం వల్ల గ్రామాల్లో ఎక్కడికక్కడ అభివృద్ధి కుంటుపడిందని, కనీస సౌకర్యాలు లేవు అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా మేలుకుని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం 42 బిసి రిజర్వేషన్‌ను స్థానిక సంస్థల్లో అమలు చేస్తూ వెంటనే ఎన్నికలు నిర్వహించాలని అన్నారు.

# హరీష్! ధైర్యం ఉంటే బనకచర్లపై ప్రత్యేక చర్చకు డిమాండ్ చెయ్

## పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి




**హైదరాబాద్, జూన్25, ప్రభాతవార్త:** హరీష్‌రావు నీకు దమ్ము, ధైర్యం ఉంటే ప్రత్యేక అసెంబ్లీ సమావేశానికి మీ పార్టీ నుంచి లేఖ ఇచ్చి డిమాండ్ చేయ్ మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బనకచర్ల పైన చర్చకు సిద్ధమా అని సూటిగా, స్పష్టంగా సవాల్ విసిరారని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి కోరారు. సిఎల్‌పి కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడూతూ హరీష్‌రావు నువ్వు నోటికొచ్చినట్లు వాగుతున్నవు బనకచర్ల పైన అసెంబ్లీ సమావేశానికి ఎందుకు నువ్వు, నీ మామ భయపడుతున్నరని నిలదీశారు. తెలంగాణకు గత పదేళ్లలో నీటి వాటాల విషయంలో మీరు చేసిన ద్రోహాన్ని అసెంబ్లీ సాక్షిగా బట్టబయలు చేస్తామన్న భయమా? అనిఆయన నిలదీశారు. మీరు పెట్టిన అడ్డగోలు సంతకాలతో కృష్ణా జలాల్లో కేవలం 299 టిఎంసిల వాటా మాత్రమే తెలంగాణ కు వచ్చిందన్న విషయంపైన నిలదీస్తమని భయమా.? అని ఆయన అన్నారు. గోదావరిలో 3000 టీఎంసీ ల మిగులు జలాలు ఉన్నాయని, అవి వాడుకొని రాయలసీమను రతనాల సీమ చేయమని నీ మామ చెప్పిన బడాయి కబుర్లు బయటకు వస్తాయని టెన్షనా మీకు?!! అని ఎద్దేవా చేశారు. గోదావరిలో మిగులు జలాలు మీ ఇష్టం వచ్చినట్లు వాడుకోమని నాటుకోడి, రాగి సంగటి కింద రాసిచ్చిన విషయాలు చర్చకు వస్తాయని చర్చకు రాకుండా తప్పించుకొంటున్నారాఅని ఆయన ఎద్దేవా చేశారు. కమిషన్లకు కక్కుర్తి పడి కాళేశ్వరాన్ని కూల్చిన దద్దమ్మలు, సన్నాసులు మీరని విమర్శించారు. దద్దమ్మ హరీష్ రావు ముందు మేడి గడ్డ ఎందుకు కుంగిపోయిందో సమాధానం చెప్పు అని ఆయన కోరారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ఎంత వరకు వచ్చిందో అందరూ చూస్తున్నారు? కల్వకుర్తి ,నెట్టెం పాడు ,బీమా ,కోయిల్ సాగర్ ప్రాజెక్టులు ఆ నాటి కాంగ్రెస్ ప్రభుత్వాలు చేపడితే మీరు పూర్తి చేయలేకపోయారని ఆవేదన చెందారు.

## బూర్గంపాడు ఘటనలో

# నివేదిక కోరాం

## మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్ జూన్ 25 ప్రభాతవార్త:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండల పరిధిలోని ఇరవెండి ఫారెస్ట్ బీట్లో లోని కొసగుంపు వలస ఆదివాసీ గ్రామంలో ఇటీవల చోటు చేసుకున్న ఘటనపై తెలంగాణ రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్పందించారు. ఫారెస్ట్ భూమికి కందకాలు తవ్వేందుకు వెళ్లిన జేసీబీని కొసగుంపుకు చెందిన వలస ఆదివాసీ మహిళలు అడ్డుకున్న నేపథ్యంలో చోటు చేసుకున్న ఘర్షణ విషయంలో మంత్రి సురేఖ, జిల్లా అటవీ అధికారులను, జిల్లా ఉన్నతాధికారులను నివేదిక కోరుతానని చెప్పారు. ఈ మేరకు మంత్రి సురేఖ మీడియాకి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కందకాలు తవ్వకుండా జేసీబీకి అడ్డుగా మహిళలు బైఠాయించగా, ఫారెస్ట్ అధికారులు మహిళలకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో వలస ఆదివాసీ మహిళలకు, ఫారెస్ట్ అధికారులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నదని వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. కాగా, ఇదే విషయంలో రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా, శిశుసంక్షేమశాఖ మంత్రి అనసూయ సీతక్క కూడా మంత్రి సురేఖతో ప్రత్యేకంగా ఫోన్‌లో మాట్లాడారు. నివేదిక వచ్చిన తర్వాత తదనుగుణంగా ముందుకు వెళదామని అటవీ మంత్రి సురేఖ, సీతక్కకు హామీనిచ్చారు.

# ఢిల్లీలో జరిగే బోనాల ఉత్సవాలకు రండి

## టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్‌కు మహంకాళీ దేవాలయ కమిటీ ఆహ్వానం



**హైదరాబాద్, జూన్25, ప్రభాతవార్త:** దేశ రాజధాని ఢిల్లీ తెలంగాణ భవన్ లో ఈ నెల 30, జులై 1,2 తేదీల మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న లాల్ దర్వాజా బోనాల ఉత్సవాలకు రావాలని టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను లాల్ దర్వాజా సింహవాహిని మహంకాళి దేవాలయం కమిటీ ప్రతినిధులు ఆహ్వానించారు. బుధవారం గాంధీ భవన్‌లో మహేష్ కుమార్ గౌడ్ ను ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు కె.విష్ణు గౌడ్, కె.వెంకటేష్, సాంస్కృతిక కార్యదర్శి ఎ.వినోద్ కుమార్, గడ్డం రవి, కాంగ్రెస్ నేత డి,ఎల్.నర్సింగ్ గౌడ్ తదితరులతో కూడిన ప్రతినిధి బృందం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి ఆహ్వాన పత్రిక ను అందజేశారు. ఢిల్లీలో గత పది సంవత్సరాల నుండి తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని ఆయనకు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలియజేశారు.

# నక్సలైట్ల హత్యలపై మాట్లాడే పౌరహక్కుల సంఘం లవ్ మర్డర్లపై ఎందుకు గొంతు విప్పరు?

## ఎన్ఎస్‌యుఐ కో-లివింగ్‌పై దృష్టి సారించాలి

### మాజీ ఎంపి విహనుమంతరావు




**హైదరాబాద్, జూన్ 25, ప్రభాతవార్త:** నక్సలైట్ల హత్యలపై మాట్లాడే పౌరహక్కుల సంఘం వాళ్ళు లవ్ మర్డర్లపై ఎందుకు గొంతు విప్పరని మాజీ ఎంపి వి. హనుమంతరావు ధర్మసందేహం వ్యక్తంచేశారు. గాంధీభవన్‌లో బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ హైటెక్ సిటీలో కొలివింగ్‌ను ఆపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్ బాబు ను కోరినారు. ఒకే హాస్టల్ లో ఆడపిల్ల, మగ పిల్లలు కలిసి ఉంటున్నారని హనుమంతరావు ఆవేదన చెందారు. హైదరాబాద్ నెంబర్ వన్ సిటీ కావాలంటే ఇలాంటి వాటిని కట్టడి చేయాలని ఆయన కోరారు. ఎన్ఎస్‌యుఐ విద్యార్థి సంఘం కోలివింగ్ మీద దృష్టి పెట్టాలని అన్నారు. గతంలో ఫ్యాక్షన్ మర్డర్స్ ఉండేవి, ఇప్పుడు సొంత భర్తను, కూతురు తల్లిని చంపడం అనేది దారుణం అన్నారు. ఇప్పుడు లవ్ మర్డర్స్ జరుతున్నాయని అన్నారు. ఇలాంటి వాటిని సోషల్ మీడియాలో ప్రచారం చేయొద్దని రిక్వెస్ట్ చేశారు. సమాజం ఎటు వైపు పోతుందని భయమేస్తుందని ఆవేదనచెందారు. ఇలాంటి మర్డర్స్‌ను హ్యూమన్ రైట్స్ టేక్ అప్ చేయాలి సైకాలజిస్ట్ లు, ఇంటలెక్చువల్స్ ఆలోచన చేయాలని అన్నారు. ఎక్కడో తప్పు జరుగుతుందని అన్నారు. సవిత్రిబాయ్ పూలే ను ప్రతి మహిళ ఆదర్శంగా తీసుకోవాలని ఆయన కోరారు.

# నెలలోనే భర్త ప్రాణం తీసిన నవవధువు

ఐదుసార్లు మర్డర్ ప్లాన్..

హత్యకు ముందు 2వేల ఫోన్ కాల్స్..

తల్లి కూతుర్లది ఇదే పని..

పద్ధతి మార్చుకోమన్నందుకే తమ్ముడిని సైతం హత్య ?

పోలీసుల అదుపులో ప్రధాన నిందితుడు తిరుమలరావు

రోజుకో మలుపు తిరుగుతున్న సర్వేయర్ తేజేశ్వర్ హత్య మిస్టరీ



పెళ్లి ఫొటో తిరుమలరావు (ఫైల్)

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్25, ప్రభాతవార్త:** ఉమ్మడి మహబూబ్‌నగర్ లోని గద్వాల జిల్లా కేంద్రానికి చెందిన సర్వేయర్ తేజేశ్వర్ హత్య కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. పెండ్లి అయిన నెలకే భర్తను హత్య చేయించిన కసాయి భార్య విషయాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. తేజేశ్వర్ అనే యువకుడిని ఆతడి భార్య ఐశ్వర్య హత్య చేయించిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి పోలీస్ ఎంక్వైరీలో విస్తుపోయే విషయాలు బయటపడుతున్నాయి. పెండ్లి తర్వాత నెలలోనే నాలుగుసార్లు తేజేశ్వర్‌ను హత్య చేయడానికి ఐశ్వర్య ప్రయత్నించింది. ఇందుకోసం ఆతడి బైక్‌కు జీపీఎస్ సిస్టమ్ అమర్చినట్లు తెలిసింది. నాలుగుసార్లు విఫలమైన తర్వాత ఐదోసారి కర్నూల్‌కు చెందిన సుపారి గ్యాంగ్ తో తేజేశ్వర్‌ను హత్య చేయించినట్లు సమాచారం. నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు సీన్ రీకన్స్ట్రక్షన్ చేపట్టారు. ఈ నెల 17న తేజేశ్వరును కారు ఎక్కించుకొని ఎక్కడెక్కడ తిరిగారు, ఎక్కడ కిడ్నాప్ చేశారు ? ఎక్కడ హత్య చేశారు ? బాడీని ఎక్కడ పడేశారు ? అనే వివరాలను సేకరించారు. ఇదిలా ఉండగా తమ పద్ధతి మార్చుకోమన్నందుకే సొంత తమ్ముడిని సైతం హత మార్చినట్లు స్థానికులు, కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. తేజేశ్వర్ హత్య కేసులో ప్రధాన నిందితుడు తిరుమల రావు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తున్నది.

**రోజుకో మలుపుతిరుగుతున్న హత్య మిస్టరీపై ప్రత్యేక కథనం..ఇది జరిగింది..?:** తేజేశ్వర్ భార్య ఐశ్వర్య అలియాస్ సహస్ర తల్లి సుజాత బ్యాంకు అటెండర్ గా పనిచేస్తుండడంతో తల్లి ద్వారా ఐశ్వర్యకు బ్యాంకు మేనేజర్ తిరుమల రావ్‌తో పరిచయం ఏర్పడింది. అంతే కాకుండా ఐశ్వర్య మరో ఐదుగురితో రిలేషన్ షిప్ మెయింటెన్ చేస్తున్నట్టు సమాచారం. అయితే తేజేశ్వర్ హత్య తర్వాత హత్యకి ముందు దాదాపు 2వేల కాల్స్ అందరితో మాట్లాడినట్టు కాల్ డేటా హిస్టరీలో బయటపడింది. కాగా హత్య జరిగిన తర్వాత విషయం బయటకు పొక్కకుండా ఉండటానికి తేజేశ్వర్ మిస్సింగ్ అయ్యాడని అందరూ నమ్మేలా ప్లాన్ చేశారు. తర్వాత ముందస్తుగా వేసుకున్న ప్లాన్‌లో భాగంగా బ్యాంకు మేనేజర్ తిరుమలరావుతో కలిసి లడక్ పారిపోయి అక్కడే సహజీవనం చేయాలని సర్వం సిద్ధం చేసుకున్నారని తెలుస్తుంది. దాని కోసం తిరుమల రావ్ తాను పనిచేసే బ్యాంకులోనే 20 లక్షలు లోన్ తీసుకున్నాడని తెలుస్తుంది. కానీ మృతుడు తేజేశ్వర్ ట్విస్ట్ వదిన ఐశ్వర్య పై అనుమానం ఉందని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఐశ్వర్యను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో కథ అడ్డం తిరిగింది.

తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన ఈ కేసును జిల్లా ఎస్పీ తోట శ్రీనివాసరావు ఛాలెంజ్ గా తీసుకుని సీఐ టంగుటూరి శ్రీనివాస్, పట్టణ ఎస్సై కళ్యాణ్ కుమార్ తో కలిసి పలు టీమ్ లను ఏర్పాటు చేశారు. మర్డర్ ప్లానింగ్ ఐశ్వర్య, తన తల్లి సుజాత ఉపయోగించిన కారు, రెండు లక్షలు సుపారీ తీసుకుని హత్య చేసిన గ్యాంగ్ పరుశురాం, రాజు, నగేష్ ఇప్పటికే పోలీసుల అదుపులో ఉండగా ప్రధాన నిందితుడు బ్యాంకు మేనేజర్ తిరుమల రావ్ మాత్రం పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది. త్వరలో అతన్ని అరెస్ట్ చేసి మర్డర్ పూర్తివివరాలుతెలియజేస్తామని పోలీసులు అంటున్నారు.

**తమ్ముడిని కూడా హతమర్చారా..?:** ఇదిలా ఉండగా తన తల్లి, చెల్లెకి తిరుమలరావుతో ఉన్న సంబంధం నచ్చక పలుమార్లు వారిని ఐశ్వర్య అన్న నవీన్ తిట్టేవాడని తెలిపిన స్థానికులు చెబుతున్నారు. తేజేశ్వర్‌తో పెళ్లి కాకముందు ఐశ్వర్య, తల్లి సుజాతల చేష్టలపై విసుగు చెంది పలుమార్లు ఐశ్వర్య తమ్ముడు హెచ్చరించాడని స్థానికులు చెబుతున్నారు. అతని అడ్డు తొలగించుకోవాలని సొంత తమ్ముడిని కూడా బ్యాంకు మేనేజర్ తిరుమల రావ్‌తో కలిసి మర్డర్ చేసి ఉంటుందని పలువురు ఆరోపిస్తున్నారు. అయితే అతను అనారోగ్యంతో చనిపోయాడని అప్పట్లో అందరినీ నమ్మించి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు తేజేశ్వర్ ని కాకుండా తన స్వంత తమ్ముడితో పాటు మరికొందరిని కూడా తన వంపు సొంపులతో వశపరచుకుని ఐశ్వర్య తన తల్లి సుజాతతో కలిసి ఏమైనా చేశారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఇటీవల ఇంట్లో జారిపడి మరణించాడని తెలిపిన ఐశ్వర్య అన్న నవీన్ మృతిపైనా కూడా అనుమానాలు ఉన్నట్లు కుటుంబీకులు, స్థానికులుకోరుతుండటంతో కేసు మరో కోణంలోనూ పోలీసులుదర్యాప్తుచేయనున్నట్లు తెలుస్తున్నది.

**తిరుమల రావు అరెస్ట్..?:** సర్వేయర్ తేజేశ్వర్ హత్య కేసులో ప్రధాన నిందితుడు అయిన తిరుమల రావు ను గద్వాల పోలీసులు అరెస్ట్ చేశారు. తేజేశ్వర్ మిస్సింగ్ అయిన మొదటి రోజు నుండే కేసును ఛాలెంజ్ గా తీసుకున్న పోలీసులు తీవ్ర గాలింపు చర్యలు చేపట్టి పురోగతి సాధించారు. మూడు రోజుల్లోనే పూర్తి సమాచారం సేకరించిన పోలీసులు పనితీరుపై జిల్లా ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. హైదరాబాద్ విమానాశ్రయంలో విదేశాలకు పారిపోతూ ప్రధాన నిందితుడు పట్టుబడినట్లు సమాచారం. ఇప్పటికే ఈ హత్య కేసులో 8మంది అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు సుపారీ గ్యాంగ్ తో తెల్లవారుజామున రికన్స్ట్రక్షన్ చేసి ప్రధాన నిందితుడు అయిన తిరుమల రావును అరెస్ట్ చేశారు. త్వరలో జోగులాంబ గద్వాల జిల్లా పోలీసులు మీడియా సమావేశంలో నిందుతులను ప్రవేశ పెట్టి పూర్తి వివరాలు వెల్లడించే అవకాశం వున్నట్లు తెలుస్తుంది. పోలీసుల అదుపులో ఉన్న ప్రధాన నిందితుడుతో మరెన్ని నిజాలు రాబడుతారో వేచి చూడాల్సిందే.

## లా సెట్,పీజీ సెట్ ఫలితాలు విడుదల

### అర్హత సాధించిన 30వేల 311మంది

లాసెట్‌లో అర్హత సాధించిన ముగ్గురు ట్రాన్స్‌జెండర్లు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్25:** తెలంగాణ లా సెట్, (ఎల్ఎల్‌బి,ఐదేళ్ళ,మూడేళ్ళ కోర్సు) పీజీఎల్ సెట్ (ఎల్ఎల్ఎం రెండేళ్ల కోర్సు) 2025-26 సంవత్సరానికి సంబంధించి ఫలితాలు వెల్లడి అయ్యాయి. బుధవారం ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టా రెడ్డి, ఓయూ విసి ప్రొఫెసర్ కుమార్, లాసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ విజయలక్ష్మి ఫలితాలు విడుదల చేశారు. పరీక్షకు హాజరైన వారిలో 66.46 శాతం అర్హత పొందినట్లు అధికారులు తెలిపారు. ఎల్ఎల్‌బి,ఎల్ఎల్ఎం కోర్సుల్లో ప్రవేశాల కోసం 57 వేల 715 మంది రిజిస్టర్ చేసుకోగా 45 వేల 609(పురుషులు30,715, మహిళలు14,891, ముగ్గురు ట్రాన్స్‌జెండర్లు) మంది పరీక్షకు హాజరయ్యారు. అందులో 30 వేల 311(పురుషులు 21,002,మహిళలు 9,306,ట్రాన్స్‌జెండర్లు ముగ్గురు) మంది సీట్లు పొందేందుకు అర్హత సాధించారు. లా సెట్ రాసిన వారిలో బీ కామ్, బి టెక్ చేసిన వారే ఎక్కువగా ఉండడం గమనార్హం. ప్రస్తుతం లా కాలేజీల్లో మొత్తం సీట్లు 9,388.. గత ఏడాది భర్తీ అయినవి.. 8,631 సీట్లు. ఈ ఏడాది లా కోర్సుల్లో సీట్లు పెరుగనున్నాయి. శాతవాహన, పాలమూరు యూనివర్సిటీలో ఈ సారి లా కోర్సు ప్రారంభం కానుంది. పీజీ లాసెట్ కోర్స్‌కు 4166మంది ఎంట్రెన్స్ రాయగా, 3,763(పురుషులు2342,మహిళలు1420, ఒకరు ట్రాన్స్ జెండర్) మంది అర్హత సాధించారు.జూన్ 6న తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా లాసెట్, పీజీ ఎల్‌సెట్ ప్రవేశ పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. **లాసెట్‌లో మొదటి ర్యాంక్ సాధించిన ఎల్కాపు రుతిక:** లా సెట్ ప్రవేశ పరీక్షకు సంబంధించిన ఫలితాలలో బోథ్ గ్రామానికి చెందిన ఎల్కాపు రుతిక రాష్ట్రంలోనే మొదటి ర్యాంక్ సాధించి ప్రభంజనం సృష్టించారు. వివరాల్లోకి వెళితే బోథ్ గ్రామానికి చెందిన ఎల్కాపు రాజశేఖర్ కూతురు అయిన ఎల్కాపు రుతిక లా సెట్ రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ప్రవేశ పరీక్షలో 120 మార్కులకు గాను 85 మార్కులు సాధించి రాష్ట్రంలోనే మొదటి ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్ రావడం పట్ల చాలా సంతోషంగా ఉందని అన్నారు. మొదటి ర్యాంకు సాధించిన రుతికకు గ్రామస్తులు, స్నేహితులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## కోర్ అర్బన్ రీజియన్‌కు ప్రత్యేకంగా సమగ్ర పాలసీ

### సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్25:** అసంపూర్తిగా ఉన్న పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నగరంలో శానిటేషన్ విషయంలో నిర్లక్ష్యం వహించొద్దని, వర్షాకాలం నేపథ్యంలో డెంగ్యూ, చికున్ గున్యా లాంటి సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. బుధవారం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవెలప్ మెంట్‌పై అధికారులతో సిఎం రేవంత్ రెడ్డి సమీక్షించారు. వివిధ అభివృద్ధి పనుల్లో పురోగతిపై పూర్తి వివరాలను సీఎంకు అధికారులు వివరించారు. పస్తుతం జీహెచ్ఎంసీ పరిధిలో కొనసాగుతున్న తాగునీటి సరఫరా,సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్స్ పనుల ప్రస్తుత పరిస్థితిని సిఎంకు అధికారులు వివరించారు. ఈ సమీక్షలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సిఎం సెక్రటరీ మాణిక్ రాజ్, హెచ్ఎండిఏ పరిధిలోని ఎంఏయుడి సెక్రటరీ ఇలంబర్తి, జిల్లా హెచ్ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వి కర్ణన్, ఎఫ్‌సిడిఏ కమిషనర్ కె. శశాంక, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ ఎండీ అశోక్ రెడ్డి, ఎంఆర్‌డిసిఎల్ ఎండీ ఈవీనర్సింహారెడ్డి,మెట్రోఎండీ ఎన్వీఎస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నన్ను టచ్‌చేస్తే 35 ముక్కలవుతావ్

### తొలిరాత్రి భర్తకు నవవధువు వార్నింగ్

**ప్రయాగరాజ్,జూన్ 25:** నన్ను టచ్ చేస్తే 35 ముక్కలు అయితావు నన్ను చేస్తే ఏం చేస్తానో నాకే తెలియదు జాగ్రత్తగా ఉండు, పెళ్లైన మెదటి రాత్రి.. ఓ పెళ్లి కూతురు పెళ్లి కొడుక్కిచ్చిన వార్నింగ్ రెండుకుటుంబాలను విస్తుపోయేలా చేసింది. ఉత్తర్‌ప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌కు చెందిన నిషాద్ అనే వ్యక్తికి ఇటీవల సితార అనే యువతితో వివాహమైంది. పెళ్లి సమయంలో ఆనందంగానే కన్పించిన ఆ వధువు మొదటి రాత్రి వింతగా ప్రవర్తించింది. గదిలోకి కత్తి తీసుకొచ్చి నన్ను తాకితే 35 ముక్కలు చేస్తా అంటూ బెదిరించింది. తనకు ఈ పెళ్లి ఇష్టం లేదని, తాను అమన్ అనే వ్యక్తిని ప్రేమిస్తున్నానని చెప్పింది. ఈ విషయం బయటకు చెబితే తప్పుడు కేసు పెడతానంటూ భర్త, అతడి కుటుంబసభ్యులపైనా బెదిరింపులకు పాల్పడింది.దీంతో మరుసటిరోజు వారు గ్రామంలో పంచాయతీ పెట్టించారు. సితారకు ఆమె తల్లిదండ్రులు నచ్చజెప్పడంతో నిషాద్ ఆమెను ఇంటికి తీసుకొచ్చాడు. అయినప్పటికీ ఆమె వేధింపులు ఆగలేదు. దీంతో వరుడి కుటుంబం పోలీసులను ఆశ్రయించింది. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా సితార తన ప్రియుడు అమన్‌తో కలిసి ఇంట్లో నుంచి పారిపోయింది. ప్రస్తుతం పోలీసులు ఆమె కోసం గాలిస్తున్నారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వెల్లడించారు. అయితే సితారకు అమన్ వరుసకు మేనల్లుడు కావడం గమనార్హం.

## ఫోన్ ట్యాపింగ్‌తో కెసిఆర్‌కే లాభం కదా!

### మాజీ ఎంపి,సీనియర్ కాంగ్రెస్ నేత ధరావత్ రవీంద్రనాయక్

**హైదరాబాద్,జూన్25, ప్రభాతవార్త:** పది సంవత్సరాలు చేసిన అవినీతి, అక్రమాలు,ఆశ్రిత పక్షపాత, అణచివేత కుటుంబ పాలనను కొనసాగించడానికి చేసిన దుర్మార్గమే ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారమనేది బహిరంగ రహస్యమని మాజీ ఎంపి సీనియర్ కాంగ్రెస్ నాయకులు రవింద్రనాయక్ బుధవారం ఒక పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. కెసిఆర్ తెలంగాణకు దాపురించిన శనిగాడని కావలి కుక్కగా ఉంటానని తెలంగాణను మొత్తం కొల్లగొట్టాడి విమర్శించారు. తాను చేసిన దుర్మార్గాలను కప్పి పుచ్చుకోవడానికి,అవినీతి కేసులనుండి ప్రజలదృష్టి మళ్లించడానికి, రాష్ట్రంలో నిబద్ధతతో ప్రజల కిచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రజారంజక పాలన చేస్తూ రేయింబవళ్ళు కష్టపడుచున్న ముఖ్య మంత్రి రేవంతరెడ్డి ప్రభుత్వాన్ని బద్నాం చెయ్యడానికి కేసీఆర్ ఆండ్ కోలు చేస్తున్న కుయత్నాన్ని అడ్డుకుందాం అని ఆయన పిలుపునిచ్చారు.

## ఓఆర్ఆర్ లోపల రైతుల ఖాతాలో 65.82 కోట్లు జమ

### వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

**హైదరాబాద్, జూన్ 25, ప్రభాతవార్త:** ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) లోపల సాగులో ఉన్న భూములకు సంబంధించి 75,525 రైతుల ఖాతాలలో రూ.65.82కోట్లు భరోసా నిధులు చెల్లించినట్లు మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో రాష్ట్రంలో కమతాల వారిగా రైతు భరోసా సొమ్మును విడుదల చేయడం జరిగిందన్నారు. ఒక ఎకరం లోపల భూమి ఉన్న రైతులు 25 శాతం, అతిపెద్ద కమతం అయిన 15 ఎకరాలకు వరకు ఉన్న వారు 0.05 శాతం మాత్రమే ఉన్నట్టు తెలిపింది.

## కుటీర పరిశ్రమలను ప్రోత్సహించి, ఆరోగ్య తెలంగాణను నిర్మిస్తాం

### ట్యాంక్‌బండ్‌పై బీసీ చేతి వృత్తి కళాకారుల ఉత్పత్తుల ప్రదర్శన

### ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్25:** పెద్ద ఎత్తున ఉపాధి, ఆదాయాన్ని సృష్టించే కుటీర పరిశ్రమలను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. బుధవారం ట్యాంక్ బండ్ పై బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బిసి చేతి వృత్తి కళాకారుల ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకానికి సంబంధించిన స్టాల్స్ ను ప్రారంభించిన అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. చేతివృత్తులు, కళాకారుల ఉత్పత్తులు సమాజానికి పెద్ద ఎత్తున ఉపయోగపడతాయి అన్నారు. చేతి వృత్తుల ఉత్పత్తులను ప్రోత్సహించి ఆరోగ్య తెలంగాణ నిర్మాణానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు. 25వ తేదీ నుంచి 29 వరకు ఈ ఎగ్జిబిషన్ కొనసాగుతుందని, హైదరాబాద్ నగరానికి చెందిన వారే కాకుండా ఇతర జిల్లాల నుంచి కుటీర పరిశ్రమలకు సంబంధించిన ఉత్పత్తుల ప్రదర్శన జరుగుతుందని ఈ ఎగ్జిబిషన్ ను రాష్ట్ర ప్రజలు ఉపయోగించుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కోరారు. ఈ ప్రదర్శనను తిలకించి నచ్చిన వస్తువులు, పర్యావరణహితమైన ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే ఉత్పత్తులు కొనుగోలు చేసి చేతి వృత్తుల వారికి చేయూతనివ్వాలని రాష్ట్ర ప్రజలకు డిప్యూటీ సీఎం సూచించారు.బిసి కార్పొరేషన్ల పై ప్రత్యేక దృష్టి సారించి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని తెలిపారు. ఈ ప్రదర్శనలో కుమ్మరులు తయారుచేసిన మట్టి పాత్రలు మేదరి వారు తయారు చేసిన వెదురు వస్తువులు పూసల వారి సామగ్రి అదే విధంగా పోచంపల్లి, గద్వాల, నారాయణపేట మొదలైన చేనేత ఉత్పత్తులు గౌడ అన్నలతో ఏర్పాటుచేసిన నీరా ఉత్పత్తులు, వారు తయారు చేసిన వస్తువులను డిప్యూటీసీఎం ఆసాంతం పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బెస్త సోదరులచే ఏర్పాటుచేసిన చేపల వంటకాలను మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరిలతో కలిసి డిప్యూటీ సీఎం రుచి చూశారు.

## ఎసిబి వలలో కల్వకుర్తి 2వ ఎస్ఐ

### 10వేల లంచం తీసుకుంటు పట్టుబడిన వైనం



**కల్వకుర్తి, జూన్ 25 ప్రభాతవార్త:** కల్వకుర్తి పోలీస్‌స్టేషన్‌లో 2వ ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న రాంచందర్‌జీ బుధవారం రాత్రి రూ.10 వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే కల్వకుర్తి మండలం గుండూర్ గ్రామానికి చెందిన నంబి వెంకటయ్య భూ వివాదం కేసు రాజీకోసం ఎస్ఐ రాంచందర్‌జీ రూ. 20వేలు లంచం డిమాండ్ చేయగా రైతు వెంకటయ్య రూ.10వేలు ఇస్తానని ఒప్పుకొని ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో పథకం ప్రకారం బాధిత వెంకటయ్య రూ.10వేలను ఇచ్చి 2వ ఎస్ఐ రాంచందర్‌జీకి ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సంబంధిత అధికారిని ఏసీబీ అధికారులు తమ కస్టడిలోకి తీసుకొని విచారణ నిర్వహించి గురువారం నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుఎవరైన లంచం అడిగితే ఏసీబీ అధికారులను సంప్రదించాలని, సమాచారమిచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

## మహిళా ఉద్యోగులతో చీఫ్ ఇంజినీర్ అసభ్య ప్రవర్తన

### వీడియో కాల్స్‌చేస్తూ లైంగికంగా వేధిస్తున్నాడని ఉన్నతాధికారులకు ఫిర్యాదు, విచారణకు మంత్రి సీతక్క ఆదేశం

**హైదరాబాద్, జూన్ 25, ప్రభాతవార్త:** ప్రభుత్వ విభాగాల్లోనే మహిళా ఉద్యోగులకు రక్షణ కరువయ్యింది. ఓవైపు ప్రైవేటు సంస్థల్లో దుర్యోధన, దుశ్శాసన, కీచ కులు మహిళలను ఇబ్బందులకు గురిచేస్తుండడం నిత్యం చూస్తూనే వున్నాం. ఇదే సమయంలో మహిళల రక్షణకు ప్రభుత్వం మహిళా భద్రతా విభాగం, షీ బృం దాలు సహా అనేక విభాగాలు ఏర్పాటు చేసి మహిళలను వేధింపులకు గురిచేస్తున్న వారి భరతం పడుతున్నా కొన్నిచోట్ల నీచులు చెలరేగుతూనే వున్నారు. ఈ క్ర మంలో పంచాయితి రాజ్ శాఖలో క్వాలిటీ కంట్రోల్ విభాగంలో ఓ చీఫ్ ఇంజనీర్ సాటి మహిళా ఉద్యోగుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న తీరు కలకలం రే పింది. క్వాలిటీ కంట్రోల్ విభాగంలో పనిచేస్తున్న ఓ చీఫ్ ఇంజనీర్ సాటి మహిళా ఉద్యోగుల పట్ల వేళాపాళ లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు వీడియో కాల్స్ చేస్తూ అసభ్యకరంగా మాట్లాడుతూ లైంగికంగా వేధిస్తున్నాడని కొందరు మహిళా అధికారులు ఏకంగా ఉన్నతాధికారులతో పాటు మంత్రి సీతక్కకు ఫి ర్యాదు చేశారు. దీనిపై స్పందించిన సీతక్క విచారించి సదరుచీఫ్ ఇంజనీర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ ఫిర్యాదుపై పోలీసు శాఖ కూడా అంతర్గతంగా విచారణ చేబట్టినట్లు సమాచారం.

## సముద్రంలో కొట్టుకుపోయిన మూడువేల కార్లు

### కొత్తకార్లను రవాణాచేస్తున్న కార్గోషిప్

### అలూషియన్ దీవుల వద్ద మునక

**మెక్సికోసిటీ,జూన్ 25:** సముద్ర మార్గంలో సంచలన ప్రమాదం జరిగింది. ఓ వాణిజ్య నౌకా రవాణాలో విషాదం చోటుచేసుకుంది. వేలాది కొత్త వాహనాలను మెక్సికోకు తీసుకెళ్తూ, మోర్నింగ్ మిడాస్ అనే భారీ కార్గో నౌకలో అనుకోకుండా మంటలు చెలరేగాయి. ప్రారంభంలో అదుపులోకి వస్తాయని ఆశించినా, ఆ మంటలు క్రమంగా విస్తరించాయి. కొన్ని రోజుల సాగిన మంటలు చివరకు సముద్ర గర్భంలో కలిసిపోయింది. అదే సమయంలో అందులో ఉన్న కొత్త కార్లన్నీ నీటిలో కలిసిపోయాయి. అలస్కా సమీపంలోని అలూషియన్ దీవుల వద్ద అంతర్జాతీయ జలాల్లో ఇది జరిగింది. 600 అడుగుల పొడవైన కార్గో షిప్, మార్నింగ్ మిడాస్, సముద్ర గర్భంలో 16,404 అడుగుల లోతున మునిగిపోయింది. అయితే ఆ షిప్‌లో 3,000 కొత్తవాహనాలు ఉండగా, అవి కూడా సముద్ర జలాల్లో కలిసిపోయాయి. మార్నింగ్ మిడాస్, లండన్‌కు చెందిన జోడియాక్ మారిటైమ్ సంస్థ నిర్వహణలో ఉన్న లిబేరియన్ జెండా షిప్, గతనెల 25న న చైనా లోని యాంటాయ్ నుంచి మెక్సికోలోని లాజరో కార్డెనాస్‌కు బయలుదేరింది. ఈ షిప్‌లో 3,000 కొత్త వాహనాలు ఉన్నాయి. ఇవి గమ్యస్థానానికి చేరుకోవడానికి ముందే ఇలా జరిగింది.

## జన్‌సురాజ్‌కు 'స్కూల్‌బ్యాగ్' గుర్తు!

**పాట్నా,జూన్ 25:** బిహార్ అసెంబ్లీ ఎన్నికలు త్వరలో జరుగనున్న నేపథ్యంలో ప్రశాంత్ కిషోర్ జన్ సురాజ్ పార్టీకి ఎన్నికల గుర్తును ఎలక్షన్ కమిషన్ కేటాయించింది. ఎన్నికల గుర్తుగా 'స్కూల్ బ్యాగ్'ను కేటాయిం చింది. ఈ గుర్తుపైనే రాష్ట్రంలోని 243 అసెంబ్లీ నియోజకవర్గాల్లో జన్ సురాజ్ పార్టీ పోటీ చేయనుంది. ఎన్నికల కమిషన్ నిర్ణయంపై పార్టీ నేతలు సంతృప్తి వ్యక్తం చేశారు. సంస్కరణలు, సమ్మిళిత అభివృద్ధి ద్వారా సామాజిక ఉద్ధరణ సాధించాలనే పార్టీ లక్ష్యానికి అనుగుణంగా పార్టీ గుర్తు ఉందని తెలిపారు.




## ఎపిలో 'జలహారతి' కార్పొరేషన్ ఏర్పాటు

**విజయవాడ,జూన్25,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగురాష్ట్రాల్లో వివాదంగా మారిని బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బనకచర్ల ప్రాజెక్టును స్థాపించేందుకు పునాది వేస్తూ.. ప్రాజెక్టు నిర్మాణం కోసం తాజాగా "జలహారతి కార్పొరేషన్ లిమిటెడ్" అనే ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు కూడా జారీ చేసింది. సముద్రంలోకి వృధాగా పోతున్న గోదావరి జలాలన వాడుకోవడమే లక్ష్యం.

## నరకం అనుభవించి సాయం అందేలోగా మృతి

### ఇండోనేసియాలోని మోంట్ రింజాని ట్రెక్కింగ్ లో విషాదం



**జకార్తా,జూన్ 25:** ఇండోనేసియాలో క్రియాశీల అగ్నిపర్వతంపై ట్రెకింగ్ చేస్తూ ఓ బ్రెజిల్ యువతి ప్రాణాలు కోల్పోయింది. జూలియానా మారిన్స్ (26) అనే పబ్లిసిస్ట్, లొంబోక్ ద్వీపంలోని ప్రఖ్యాత మోంట్ రింజాని అగ్ని పర్వతంపై తన స్నేహితులతో కలిసి ట్రెక్కింగ్ చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. శనివారం ఉదయం సుమారు 6:30 గంటల సమయంలో పర్వత శిఖరానికి వెళ్తుండగా ఆమె కాలుజారి దాదాపు 490 అడుగుల లోతైన కొండచరియల మధ్య పడిపోయినట్లు గుర్తించారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆమె సహాయం కోసం కేకలు వేసినట్లు సమాచారం. డ్రోన్ ఫుటేజ్ ద్వారా ఆమె తొలుత ప్రాణాలతోనే ఉన్నట్లు గుర్తించినప్పటికీ, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, దట్టమైన పొగమంచు, క్లిష్టమైన భూ భాగం కారణంగా సహాయక బృందాలు వెంటనే ఆమె వద్దకు చేరుకోలేకపోయాయి. బాధితురాలు మృదువైన ఇసుకలో చిక్కుకుపోవడంతో తాళ్ల సహాయంతో బయటకు తీసుకురావడం చాలా కష్టంగా మారిందని స్థానిక సహాయక బృందం నాయకుడు ముహమ్మద్ హారియాది తెలిపారు. నాలుగు రోజుల పాటు సాగిన సహాయక చర్యల అనంతరం, మంగళవారం జూలియానా మారిన్స్ మృతదేహాన్ని కనుగొన్నట్లు ఇండోనేసియా సెర్చ్ అండ్ రెస్క్యూ ఏజెన్సీ బృందాలు, బ్రెజిల్ ప్రభుత్వం ధృవీకరించాయి.

## విద్యుత్ సంస్థల్లో డైరెక్టర్ల నియామకం

### దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థలో బాధ్యతలు స్వీకరణ

**హైదరాబాద్, జూన్ 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ట్రాన్స్‌కో, జెన్‌కో, దక్షిణ తెలంగాణ, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థల్లో ఖాళీగా ఉన్న డైరక్టర్ల పోస్టులను భర్తీ చేస్తూ సర్కార్ నిర్ణయం తీసుకుంది. ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (ట్రాన్స్‌కో) డైరక్టర్లుగా డి లతావినోద్, గాదె సంపత్, ఒరుగంటి శ్రీనివాసులు, తెలంగాణ విద్యుత్ జనరేషన్ కంపెనీ (జెన్‌కో) డైరక్టర్లుగా వై రాజశేఖర్‌రెడ్డి, పి బాలరాజు, ఎస్‌వీ కుమార్‌రాజు, బీ నాగ్యా, జీ వీరమహేందర్, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్) డైరక్టర్లుగా సిహెచ్ చక్రపాణి, ఎన్ నర్సింహులు, వి శివాజీ, పి కృష్ణారెడ్డి, ఉత్తర తెలంగాణవిద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్పీడీసీఎల్) డైరక్టర్లుగా సి ప్రభాకర్‌రావు, వి తిరుపతిరెడ్డి, టి మధుసూధన్, వి మోహన్‌రావును నియమిస్తూ విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు.

**బాధ్యతలు స్వీకరించిన ఎస్పీడీసీఎల్ డైరక్టర్లు:** దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలో నియమించబడిన డైరక్టర్లు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం చీఫ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న వట్టికొండ శివాజీ డైరెక్టర్ ప్రాజెక్ట్స్‌గా, ఇంచార్జ్ డైరెక్టర్ ఆపరేషన్‌గా పనిచేస్తున్న డాక్టర్ నలగండ్ల నరసింహులును డైరెక్టర్ ఆపరేషన్‌గా, చీఫ్‌ఇంజనీర్‌గా పనిచేస్తున్న చిలుకమర్రి చక్రపాణిపి డైరెక్టర్ కమర్షియల్‌గా, సంస్థలో చీఫ్ జనరల్ మేనేజర్/ ఫైనాన్స్‌గా రిటైర్ అయిన పాల్వాయికృష్ణారెడ్డిని డైరెక్టర్ ఫైనాన్స్‌గా బాధ్యతలు స్వీకరించారు. భాధ్యతలు స్వీకరించిన డైరెక్టర్లు సంస్థ సిఎండి ముషారఫ్ ఫరూఖిపి మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా వారికి అభినందనలు తెలిపిన సీఎండి, సంస్థకు మరియు ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా కృషి చేయాలన్నారు.

## అందుబాటులో సమగ్ర పంటల సాగు విధానం

### ప్రభుత్వానికి రీసెర్చ్ సెంటర్ నివేదిక

**హైదరాబాద్, జూన్ 25, ప్రభాతవార్త:** నేల స్వభావాన్ని బట్టి రాష్ట్ర ప్రభుత్వం సమగ్రమైన పంటల సాగు విధానాన్ని రూపొందించి, దాన్ని అందుబాటులోకి తీసుకురావాలని పరిశోధనా కేంద్రం సూచించింది. తెలంగాణలో వ్యవసాయ రంగం అభివృద్ధి కోసం పరిశోధనా కేంద్రం పలు సిఫారసులు చేసింది. దీనికి సంబంధించి పరిశోధనా కేంద్రం ఒక నివేదికను రూపొందించింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును పరిశోధనా కేంద్రం డైరెక్టర్ సురేషబాబు కలిసి ఆ నివేదికను అందజేశారు. ప్రధానంగా సమగ్ర పంటల సాగు విధానంతో పాటు, మూలవంగడాలను వినియోగించి కొత్తవాటి పరిశోధనలకు పెద్దపీట వేయాలని నివేదికలో వెల్లడించింది. అలాగే విత్తన రంగంలో స్వయం సమృద్ధి కోసం కొత్త విత్తన చట్టం తేవాలని పేర్కొంది. రిజర్వ్ బ్యాంకు సూచించినట్లు ప్రభుత్వ రంగ బ్యాంకులు ఇచ్చే రుణాల్లో 40 శాతం వ్యవసాయ రుణాలుగా ఇవ్వాలని తెలిపింది. ఈ రుణాల్లో 70 శాతం చిన్న, సన్నకారు రైతులకు అందించేలా కఠిన నిబంధనలు రూపొందించాలని సూచించింది. ప్రభుత్వరంగబీమా సంస్థలద్వారానే బీమా సౌకర్యం కల్పించాలని,చిన్నరైతుల ప్రీమియంప్రభుత్వమే చెల్లించాలని సిఫారసు చేసింది.

## మిమ్మల్ని చూసి భారత్ గర్విస్తోంది

### శుభాన్షు శుక్లాకు అభినందించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్, జూన్ 25 ప్రభాతవార్త:** ఆగ్జియోమ్ మిషన్ 4లో భాగంగా 140 కోట్ల మంది భారతీయులకు వహిస్తూ అంతరిక్షంలోకి వెళ్తున్న శుభాన్షుశుక్లాకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. 41 ఏళ్ల క్రితం రాకేశ్ శర్మ తర్వాత అంతరిక్షంలోకి అడుగుపెడుతున్న రెండో భారతీయుడిగా, ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్‌కు వెళ్తున్న తొలి భారతీయుడిగా శుభాన్షు చేస్తున్న ప్రయాణం ప్రతిభారతీయుడికీ గర్వకారణం అన్నారు.

# ఫోన్ ట్యాపింగ్‌పై కాంగ్రెస్ ఎంఎల్‌సి బల్మూరి వెంకట్ వాంగ్మూలం

### బిఆర్ఎస్ సర్కారు నీచానికి దిగజారిందని విమర్శ

**హైదరాబాద్, జూన్ 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్‌పై కాంగ్రెస్ పార్టీ ఎంఎల్‌సి బల్మూరి వెంకట్ బుధవారం నాడు జూబ్లీహిల్స్ ఎసిపి వెంకట గిరి ఎదుట హాజరై వాంగ్మూలం ఇచ్చారు. విచారణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్ విషయంలో బిఆర్ఎస్ సర్కారు అన్ని నిబంధనలను అతిక్రమించిందని, నీచా నికి ఒడిగట్టిందని దుయ్యబట్టారు. అప్పట్లో తన ఫోన్‌తో పాటు తన భార్య ఫోన్‌ను కూడా ట్యాపింగ్ చేశారని వెంకట్ ఆరోపించారు. ఆఖరుకు కుటుంబ సభ్యుల ఫోన్లు, దంపతుల ఫోన్లు కూడా ట్యాపింగ్ చేసి శునకానందం పొందారని ఆయన ఎద్దేవా చేశారు. ఈ క్రమంలోనే ప్రతిపక్ష నేతల ఫోన్లతో పాటు జడ్జిలు, సెలబ్రిటీలు, సినీ తారలు, జర్నలిస్టులు, బడా వ్యాపారుల ఫోన్లు ట్యాపింగ్ చేశారని, ఇందులో కొన్నింటి ద్వారా ప్రభాకర్ రావు బృందం కోట్లాది రూపాయలను దండుకున్నారని వెంకట్ ధ్వజమెత్తారు. ఫోన్ ట్యాపింగ్ వల్ల తనతో సహా అనేక కుటుంబాలు తీవ్ర మానసిక క్షోభను అనుభవించాల్సి వచ్చిందని ఆయన ఆవేదన చెందారు. చట్ట వ్యతిరేకంగా సాగిన ఫోన్ ట్యాపింగ్‌పై సాగుతున్న విచారణ సవ్యంగానే వుందని ఆయన అన్నారు. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కాగా ఫోన్ ట్యాపింగ్‌పై రాష్ట్ర మైనారిటీస్ ఎడ్యుకేషనల్ ఇన్స్‌ట్యూషన్స్ సొసైటీ ఛైర్మన్ ఫయీం ఖురేషి కూడా సిట్ అధికారుల ఎదుట హాజరై తన వాంగ్మూలం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పట్లో తన ఫోన్ ట్యాపింగ్ జరిగిందని మూడు రోజుల క్రితం డిసిపి తనకు ఫోన్ చేసి చెప్పడంతో పాటు ఈ విషయంలో విచారణకు రావాలని కోరా రని తెలిపారు. ఈ క్రమంలోనే తాను సిట్ అధికారుల ఎదుట విచారణకు హాజరై తన వాంగ్మూలం ఇచ్చినట్లు ఆయన తెలిపారు. అప్పట్లో తన ఫోన్‌తో పాటు భార్య ఫోన్, డ్రైవర్ ఫోన్ కూడా ట్యాపింగ్‌కు గురయ్యిందని ఆయన తెలిపారు.

ఇదంతా అప్పటి బిఆర్ఎస్ సర్కారు నీతిమాలిన చర్యగా ఆయన అభివర్ణించారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో బిఆర్ఎస్ సర్కారు ఫోన్ ట్యాపింగ్ కారణంగా తన్నై ఒత్తిడి తెచ్చిందని ఆయన ఆరోపించారు. అయితే తాను వీటికి లొంగలేదని ఆయన తెలిపారు. కాగా ఇదే కేసులో పిసిసి ప్రధాన కార్యదర్శి గడ్డ చంద్రశేఖర్ రెడ్డి, లీగల్ సెల్ ఛైర్మన్ దేవరాజు గౌడ్ సిట్ అధికారులకు వాంగ్మూలం ఇచ్చారు. చంద్రశేఖర్ రెడ్డి పిఎ కరుణాకర్ రెడ్డి, డ్రైవర్ అశోక్, కాంగ్రెస్ నాయకులు అరవింద్ గురువారం నాడు వాంగ్మూలం ఇవ్వనున్నారు.

**కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎంఎల్‌సి నవీన్ కుమార్ సహా పలువురికి నోటీసులు:** ఇదిలావుండగా ఫోన్ ట్యాపింగ్ కేసులో బాధితులుగా బిజెపి ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బిఆర్ఎస్ ఎంఎల్‌సి నవీన్ కుమార్, మాజీ ఎంఎల్ఎలు మైనంపల్లి హనుమంతరావు, కెవెస్ ర త్నం, పద్మా దేవేందర్ రెడ్డి, మర్రి శశిధర్ రెడ్డి, మర్రి జనార్ధన్ రెడ్డి, టి.రాజయ్యలకు నోటీసు లు ఇచ్చేందుకు సిట్ అధికారులు సిద్ధమవుతున్నారు.

ఈ కేసులో వీరంతా బాధితులుగా వున్నారని సిట్ విచారణలో తేలింది. వీరికి నోటీసులు జారీచేసి వారి వాంగ్మూలం నమోదు చేయా లని సిట్ అధికారులు నిర్ణయించారు. వీరితో పాటు ఐఎఎస్ అధికారులు రొనాల్డ్ రోస్, గౌతం సహా మరో ఇద్దరు బ్యూరోక్రాట్ల ఫోన్లు కూడా ట్యాపింగ్‌కు గురయ్యిం దని సిట్ విచారణలో తేలింది. వీరి వాంగ్మూలం కూడా నమోదు చేయనున్నారు.


## ఐటిబిపి వీరులు భారతదేశ శక్తి ప్రతీకలు

### కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

**హైదరాబాద్, జూన్ 25 ప్రభాతవార్త:** ఇండో టిబెటిన్ బోర్డర్ పోలీసులు(ఐటిబిపి) భారతదేశ శక్తికి ప్రతీకలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొనియాడారు. ఐటిబిపి వీరుల ధైర్యాల్ని మర్చిపోలేమని, వారి కష్టాలను విస్మరించలేమని, వారి సేవలను తక్కువగా అంచనా వేయలేమని చెప్పారు. వారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. బుధవారం మధ్యప్రదేశ్‌లోని శివపురిలోని ఐటిబిపి క్యాంపస్‌లో బండి సంజయ్ కుమార్ పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మానే మహారాజ్ ఐజీ ట్రైనింగ్ ఐటిబిపి, మహేశ్ కలావట్ డిఐజి శివపురి ఐటిబిపి, శివపురి నియోజకవర్గ ఎమ్మెల్యే దేవేందర్ జైన్, గాయత్రిశరణ్ శివపురి నగరపాలక సంస్థ అధ్యక్షురాలు,పలువురు ఐటిబిపిఉన్నతాధికారులువారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

తెర

# ఆగస్టులో 'ఓజీ' సినిమా గ్రాండ్ లాంచ్



విక్టరీ వెంకటేష్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. విక్టరీ వెంకటేష్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. అయితే ఈ సినిమా ఎప్పుడు ప్రారంభమవుతుంది అన్నది ఆసక్తికరంగా మారింది. గురూజీతో ప్రాజెక్ట్ విషయంలో కొన్ని సందేహాలు కూడా వ్యక్తమవ్వడంతోఉంటుందా? ఉండదా? అన్న దానిపై క్లారిటీ లోపించింది. ఈ నేపథ్యంలో మరో ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ అందుతోంది. ఈ సినిమా ప్రారంభోత్సవానికి ముహూర్తం కూడా పెట్టేసినట్లు వినిపిస్తుంది. ఫినిషింగ్ ఇవ్వడానికి వచ్చిన విలన్ ఓజీ ఆగస్టులో సినిమాను గ్రాండ్‌గా లాంచ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారుట. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు శర వేగంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా హీరోయిన్ ఎంపికపై టీమ్ దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. కొంత మంది బాలీవుడ్ భామల పేర్లు పరిశీలిస్తున్నారుట. వాళ్లతో పాటు సౌత్ బ్యూటీలు కూడా రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. వెంకటేష్ నటించిన సినిమాలకు త్రివిక్రమ్ రైటర్‌గా పనిచేసిన సంగతి తెలిసిందే. మల్లీశ్వరి, నువ్వు నాకు నచ్చావ్ సినిమాలకు గురూజీ రైటర్‌గా పనిచేసారు. ఇప్పుడు ఏకంగా డైరెక్టర్‌గా వెంకీని డైరెక్ట్ చేయడంతో? అంచనాలు భారీ స్థాయిలో ఉన్నాయి. ఇద్దరి కాంబినేషన్‌లో మంచి ఫ్యామిలీ కమ్ కామెడీ ఎంటర్ టైనర్ అయితే బాగుంటుందని ప్రేక్షకులు కోరుకుంటున్నారు. గతలో ఇదే జానర్ వర్కౌట్ అయింది. ఈ నేపథ్యంలో కొత్త కథతోనో... యాక్షన్ కంటెంట్‌తోనే అద్భుతాలు చేయడం కంటే ఇద్దరికీ కలిసొచ్చిన పాయింట్‌నే కథావవస్తుగా తీసుకుంటే బాగుంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అందుకు అవకాశాలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. వెంకీతో గురూజీ నేల విడిచి సాము చేసే అవకాశాలు చాలా తక్కువే. సంక్రాంతి వస్తున్నాం సినిమాతో వెంకటేష్ మార్కెట్ కూడా భారీగా పెరిగింది. ఆ సినిమా ఏకంగా 300 కోట్లకు పైగా అనూహ్య వసూళ్లు సాధించిన సంగతి తెలిసిందే.

# 'డొక్కా సీతమ్మ' లాంటి సినిమాలు భారీ విజయం సాధించాలి: మురళీ మోహన్

మురళీ మోహన్, ఆమని ప్రధాన పాత్రధారులుగా ఉషారాణి మూవీస్ బ్యానర్ మీద వల్లూరి రాంబాబు, మట్టా శ్రీనివాస్ నిర్మాతలుగా టి.వి. రవి నారాయణ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ. ఈ చిత్రానికి రాహుల్ శ్రీవాత్సవ్ కెమెరామెన్‌గా పనిచేశారు. కార్తిక్ కోడకండ్ల సంగీతాన్ని అందించారు. ఎం. రవి కుమార్ ఆర్ట్ డైరెక్టర్‌గా పని చేశారు. గతంలో రిలీజ్ చేసిన మూవీ టైటిల్ పోస్టర్ అందరినీ ఆకట్టుకుంది. ఇక తాజాగా మురళీ మోహన్ బర్త్ డే సందర్భంగా ఈ చిత్రం నుంచి స్పెషల్ పోస్టర్‌ను, గ్లింప్స్ నీ రిలీజ్ చేశారు. ఈక్రమంలో నిర్వహించిన కార్యక్రమంలో మురళీ మోహన్ మాట్లాడుతూ, నా పుట్టిన రోజుని ఎప్పుడూ కూడా ఆశ్రమాల్లో చేసుకుంటూ ఉంటాను. దివ్యాంగులు, వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాల్లో సెలెబ్రేట్ చేసుకుంటూ ఉంటాను. కూడా అంధుల ఆశ్రమానికి వెళ్లాల్సి ఉంది. కానీ ఓ అర గంట వచ్చి వెళ్లండని డొక్కా సీతమ్మ టీం పిలిచింది. అందుకే ఇలా వచ్చాను. చిన్న నిర్మాతలే అయినా నా బర్త్ డేను ఇలా సెలెబ్రేట్ చేస్తున్నందుకు థాంక్స్. రేలంగితో నా అనుబంధం మరువలేనిది. రామ సత్యనారాయణ ఎంతో మంది నిర్మాతలకు అండగా నిలుస్తుంటారు. డొక్కా సీతమ్మ మీద సినిమా తీయాలని చాలా మంది అనుకున్నారు. కాటన్ దొర సైతం డొక్కా సీతమ్మని పొగిడారు. సన్మానం చేస్తామని లండన్‌కు రమ్మని పిలిస్తే సైతం డొక్కా సీతమ్మ వెళ్లలేదు. ఖినేను అక్కడికి వస్తే ఇక్కడ వారి ఆకలి ఎవరు తీరుస్తారు? అని డొక్కా సీతమ్మ నిరాకరించారు. అలాంటి ఓ గొప్ప మనిషి మీద సినిమాను తీస్తుండటం ఆనందంగా ఉంది. ఇప్పుడు అంతా కమర్షియల్‌గా మారింది. అలాంటి టైంలో రాంబాబు, రవి నారాయణ ముందుకు వచ్చారు. ఇలాంటి చిత్రాలు పెద్ద విజయాన్ని సాధించాలి అని అన్నారు. దర్శకుడు టి.వి. రవి నారాయణ్ మాట్లాడుతూ, నా మొదటి హీరో మురళీ మోహన్‌కి పుట్టిన రోజు శుభాకాంక్షలు. ఈ కథను చేయాలని మురళీ మోహన్ చెప్పిన క్షణం నుంచీ ఇప్పటి వరకు ఆయన నన్ను ఎంకరేజ్ చేస్తూనే ఉన్నారు. ఆయన వల్లే ఈ మూవీ ఇక్కడి వరకు వచ్చింది. ఆయన సహకారాన్ని ఎప్పటికీ మర్చిపోలేను అని అన్నారు. దాసన్న మాట్లాడుతూ, డొక్కా సీతమ్మ సినిమా నుంచి రిలీజ్ చేసిన మురళీ మోహన్ ఫస్ట్ లుక్ బాగుంది. ఆయనకు భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరుకుంటున్నాను అని అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ కార్తిక్ మాట్లాడుతూ, 'మురళీ మోహన్ లాంటి గొప్ప వ్యక్తి నటిస్తున్న చిత్రానికి నేను పని చేస్తుండటం ఆనందంగా ఉంది. డొక్కా సీతమ్మ గారు అంటే ధర్మం.. ధర్మం అంటే మురళీ మోహన్. ఇలాంటి గొప్ప చిత్రంలో పని చేసే అవకాశం ఇచ్చిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు అని అన్నారు. శివ నాగు మాట్లాడుతూ, మురళీ మోహన్ డొక్కా సీతమ్మ చిత్రంతో మరో విజయాన్ని అందుకోబోతోన్నారు. నేను త్వరలోనే ఆయన్ను డైరెక్ట్ చేయబోతోన్నాను. ఆయన మహా నటులు అని అన్నారు. లయన్ సాయి వెంకట్ మాట్లాడుతూ, మురళీ మోహన్ ప్రతీ రంగంలో విజయాన్ని సాధించారు. ఇలాంటి వ్యక్తులు చాలా అరుదుగా ఉంటారు. ఆయనెప్పుడూ కూడా సర్వేజనా సుఖినోభవంతు అని అంటుంటారు. అందుకే ఆయన అంత ఆరోగ్యంగా ఉంటారు అని అన్నారు.




# హాలీవుడ్‌లోకి వరలక్ష్మి శరత్ కుమార్

ప్రముఖ నటి వరలక్ష్మి శరత్‌కుమార్ హాలీవుడ్‌లో అడుగుపెట్టారు. ప్రఖ్యాత బ్రిటిష్ నటుడు జెరెమీ ఐరన్స్ సరసన నటిస్తున్నారు. వెటరన్ దర్శకుడు చంద్రన్ రత్నం దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం శ్రీలంకలో చిత్రీకరించబడింది. రిజానా ఎ కేజ్‌డ్ బర్డ్ అనే ఈ సినిమా ఒక నిజమైన కథ ఆధారంగా రూపొందించబడుతోంది. ఈ ప్రాజెక్ట్ గురించి వరలక్ష్మి మాట్లాడుతూ, ఆస్కార్ అవార్డు గెలుచుకున్న జెరెమీ ఐరన్స్ వంటి గొప్ప నటుడితో కలిసి పనిచేయడం




నిజంగా ఒక కల నెరవేరినట్టు అనిపిస్తోంది. లయన్ కింగ్ సినిమాలో స్కార్ పాత్రకు ఆయనే వాయిస్ ఇచ్చారు. ఆ సినిమా నాకు ఇష్టం. అన్ని డైలాగులు నాపక్కా గుర్తుండిపోతాయంతగా చూసాను. ఇప్పుడా సినిమాకు వాయిస్ ఇచ్చిన ఆయనతో నేనునటించడం అనేది ఒక గొప్ప అవకాశం. చంద్రన్ రత్నం దర్శకత్వంలో పని చేయడం కూడా నాకు గర్వకారణం. శ్రీలంక లోనే కాదు, ప్రపంచ సినిమాకే ఆయన కొత్త దారులు చూపిన దర్శకుడు. ఇలాంటి అద్భుతమైన అంతర్జాతీయ స్టార్స్‌తో కలిసి పనిచేసే అవకాశం నాకు దొరికినందుకు ఆనందంగా వుంది.

# ఒకే ఒక్క హిట్ అయినా పెద్ద హీరోలతో ఛాన్స్


నిధి అగర్వాల్

టాలీవుడ్‌లో ఆమె ఓ క్రేజీ హీరోయిన్.. ఇప్పటి వరకు సినిమాలు చేసింది. కానీ ఓన్లీ ఒకే ఒక్క సినిమా హిట్ అయ్యింది. అయినా కూడా ఈ అమ్మడికి ఛాన్స్‌లు మాత్రం తగ్గడం లేదు.. ఇప్పుడు ఇద్దరు బడా హీరోల సినిమాల్లో నటిస్తుంది. అందంలో అప్సరస ఆమె.. సోషల్ మీడియాలో ఆమె ఫోటోలకు ఫుల్ క్రేజ్. టాలీవుడ్‌లో యంగ్ బ్యూటీల హడావిడి మామూలుగా లేదు. బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తూ జోరు మీదున్నారు. సినిమాల రిజల్ట్‌తో సంబంధాలు లేకుండా వరుసగా ఛాన్స్‌లు అందుకుంటూ దూసుకుపోతున్నారు. ఈ అమ్మడు కూడా అంతే .. బాలీవుడ్ నుంచి టాలీవుడ్‌కు వచ్చింది ఈ చిన్నది. తెలుగులో వరుసగా ఆఫర్స్ అందుకుంది. సినిమాలు హిట్స్ అవ్వకపోవడంతో గ్లామర్ గేట్లు ఎత్తేసింది. తన అందాలతో ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటుంది. ఇండస్ట్రీలో ఎనిమిది సినిమాలు చేసింది కానీ ఒకే ఒక్క సినిమా హిట్ అయ్యింది. అయినా కూడా ఈ చిన్నదానికి క్రేజ్ తగ్గలేదు. ఇప్పుడు రెండు పాన్ ఇండియా సినిమాలు చేస్తుంది ఆమె.. ఇంతకూ ఆమె ఎవరో తెలుసా.? ఇది కూడా అప్పుడు మాస్ రాజా సినిమాలో సైడ్ రోల్.. ఇప్పుడు స్టార్ హీరో.. ఏకంగా రవితేజ మూవీలో గెస్ట్‌గా.. అందంలో అప్సరస ఆమె.. నటనలోనూ ప్రేక్షకులను మెప్పించింది. బాలీవుడ్ నుంచి టాలీవుడ్‌కు వచ్చింది. తక్కువ సమయంలోనే స్టార్‌గా మారింది. ఇంతకూ ఆమె ఎవరో తెలుసా.? ఆమె మరెవరో కాదు హాట్ బ్యూటీ నిధి అగర్వాల్. మున్నా మైఖేల్ సినిమాతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. ఆతర్వాత తెలుగులో సవ్యసాచి సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. ఆతర్వాత బ్యాక్ టు బ్యాక్ సినిమాలుచేసింది. మిస్టర్ మజ్ను, ఆతర్వాత ఇస్మార్ట్ శంకర్ సినిమాతో హిట్ అందుకుంది. కానీ ఈ సినిమాలో తన అందంతో ఆకటుకుంది.

# 'తమ్ముడు' నుంచి సాంగ్ రిలీజ్

సంక్రాంతికి వస్తున్నాం బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాణంలో వస్తున్న మరో సూపర్ హిట్ మూవీ తమ్ముడు. దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి శ్రీరామ్ వేణు దర్శకత్వం వహిస్తున్నారు. లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జూలై 4న తమ్ముడు సినిమా వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. తమ్ముడు సినిమా నుంచి జై బగళాము.. లిరికల్ సాంగ్ రిలీజ్ చేశారు. జై బగళాము.. పాటకు జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు సాహిత్యాన్ని అందించగా, అజనీష్ లోకనాథ్ డివైన్ ట్యూన్‌తో కంపోజ్ చేశారు. సింగర్ అబీ వీ ఆకట్టుకునేలా పాడారు. జై బగళాము.. పాట ఎలా ఉందో చూస్తే జై బగళాము, జై శివనాయకీ, జై వనరూపిణీ, జై జయకారిణీ, విద్రుమ రూపిణి, విభ్రమ కారిణి, గగనఛత్ర వింధ్యాచలవాసిని, వీర విహారిణి, క్షుద్ర విదారిణి, సర్వజీవ సంరక్షిణి జననీ... అంటూ సాగుతుందీ పాట. శక్తి స్వరూపిణి అయిన అమ్మవారి మహిమను కీర్తిస్తూ గ్రామ జాతర వేడుక సందర్భంగా జై బగళాము.. పాటను చిత్రీకరించారు. నటీనటులు నితిన్, లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ, స్వసిక విజయన్, బేబీ శ్రీరామ్ దిత్య, తదితరులు. టెక్నికల్ టీమ్: సినిమాటోగ్రఫీ: కేవీ గుహన్, ఎడిటింగ్: ప్రవీణ్ పూడి మ్యూజిక్: అజనీష్ లోకనాథ్ పీఆర్వో: వంశీ కాకా, నిర్మాత దిల్ రాజు, శిరీష్.







# 'వర్జిన్ బాయ్స్' నుంచి సాంగ్ లాంచ్

రాజ్ గురు బ్యానర్‌పై రాజా దారపునేని నిర్మాతగా దయానంద్ గడ్డం రచనా దర్శకత్వంలో జూన్ 11వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం వర్జిన్ బాయ్స్. ఈ చిత్రంలో మిత్ర శర్మ, గీతానంద్, శ్రీహాన్, జెన్నీఫర్ ఇమాన్యుల్, రోనిత్, అన్షుల ముఖ్య పాత్రలు పోషించనున్నారు. స్మరణ్ సాయి సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రానికి వెంకట్ ప్రసాద్ సినిమాటోగ్రాఫర్‌గా పని చేయగా జేడీ మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. బబ్లు, కౌశల్ మంద, ఆర్జె సూర్య, సుజిత్ కుమార్, కేదార్ శంకర్, ఆర్జె శరన్, శీతల్ తదితరులు ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం నుండి విడుదలైన దం దిగా దం పాటకు ప్రణవ్ చాగంటి లిరిక్స్ అందించగా యాసిర్ నిసర్ తన స్వరాన్ని అందించారు. మార్తాండ్ కె వెంకటేష్ చిత్రానికి ఎడిటింగ్ పని చేశారు. ఆదిత్య మ్యూజిక్ ద్వారా ఈ చిత్ర పాటలు మార్కెట్లోకి విడుదలయ్యాయి. ఈ సందర్భంగా వర్జిన్ చిత్ర నిర్మాత రాజా దారపనేని మాట్లాడుతూ, సాంగ్ లాంచ్ ఈవెంట్‌కి వచ్చిన అందరికీ నా ధన్యవాదాలు. ఇప్పటికే వర్జిన్ బాయ్స్ చిత్రం నుండి టీజర్ ఇంకా ఒక పాటకు మంచి స్పందన లభించింది. సినిమా యూత్ ఫుల్‌గా ఉండబోతుంది. ఇప్పటికే ఈ చిత్రాన్ని చూసిన సెన్సార్ సభ్యులు ఈ చిత్రాన్ని ఎన్నో ప్రశంసలతో కొనియాడారు. ఆడవారు కూడా చిత్రాన్ని ప్రశంసించడం ప్రత్యేకంగా కనిపించింది. చిత్రంలో ఎంటర్టైన్మెంట్‌తో పాటు మంచి లవ్ స్టోరీ కూడా ఉంటుంది. చిత్రానికి సెన్సార్ నుండి ఏ సర్టిఫికెట్ వచ్చింది. చిత్రాన్ని నైజంలో ఏషియన్ సునీల్ గారు డిస్ట్రిబ్యూట్ చేస్తున్నారు. జులై 11వ తేదీన ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుంది అన్నారు. నటి జెన్నీఫర్ ఇమాన్యుల్ మాట్లాడుతూ, అందరికి నమస్కారం. మీడియా వారిని మరోసారి కలవడం నాకెంతో ఆనందంగా ఉంది. ఈ చిత్రంలో నాకు అవకాశం ఇచ్చినందుకు చిత్ర బంధం అందరికీ నా ప్రత్యేక ధన్యవాదాలు. ఈ చిత్రంలో నటించిన వారితో పనిచేయడం నాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. జెడి మాస్టర్ తో కలిసి పనిచేయడం ప్రత్యేకంగా కనిపించింది అన్నారు. నటుడు శ్రీహాన్ మాట్లాడుతూ, అందరికి నమస్కారం. నాకు ఈ చిత్రంలో అవకాశం ఇచ్చిన బాలుకి, మిత్రకి, రాజాకి ధన్యవాదాలు. ఈ సినిమా పూర్తిగా యూత్‌కు ఎంటర్టైన్మెంట్ కోసం చేసింది. ఈ చిత్రంలో ఏది మంచిది ఏది కానిది అనేది ఎన్నో విషయాలు చెప్పాము. ఈ సినిమా చూస్తే పూర్తిగా ఎంటర్టైన్ అవుతారు. జూలై 11వ తేదీన తప్పకుండా థియేటర్లో ఈ చిత్రంని చూడండి అన్నారు. చిత్ర దర్శకుడు దయానంద్ మాట్లాడుతూ, సాంగ్ లాంచ్ కార్యక్రమానికి హాజరైన అందరికీ నా ధన్యవాదాలు. ఈ చిత్రం ఒక మంచి లవ్ స్టోరీతో యూత్ ఫుల్‌గా ఉండబోతుంది. సినిమా చూసినంతసేపు మీ కాలేజీ రోజు గుర్తొస్తాయి. ఈ చిత్రం కోసం నిర్మాత రాజా అలాగే నటీనటులు అందరితో పని చేయడం నాకు ఎంత సంతోషకరంగా కనిపించింది. మీరందరితో కలిసి పనిచేసి మంచి సినిమాను ప్రేక్షకులకు అందిస్తున్నందుకు ఎంతో గర్వపడుతున్నాను. విడుదలైన పాట ప్రేక్షకులందరికీ నచ్చిం దని అనుకుంటున్నాను. జులై 11వ తేదీన ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్రానికి మంచి సంగీతాన్ని అందించిన స్మరణ్ సాయికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నాను. చిత్రంలో మంచి బిజీఎంతో పాటు మొత్తం ఆరు పాటలు ఉంటాయి. అలాగే చిత్రం కోసం పనిచేస్తున్న ప్రతి ఒక్కరికి మరోసారి నా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను అన్నారు. నటుడు గీతానంద్ మాట్లాడుతూ, నేను ఇంతకుముందు చేసిన రథం సినిమాకు కూడా ఇదే నిర్మాత రాజా నిర్మించారు. గత సంవత్సరం గేమ్ ఆన్ అనే చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చాను. ఇప్పుడు వర్జిన్ బాయ్స్ చిత్రం ద్వారా మరోసారి మీ ముందుకు రాబోతున్నాను. విడుదలైన ఈ దం దిగ దం పాటలు ఎంతటి పార్టీ మూడ్ ఉందో సినిమా అంతా కూడా అలాగే ఉంటుంది. సినిమా చూసి ఎంతో మంచి అనుభూతిని పొందుతారు.




# శ్రీలీల తల్లి చాటు బిడ్డే!

శ్రీలీల తల్లి చాటు బిడ్డ. కూతురంటే ఎంత గారబమో! కోపం వస్తే శివంగిలా మారిపోతుందని కొన్ని ఫన్నీ వీడియోలు చూస్తేనే వాళ్లిద్దరి మధ్య అనుబంధం ఎంత గొప్పగా ఉందన్నది అర్థమవుతుంది. అమ్మ మాటను శ్రీలీ జవదాటదు. శ్రీలీలను హీరోయిన్‌ని చేసింది కూడా తల్లే. అమ్మ ప్రణాళిక ప్రకారం శ్రీలీల నడుచుకోవడంతోనే నేడు ఈ స్థానంలో ఉంది. చిన్నప్పుడే డాన్సింగ్‌పై స్పెషల్ ట్రెనింగ్ ఇప్పించింది. అటుపై క్లాసికల్ డాన్స్ సహా రకరకాల డాన్సులను ఆ వయసులోనే అవపోశాన పట్టేసింది. నటిగా అవసరమైన ట్రెనింగ్ లన్నీ ఇప్పించింది మామ్. వెండి తెరపై హీరోయిన్‌గా చూసుకుని ఎంతో మురిసిపోతుంది ఆ తల్లి. తాను సాధించలేనిది కుమార్తె రూపంలో సాధించిందా? అన్న సందేహం వచ్చేస్తుంది ఒక్కోసారి. అంతగా తల్లి ప్రభావం శ్రీలీలపై ఉంది. శ్రీలీలను తానే స్వయంగ హీరోయిన్‌ని చేసింది. ఇది నిజంగా గొప్ప విషయమే. సినిమా అంటే రకర కాల అపోహలుంటాయి. వాటి వేటిని పట్టించుకోకుండా స్వర్ణలత కుమార్తెను ముందుకు నడిపించారు. గేమ్ ఛేంజర్.. అప్పుడే నా సిక్స్ సెన్స్ చెప్పింది. దిల్ రాజు అలా శ్రీలీల కెరీర్‌లో మామ్ కీ రోల్ పోషించారు. ఇండస్ట్రీలో ఇలాంటి గైడెన్స్ ఎంతో పనికొస్తుంది. బాలీవుడ్‌లో జాన్వీ కపూర్‌ను కూడా ఇలాగే డాడ్ బోనీ కపూర్ వెనుకుండి నడిపిస్తున్నాడు. టాలీవుడ్‌లో తరుణ్ ఫాంలో ఉన్నం కాలం మామ్ రోజా రమణి గైడెన్స్‌తోనే అంత పెద్ద స్టార్ అయ్యాడని అంటారు. కెరీర్ పట్టాలు తప్పడానికి కారణం కూడా ఆమె కారణంగా అప్పట్లో వార్తలొచ్చాయి. తాజాగా శ్రీలీల అఖిల్ హీరోగా నటిస్తోన్న లెనిన్ సినిమా నుంచి తప్పుకుందనే వార్తలొస్తున్నాయి. అందుకు కారణం శ్రీలీల తల్లి పేరు తెరపైకి వస్తోంది. మహావతార్ యూనివర్స్‌తో హోంబలే సంచలనం శ్రీలీలకు టాలీవుడ్ కంటే బాలీవుడ్ ఇతర భాషల్లోనే మంచి కెరీర్ ఉంటుందని భావించి ఆ దిశగా మూవ్ చేస్తున్నారనివినిపిస్తుంది. మరి ఈప్రచారంలో నిజమెంతో తేలాలి. తెలుగు అమ్మాయిలకు తెలుగు నిర్మాతలు అవకాశాలివ్వరు అనే ఆరోపణ చాలా కాలంగా ఉంది. కానీ శ్రీలీల విషయంలో ఇదితప్పే. శ్రీలీలకు కొన్ని మంచి అవకాశాలు కల్పించింది అన్నది వాస్తవం. ప్రస్తుతం చేతిలో కొన్ని తెలుగు సినిమాలున్నాయి. కానీ శ్రీలీలభవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకునే హిందీ, తమిళ చిత్రాల వైపు ఆసక్తిగా ఉన్నట్లు కనిపిస్తుంది.



# మహిళల ఆరోగ్య సమస్యల కోసం..



నెలసరి.. ప్రతి నెలా మహిళల్లో ఇది సహజంగా జరిగే ప్రక్రియ అయినా ఇప్పటికీ దీని చుట్టూ ఎన్నో అపోహలు, మూఢనమ్మకాలు, వీటి కారణంగా ఎంతోమంది మహిళలు తమ ఆరోగ్య సమస్యలను బయటపెట్టలేకపోతున్నారు. అందుకే ఈ మౌనాన్ని బద్దలుకొట్టే ప్రయత్నం చేస్తున్నారు. గుజరాత్‌కు చెందిన గీత సోలంకి. ప్లాస్టిక్ శ్యానిటరీ ప్యాడ్స్ కారణంగా టీనేజ్‌లోనే తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొన్న ఆమె. దీన్ని ప్రత్యామ్నాయంగా, స్కిన్ ఫ్రెండ్లీగా, పార్యావరణహితంగా ఉండేలా శ్యానిటరీ ప్యాడ్స్ తయారు చేయాలన్న ఆలోచన చేసింది. ఇదే క్లాత్ ప్యాడ్స్ తయారీకి శ్రీకారం చుట్టింది. ఇవే ఇప్పుడు లక్షల మంది గ్రామీణ మహిళలకు నెలసరి నేస్తాలుగా మారిపోయాయి.

**ఓపెన్‌గా మాట్లాడుకునే వాళ్లం...** గుజరాత్‌కు చెందిన గీతది వ్యవసాయాధారిత కుటుంబం, టీనేజ్‌లోనే బార్తోలిన్ సిస్ట్ (వెజైనాకు దగ్గరలో ఉంటే బార్తోలిన్ గ్రంథుల్లో ఏర్పడే కణితి) అనే సమస్య బారిన పడిందామె. దీనివల్ల తీవ్ర నొప్పి ఉండటం వెదుర్కొన్న ఆమెకు పిరియడ్స్ సమయంలో మరింత ఇబ్బందిగా అనిపించేది. ముఖ్యంగా బయట దొరికే శ్యానిటరీ ప్యాడ్స్ వాడడం వల్ల ఆ భాగంలో నొప్పి మరింత తీవ్రమవుతుంది. ఇదే సమస్య గురించి తన తల్లితో పంచుకోగా క్లాత్ వాడమని సూచించింది. అయితే, మొదట్లో దీన్ని తిరస్కరించినా.. ఆ తర్వాత క్లాత్ వాడకం వల్లే తన సమస్య క్రమంగా తగ్గుతుందని చెబుతోందామె. మాది ఉమ్మడి కుటుంబం.. ఇంట్లో ఆడవాళ్లమందరం ఒకచోట చేరి అన్ని విషయాల గురించి మాట్లాడుకునేవాళ్లం. శ్యానిటరీ ప్యాడ్స్ వాడకం గురించి తరచూ మా కజిన్స్ తమ అనుభవాలు, అభిప్రాయాలు పంచుకునే వారు ప్లాస్టిక్‌తో తయారుచేసిన ప్యాడ్స్ వాడడం వల్ల తామెంత అసౌకర్యానికి గుర్చి చెప్పేవారు. ఇదిలా ఉంటే నాకున్న వెజైనల్ సమస్య కారణంగా ఈ ప్యాడ్ కంటే క్లాత్ ఉత్తమమనిపించింది. నెలసరి సమయంలో అమ్మ సలహాతో దీన్ని వాడడం మొదలుపెట్టాకే సమస్య నక్రమంగా తగ్గుముఖం పట్టడం గమనించా. ఈ ఆలోచనతోనే 2018లో 'యునీ ప్యాడ్స్' అనే సంస్థను ప్రారంభించా. అప్పటికే మార్కెట్లో ఉన్న క్లాత్ ప్యాడ్స్‌ని పరిశీలించి.. వాటిలోని లోపాల్ని గుర్తించి నెలసరి రక్తాన్ని సమర్థంగా పీల్చుకొనే క్లాత్ మెటీరియల్ గురించి లోతుగా పరిశోధన చేశాకే.. నా సోదరితో కలిసి ఈ వ్యాపారాన్ని ప్రారంభించా.. అంటోంది గీత.

**ఎవరూ ముందుకు రాలేదు..!** సాధారణంగా వ్యాపారమంటే ఒకరిద్దరి వల్ల అయ్యే పని కాదు.. దీన్ని ముందుకు తీసుకెళ్లాలంటే విభిన్న నైపుణ్యాలున్న వ్యక్తులు బృందంగా కలిసి పనిచేయాల్సి ఉంటుంది. ముఖ్యంగా క్లాత్ "ప్యాడ్స్ కుట్టాలంటే కుట్టు పని తెలిసిన మహిళలు కావాలి. కానీ ఇప్పటికే నెలసరిపై ఉన్న అపోహలు, మూఢనమ్మకాల కారణంగా ఎవరూ ముందుకు రాలేదు.. ఆ సమయంలోనే ఓ ఆలోచన చేశానంటోంది గీత. శ్యానిటరీ ప్యాడ్స్ కుట్టడానికి రమ్మంటే మహిళలెవరూ ముందుకు రాలేదు. కొంతమంది ఆసక్తి ఉన్నా ఇంట్లో వాళ్లు రానివ్వ లేదు. అందుకే తెలివిగా ఆలోచించా.



కుట్టుపని నేర్పిస్తామని చెప్పి ఆసక్తి ఉన్న వారిని పనిలో చేర్చుకున్నాం. అప్పటిదాకి ఎండలో కూలి పనిచేసి చెమటోడ్చిన వారు అలా నీడలో పనిచేయడానికి వీలుగా భావించారు. తయారీలో శిక్షణ ఇచ్చాం. ఆ తర్వాత తమ నెలసరి అనుభవాల గురించి చర్చకు వచ్చేవి. ఆపై తమ నెలసరి అనుభవాల గురించి ఒకరితో ఒకరు బహిరంగంగా పంచుకోవడమూ గమనించా మార్పు మొదలైందనిపించింది. అలా 11 మంది మహిళా సిబ్బందితో మొదలైన మా సంస్థలో ఇప్పుడు సుమారు 200 మంది దాకా పనిచేస్తున్నారు.

**మా 'కిట్'లో ఏముంటాయంలే...** తొలుత తయారుచేసిన క్లాత్ ప్యాడ్స్‌ని పలువురు స్థానిక మహిళలకు అందించి.. వాళ్లిచ్చిన ఫీడ్‌బ్యాక్ సహాయంతో అందులో మార్పులు చేర్పులు చేశారు గీత. అలా తుది ఉత్పత్తిని తీసుకొచ్చారామె. అయితే కేవలం క్లాత్ ప్యాడ్స్ అందించడంతోనే సరిపెట్టుకోవాలనుకోలేదు గీత. నాలుగు క్లాత్ ప్యాడ్స్, లీక్‌ప్రూఫ్ స్టోరేజ్ పౌచ్, హాట్ వాటర్ బ్యాగ్, సబ్బు, వంటి వస్తువులన్నీ కలిపి యునీప్యాడ్ కిట్‌గా రూపొందించి మార్కెట్లోకి తీసుకొచ్చారు. తేమను పీల్చుకునే గుణం ఉన్న నాలుగు లేయర్లతో మా క్లాత్ ప్యాడ్‌ని రూపొందించాం. ఆఖరి లేయర్లో పియుఎల్ ఫ్యాబ్రిక్ వాడాం. ఇది లీక్ కాకుండా రక్షణ కల్పిస్తుంది. ఇక సాధారణ ప్యాడ్స్‌కి వింగ్స్ అనుసంధానమై ఉన్నట్లు.. మా ప్యాడ్‌కీ క్లాత్‌తో తయారుచేసిన వింగ్స్ ఉంటాయి. వాటికి రెండు బటన్స్ అమర్చాం. ఈ బటన్స్‌తో ప్యాడ్‌ని ప్యాంటీక అనుసంధానించుకోవచ్చు. ఈ క్లాత్ ప్యాడ్స్‌ని శుభ్రం చేసుకొని తిరిగి ఉపయోగించుకోవచ్చు. ఏడాది పాటు మన్నేలా నాణ్యమైన మెటీరియల్స్‌తో వీటిని తయారుచేశాం. అంటూ తాము రూపొందించిన క్లాత్ ప్యాడ్ గురించి చెబుతున్నారు గీత.

ప్రస్తుతం గుజరాత్ వ్యాప్తంగా సుమారు 190 మంది కల్యాణీలు పనిచేస్తున్నారు. ఇక మరోవైపు 'అడేలీ' పేరుతో మరో కార్యక్రమాన్ని ప్రారంభించిన గీత.. ఈ వేదికగా నెలసరి అపోహల కారణంగా వివిధ పనులకు దూరమై ఉపాధి కోల్పోయిన మహిళలకు చేయూతను అందిస్తున్నారు. ఈ క్రమంలో స్కూళ్లు రెస్టరంట్లలో వారికి వంట పనులు అప్పగిస్తూ నెలసరి సహజ ప్రక్రియే కానీ కళంకం కాదని నిరూపిస్తున్నారు. ఇక ఇదే నేపథ్యంలో ఇదే పేరుతో రూపొందించిన డాక్యుమెంటరీకి 2022లో 'కేన్స్ క్రియేటివిటీ ఫెస్టివల్'లో 'సిల్వర్ గ్లాస్ లయన్' అవార్డు దక్కింది. □

# ఆ ఆహారంతో అతివలకు దీర్ఘాయుష్షు!



ప్రపంచంలో ది బెస్ట్ ఆహార విధానమేదీ? అని ప్రశ్నిస్తే మెడిటెరేనియన్ పుడ్డే అనేస్తున్నారు ఇప్పుడు ఏ ఆహార నిపుణులైనా. ఆ ఆహారం మగవాళ్లందరికీ అందించే మేలుని అటుంచితే- ఆడవాళ్ల విషయంలో నిజంగా అద్భుతమే చేస్తుందని చెబుతోంది తాజా పరిశోధన ఒకటి. హృద్రోగం, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులొచ్చే ప్రమాదాన్ని కూడా 23 శాతం తగ్గిస్తోందని అంటోంది. రోజువారీ ఆహారంలో పండ్లూ కాయగూరలూ, ధాన్యాలూ, గింజల్ని తీసుకోవడమూ.. చేపలకి, గుడ్లకీ ప్రాధాన్యం ఇవ్వడమూ. వంటల్లో ఆలివ్ నూనెనే ప్రధానంగా వాడటమూ.. ఎప్పుడోకానీ మటన్ లాంటివాటిని ముట్టక పోవడమూ.. క్లుప్తంగా ఇదే మెడిటెరేనియన్ ఆహార విధానమంటే కచ్చితంగా ఇలాగే ఉండాలని లేదు. దీనికి కాస్త దగ్గరగా ఉన్న ఆహారాన్ని తీసుకున్నా సరే మహిళల ఆరోగ్యాల్లో చక్కటి మార్పులు వచ్చాయంటున్నారు ఈ పరిశోధకులు. అమెరికాలోని నరబిగమ్ అండ్ విమెన్స్ హాస్పిటల్ శాస్త్రవేత్తలు ఇందుకోసం 25 వేల మంది స్త్రీలని.. పాతికేళ్ల పాటు పరిశోధించారు. వాళ్లలో ఈ ఆహారాన్ని తీసుకుంటున్నవారిలో జీవక్రియ (మెటబాలిజం) రేటు చక్కగా ఉండటం, నడివయసు దాటినా సహజం ఇన్సులిన్ తగ్గక పోవడం, చెడు కొవ్వు పెరగక పోవడం చూశామంటున్నారు. ఆ కారణంగానే ప్రాణాంతక వ్యాధులు వాళ్ళదరికి రాలేదని చెబుతున్నారు. □

# చిన్నారుల మ్యాచింగ్ రెయిన్‌కోట్స్









'వానావానా వల్లప్పా. వాటిట తిరుగు చెల్లప్పా' అంటూ చినుకుల్లో తడుస్తూ.. చిన్నారుల తెగ సంబరపడిపోయే వర్షాకాలం. ఈ సందడితోపాటు పిల్లల్లో ఉత్సాహం నింపడం కోసం రకరకాలుగా వస్తున్న రెయిన్‌కోట్స్ ఇవి. అవేంటో తెలుగుసుకుందాం.

ఒంటినంతా కప్పే మోడల్ మాత్రమే కాకుండా రెయిన్‌కోట్ ఇప్పుడు డైనోసార్, ఫైర్‌ఫైటర్ డిజైన్లలో సూట్, గౌను, బ్లేజర్, కాలర్ షర్ట్, పోంఛో, హుడెడ్ జాకెట్ అంటూ, సరికొత్త డిజైన్లలో చిన్నారులను ఆకర్షిస్తున్నాయి. సాధారణ దుస్తుల్లాగే అనిపిస్తూ, పిల్లలను వర్షను చినుకుల్లో తడవకుండా రక్షిస్తాయి. లోపలి దుస్తులను పొడిగానూ ఉంచుతాయి.





జత కడుతున్నాయి... చెక్స్ పూల డిజైన్లు పరచుకున్న రెయిన్‌కోట్‌కు మ్యాచింగ్‌గా గొడుగు, బూట్లు కూడా వస్తున్నా చిన్నారుల మనసుకు నచ్చే కార్టూన్లు, జంతువుల బొమ్మల ప్రింట్స్‌తో రెయిన్‌కోట్, గొడుగు మరింత ఆకర్షణీయంగా ఉంటున్నాయి. అలాగే సాధారణ వర్షాకాలం బూట్లులాంటివి మాత్రమే కాకుండా, నచ్చిన బూట్లకు కవర్స్‌లా తొడుక్కునేలా సౌకర్యంగా జిప్స్‌తో ఉండే కవర్లూ.. వస్తున్నాయి. దీంతో ఖరీదైన బూట్లు పాడవకుండా ఉంటాయి. అంతేకాదు మోకాళ్లపై వరకు వచ్చే ప్లాస్టిక్ సాక్సు లాంటివి మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. పలు డిజైన్ల పింట్‌తో వస్తున్న ఇవి ప్యాంటును తడవనివ్వకుండా ఉంచగలవు. ఈ సౌకర్యాలన్నీ పిల్లలను వర్షాకాలంలోనూ సరదాగా గడిపేలా చేస్తాయి. □





# సుగుణాల పండు నేరేడు



నల్లగా నిగనిగలాడే నేరేడు పండును చూస్తేనే నోరూరిపోతుంది. కండ తక్కువ, గింజ పెద్దది కనుక ఎన్ని తిన్నా తిన్నట్టే ఉండదు. ఇవి రుచిలోనే కాదు, ఆరోగ్యం అందించడంలోనూ ముందుంటాయి. వీటితో ఎన్ని లాభాలున్నాయంటే.

- నేరేడుపండ్లు తినటం వల్ల శరీరానికి అవసరమైన క్యాల్షియం, ఐరన్, మెగ్నీషియం, భాస్వరం, పొటాషియం, సోడియం, సల్ఫర్, థియామిన్, రిబోఫ్లేవిన్, ఫోలిక్ యాసిడ్, ఎ,బి1, బి2, బి3, బి5, బి6, సి-విటమిన్లు అందుతాయి.
- రక్తపోటును తగ్గిస్తాయి, కొలెస్ట్రాల్ స్థాయిని నియంత్రిస్తాయి. గుండెకు మేలు చేస్తాయి.
- బరువు తగ్గటంలో తోడ్పడతాయి.
- కీళ్లనొప్పులను నివారిస్తాయి.
- కంటిచూపును మెరుగుపరుస్తాయి. గొంతులో వచ్చే సమస్యలను నివారిస్తాయి.
- జుట్టు రాలదు. కుదుళ్లు దృఢంగా ఉంటాయి.
- శరీరంలో చేరిన మలినాలను హరింపచేస్తాయి.
- కాలేయాన్ని సంరక్షిస్తాయి.
- మూత్రపిండాలను ఆరోగ్యంగా ఉంచుతాయి.
- చర్మం కాంతితో మెరిసేలా చేస్తాయి.
- మెదడు పనితీరును మెరుగుపరుస్తాయి.
- రోగనిరోధక శక్తిని పెంచుతాయి.
- జీర్ణ ప్రక్రియ సాఫీగా ఉంటుంది.
- రక్త హీనతతో బాధపడుతున్న వారు వీటిని తీసుకోవటం వల్ల సత్వర ప్రయోజనం ఉంటుంది.
- రక్తహీనతతో బాధపడుతున్న వారు వీటిని తీసుకోవటం వల్ల సత్వర ప్రయోజనం ఉంటుంది. □

## చెలి చిట్కా

జీలకర్రను దోరగా వేయించి మెత్తగా చూర్ణంచేసి 2 గ్రాముల మోతాదుతో కొద్దిగా నెయ్యికలిపి రోజూ రెండుసార్లు సేవిస్తే బాలింతలకు పాలు వృద్ధి చెందుతాయి. □

# వ్యథ: యోగాలో జాగ్రత్తలు పాటించాలి !



**ఎన్.బి.సుధాకర్‌రెడ్డి**
**సైకాలజిస్టు**

ప్రశ్న: నేను ఉన్నత లక్ష్యంతో యోగాసనాలు సాధన చేశాను. అయితే మరుసటి రోజు జ్వరం, కీళ్ళు, కండరాల నొప్పులు వచ్చాయి. విపరీతమైన అలసట, నీరసం ఆవహించింది. డాక్టరును కలసి మందులు వాడితే రెండు రోజుల తరువాత పూర్తిగా తగ్గింది. నా వయస్సు 45 ఏళ్ళు. ఎత్తు ఐదు అడుగుల నాలుగు అంగుళాలు, బరువు 70 కిలోలు ఉన్నాను. ఒక పెద్ద కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పని చేస్తున్నాను. ఇటీవల ఎక్కువగా ఒత్తిడికి గురవుతున్నాను. మధుమేహం బార్డర్‌లో ఉంది. రక్తపోటు కొద్ది ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ యోగదినోత్సం రోజున యోగసాధన లక్ష్యంగా పెట్టుకున్నాను. యూట్యూబ్‌లో పలు క్లిష్టమైన యోగాసనాలు చూసి, వాటిపై అవగాహన పెంచుకున్నాను. అందులో ఆసనాలకు రారాజైన శీర్షాసనం, కొద్ది కష్టమైన మయూర ఆసనం, సర్వాంగాసనం, హలాసనం పశ్చిమోత్తానాసనం తదితర పది ఆసనాలను ఎంపిక చేసుకున్నాను. ఉదయం ఒక గంట, సాయంత్రం ఒక గంట సాధన చేశాను. అయితే మరుసటి రోజు జ్వరం వళ్ళు నొప్పులు వచ్చాయి. సహజంగా యోగ సాధన చేస్తే కీళ్ళు, కాళ్ల కండరాలు, నరాలు శక్తివంతం అవుతాయని అంటారు. మరి నాలో ఇలాంటి ప్రతికూల సమస్యలు ఎందుకు వచ్చాయో అర్థం కావాడం లేదు. అయితే తిరిగి యోగా సాధన కొనసాగించాలని భావిస్తున్నాను. దీనికి తగిన జాగ్రత్తలు సూచించగలరు. - ఒక సోదరి, గుంటూరు.



జవాబు : అమ్మా యోగాసనాల వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. శారీరక శక్తి, మానసిక ప్రశాంతత చేకూరుతుంది. బరువు నియంత్రణలో ఉంటుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. పలు శారీరక రుగ్మతలు నియంత్రణలో ఉంటాయి. తొలి నుంచి యోగ సాధన చేసే వారిలో రోగాలు, రుగ్మతలను ఎదుర్కొనే శక్తి ఉంటుంది. యోగాసనాలు నివారణ, నియంత్రణ చికిత్సా సాధనాలుగా ఉపయోగపడతాయి. అయితే ప్రారంభ దశలోనే యోగాను అతిగా సాధన చేయడం వల్ల దుష్పలితాలు తలెత్తే ప్రమాదం ఉంది. శారీరక స్థితి, శక్తి సామర్థ్యం తదితర అంశాలను బట్టి ఈ నష్టాలు ఉంటాయి. ముఖ్యంగా అతిసాధన వల్ల అంతర్గత గాయాలు అయ్యే అవకాశం ఉంది. కండరాల నొప్పులు బెణుకులు, కండరాలు పట్టేయడం, తలనొప్పి, అలసట వకారం లాంటివి రావచ్చు. అరుదుగా జ్వరం కూడా రావచ్చు. అయితే యోగాను సురక్షితంగా చేయడానికి పలు జాగ్రత్తలు పాటించాలి. ప్రాథమిక దశలో యోగ నిపుణుల సలహాలు తీసుకుని వారి పర్యవేక్షణలో సాధన ప్రారంభించాలి. ఎవరికి వారు తమ శారీరక సామర్థ్యం, సాగుడు గుణం పట్ల అవగాహన కలిగి ఉండాలి. యోగాసనాలలో ఎక్కువ వంగడం, సాగడం, మెలికలు తిరగడం లాంటి బంగిమలు ఉంటాయి. వాటిని ఒక రోజులో సాధించడం వీలు కాదు. నెమ్మది నెమ్మదిగా సాధన చేస్తుంటే పరిపూర్ణత రావడానికి నెల, రెండు నెలలు పట్టవచ్చు. యోగ సాధన సమయంలో నొప్పులు, బాధలు అనిపిస్తే ఆపేయాలి. నెమ్మది నెమ్మదిగా స్థాయి పెంచాలి. నొప్పులు, అలసట అనిపించినపుడు శవాసనంలో విశ్రాంతి తీసుకోవడం మంచిది. మీరు తొలి రోజే కష్టమైన ఆసనాలను ఉదయం, సాయంత్రం గంట చొప్పున సాధన చేయడం వల్ల సమస్యలు వచ్చాయి. ఇక మీదట జాగ్రత్తలు పాటిస్తూ సాధన ప్రారంభించండి. యోగ సాధన ఖాళీ కడుపుతో చేయాలి. ఆసనాలు చేయడానికి ముందు వాకింగ్ అప్ చేయాలి. అంటే శరారీన్ని సంసిద్ధం చేయాలి. దీనికి కొన్ని పద్ధతులు ఉన్నాయి. గాలి వెలుతురు పరిశుభ్రత ఉండేలా ప్రదేశాన్ని ఎంచుకోండి. నెమ్మది, నెమ్మదిగా సాధన చేస్తూ వారం, వారం సమయం కొద్దిగా పెంచుకుంటూ పరపూర్ణత సాధించండి. □

# పావ్‌భాజీ మసాలా

వీధుల్లో దొరికే తినుబండారాల్లో చిన్నా పెద్దా అందరికీ నచ్చేస్తుంది పావ్ భాజీ. ఇది ఇంట్లోనే చేసుకోవచ్చు. ఆ మసాలా పొడి గనుక సిద్ధంగా ఉంటే.. ఈ వర్షాకాలం ఎప్పుడంటే అప్పుడు వేడివేడిగా పావ్‌భాజీ తిని ఆనందించవచ్చు. పావ్‌భాజీ మసాలా కోసం.. ధనియాలు-4 టేబుల్ స్పూన్లు, జీలకర్ర- 2 టేబుల్ స్పూన్లు, ఆమ్‌చూర్ పౌడర్, మిరియాలు-టేబుల్ స్పూన్ చొప్పున, సోంపు-ముప్పావు టేబుట్ స్పూన్, కశ్మీరీ ఎండుమిర్చి-8, లవంగాలు-10, యాలకులు-2, ఒక బిర్యానీ ఆకు, రెండు అంగుళాల దాల్చినచెక్క, చెంచా పసుపు సిద్ధంగా ఉంచుకోవాలి. కడాయిలో ధనియాలు, జీలకర్రలను మంచి వాసన వచ్చేదాకా వేయించాలి. వాటిని పళ్లెంలోకి తీసి.. బిర్యానీ ఆకు, దాల్చినచెక్క, మిరియాలు, యాలకులు, లవంగాలు, సోంపులను వేయించాలి. చివర్లో కశ్మీరీ ఎండుమిర్చిని కూడా వేయించాలి. అన్నిటినీ చల్లారనిచ్చి.. ఆమ్‌చూర్ పౌడర్, పసుపు చేర్చి మెత్తడి పొడి చేయాలి. ఇక తినాలనిపించి నప్పుడు ఉల్లి, టొమాటో, క్యాప్సికం, బంగాళదుపం, బఠాణీలతో చేసే భాజీలో-పావ్‌భాజీ మసాలా జోడించాలి. పావ్‌లను వెన్నతో వేయించి.. భాజీతో తింటే మస్ట్ మజానే కదా! □





# ఓం సత్యనారాయణ స్వామినే నమః





ఆధ్యాత్మికం

**సాయిబాబా** ద్వారకామాయిలో దర్శనమిస్తున్న చిత్రాన్ని భావితరాలకు అందించిన కీర్తి శ్యామరావు జయకర్‌కు చెందుతుంది. ఆయన అనేక అనుభవాలను సాయి సన్నిధిలో పొందాడు. 1917 ఆషాడమాసం (సుమారు జూలై నెలలో వచ్చేది)లో జరిగిన సంఘటన ఆయన తెలిపారు. వర్దే అనే భక్తుడు సత్యనారాయణ పూజను చేసుకుంటాను అనుమతి ఇవ్వమన సాయిని అర్థించాడు. సాయి సరే అన్నాడు. వర్దే చాలా గడుసు పిండం. వర్దే నా దగ్గర డబ్బు లేదు ఇవ్వమని సాయినే అడిగాడు. సాయిబాబా వద్ద ఆ సమయంలో డబ్బు లేదు. సాయిబాబా అప్పుడు శ్యామరావ్ జయకర్‌ను చూపారు. అతడు ద్వారకామాయి సభామండపంలో కూర్చుని ఉన్నాడు. జయకర్ అనేకసార్లు సాయి సన్నిధిలో చూచాడు వర్దేను. అంతేగాని ఎట్టి పరిచయం లేదు ఆయనకు. వర్దే సరాసరి జయకర్ వద్దకు వచ్చి తాను సత్యన్నారాయణ పూజ చేసుకోవటానికి డబ్బును జయకర్ వద్ద నుండి తీసుకోమన్నారు సాయి అన్నాడు. డబ్బు ఎంతకావాలని అడిగాడు జయకర్ రెండు రూపాయల అయిదు అణాలు అవుతుందని వర్దే చెప్పాడు. జయకర్ జేబుల్లో ఉన్న డబ్బంతా తీసి లెక్కించాడు. సరిగ్గా రెండు రూపాయల అయిదు అణాలు మాత్రమే ఉన్నాయి. ఇది సాయినాథుని చమత్కారమని భావించాడు జయకర్. ఆ డబ్బును వర్దేకు ఇచ్చాడు. పూజలకు కావలసిన సరంజామా తెచ్చాడు వర్దే. వర్దే గడుసరి భక్తుడు. సాయిబాబానే సత్యనారాయణునిగా భావించి పూజ చేసుకుంటానన్నాడు వర్దే. కుదరదన్నాడు సాయి. కానీ భక్తుని ఒత్తిడికి సరే నన్నాడు సాయి. సాయిబాబాకు రెండు వైపులా అరటి పిలకలను పెట్టి, పాలవెల్లిని కూడా కట్టి పూజించాడు. సత్యనారాయణ వ్రత కథను మటపంలో పురోహితుడు చదివాడు. అందరూ శ్రవణం చేశారు. అది ఒక మధుర మనోహర దృశ్యం. దానిని ఊహించుకొని మనం ఆనందించాలి. సాయిబాబా మహాసమాధి అనంతరం ఎంబి. సహస్ర బుద్దే అను భక్తునకు సాయి సమాధి మందిరంలో సత్యనారాయణ పూజ నిర్వహించి నట్లు, నివేదనలు సాయి సమాధిలోనికి చేరినట్లు కల వచ్చింది. సత్యనారాయణ పూజ ఆ రోజు జరిగినట్లు సంస్థానం వారు ధృవీకరించారు.

'ఓం శ్రీ సాయి సత్యనారాయణ స్వామినే నమః □

- యం.పి.సాయినాథ్

# ర్యాంకింగ్స్‌లో 7వ స్థానానికి రిషబ్






## ఆల్ రౌండర్ల అగ్రస్థానంలో రవీంద్ర జడేజా

**న్యూఢిల్లీ:** ఇంగ్లండ్‌తో తొలి టెస్టుల్లో బ్యాక్‌టుబ్యాక్ సెంచరీలతో చెలరేగిన భారత స్టార్ వికెట్ కీపర్ రిషబ్ పంత్ ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో అత్యుత్తమంగా ఏడో ప్లేస్‌కు చేరుకున్నాడు. ఈ మేరకు ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌ను విడుదల చేసింది. కెప్టెన్ శుభ్‌మాన్ గిల్ సైతం టాప్20లోకి ప్రవేశించాడు. లీడ్స్ టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో గిల్ సెంచరీ చేశాడు. టాప్ 20 టెస్ట్ బ్యాట్స్‌మెన్ జాబితాలో భారతదేశం నుంచి ముగ్గురు బ్యాట్స్‌మెన్ మాత్రమే ఉన్నారు. పంత్, గిల్‌తో పాటు యశస్వి జైస్వాల్ నాలుగోస్థానంలో ఉన్నాడు. లీడ్స్ టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో యశస్వి సైతం సెంచరీ చేశాడు. అయితే టెస్ట్ బౌలర్ల ర్యాంకింగ్స్‌లో పెద్దగా మార్పులు జరుగలేదు. హెడింగ్లీ టెస్ట్‌లో 14వసారి ఐదు వికెట్లు తీసిన తర్వాత భారత ఫాస్ట్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. టెస్ట్ బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో ఇంగ్లండ్ విజయంలో కీలకపాత్ర పోషించిన బెన్ డకెట్ ఐదు స్థానాలు ఎగబాకి ఎనిమిదో స్థానానికి చేరుకున్నాడు. ఇంగ్లండ్ బ్యాట్స్‌మెన్ ఓలీ పోప్ మూడు స్థానాలు ఎగబాకి 19వ స్థానానికి, జామీ స్మిత్ ఎనిమిది స్థానాలు ఎగబాకి 27వ స్థానానికి చేరుకున్నారు. ఇంగ్లండ్ సీనియర్ ప్లేయర్ జో రూట్ నంబర్ వన్ స్థానంలో కొనసాగుతున్నాడు. హ్యారీ బ్రూక్ రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. న్యూజిలాండ్‌కు చెందిన కేన్ విలియమ్సన్ మూడోస్థానంలో ఉన్నాడు. లీడ్స్‌లో ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ బాల్, బ్యాట్‌తోనూ రాణించగా, ఆల్‌రౌండర్ల జాబితాలో మూడుస్థానాలు మెరుగుపరుచుకొని ఐదోప్లేస్‌కు చేరాడు. టెస్ట్ ఆల్ రౌండర్ల జాబితాలో టీమిండియా ప్లేయర్ రవీంద్ర జడేజా అగ్రస్థానంలో ఉన్నాడు. గాలె టెస్టులో 163 పరుగులు చేసిన బంగ్లా ప్లేయర్ ముష్ఫికర్ రహీమ్ 11 స్థానాలు ఎగబాకి 28వ స్థానానికి చేరుకోగా, నజ్ముల్ హుస్సేన్ శాంటో ఒకే మ్యాచ్‌లో రెండు సెంచరీలు చేసి 21 స్థానాలు ఎగబాకి 29వ స్థానానికి చేరుకున్నాడు.

## ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ అథ్లెట్ల పతకాల జోరు

**న్యూఢిల్లీ:** సీనియర్ నేషనల్ ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్‌లో 3వ రోజు భారత్ అథ్లెట్ల పతకాల జోరు కొనసాగింది. వివిధ ఈవెంట్లలో స్వర్ణ, రజత, కాంస్య పతకాలను సాధించారు. ఈ టోర్నీలో కర్ణాటకకు చెందిన ఎస్ రుజుల అత్యంత వేగవంతమైన ఈత అమ్మాయిగా నిలిచి అత్యుత్తమ భారతీయ ప్రదర్శన ఇచ్చింది. 2008లో సింగపూర్‌లో శిఖా టాండన్ నెలకొల్పిన 0.01 సెకన్ల రికార్డును రుజుల 50 మీటర్ల ఫ్రీస్టైల్‌లో 26.36 సెకన్లలో పూర్తి చేసి బద్దలు కొట్టింది. రైల్వేస్‌కు చెందిన అవంతిక సుధీర్ చవాన్ (26.58సె), కర్ణాటకకు చెందిన దేశింఘు (26.69సె) వరుసగా రజత మరియు కాంస్య పతకాలతో సరిపెట్టుకున్నారు. పురుషుల 400 మీటర్ల ఫ్రీస్టైల్‌లో గుజరాత్‌కు చెందిన ఆర్యన్ నెహ్రా 3:55.96 సెకన్ల సమయంతో స్వర్ణాన్ని సాధించాడు. ఢిల్లీకి చెందిన కుషాగ్ర రావత్ (3:56.84సె), కర్ణాటకకు చెందిన అనీష్ ఎస్ గౌడ (3:57.17సె) వరుసగా రజత, కాంస్యం గెలుచుకున్నారు. మహిళల 200 మీటర్ల బటర్‌ఫ్లై పోడియంను రైల్వేకు చెందిన ఆస్తాచౌదరి (2:20.63సె), తమిళనాడుకు చెందిన రోషిణి బాలసుబ్రమణియన్ (2:20.77సె), ఒడిశాకు చెందిన శ్రుష్టి ఉపాధ్యాయ (2:23.11సె) సొంతం చేసుకున్నారు. పురుషుల 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో శ్రీహరి నటరాజ్ 25.70 సెకన్లలో సాధించాడు. మహారాష్ట్రకు చెందిన రిషబ్ అనుపమ్ (26.02సె), కర్ణాటకకు చెందిన ఆకాష్ మణి (26.12సె) వరుసగా రజత, కాంస్యం గెలుచుకున్నారు. 200 మీటర్ల బటర్‌ఫ్లైలో ఒలింపియన్ సజన్ ప్రకాష్ 1:58.98 సెకన్లతో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చాడు. రైల్వేకు చెందిన బిక్రమ్ చాంగ్‌మై (2:02.13 సెకన్లు), కర్ణాటకకు చెందిన దర్శన్ ఎస్ (2:03.11 సెకన్లు) వరుసగా రజత, కాంస్య పతకాలను గెలుచుకున్నారు. మహిళల 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో కర్ణాటకకు చెందిన విహిత (29.99 సెకన్లు) స్వర్ణం, గోవాకు చెందిన సంజన ప్రభుగాంకర్ (30.68 సెకన్లు) రజతం, బెంగాల్‌కు చెందిన సౌబ్రిటీ మండల్ (30.70 సెకన్లు) రజతం సాధించారు. ఢిల్లీకి చెందిన భవ్య సచ్‌దేవా 17:35.07 సెకన్లలో గమ్యాన్ని చేరుకోవడం ద్వారా 10 ఏళ్ల మహిళల 1500 మీటర్ల ఫ్రీస్టైల్ మీట్ రికార్డును బద్దలు కొట్టింది. ఇది ఛాంపియన్‌షిప్‌లలో భవ్యకు రెండవ స్వర్ణం మరియు మొత్తం మీద మూడవ పతకం. అంతకుముందు ఆమె 400 మీటర్ల ఫ్రీస్టైల్‌లో స్వర్ణం మరియు 200 మీటర్ల ఫ్రీస్టైల్‌లో రజతం సాధించింది. ఇక రజతం కోసం హోరాహోరీగా జరిగిన రేసులో తెలంగాణకు చెందిన వృత్తి అగర్వాల్ (17:41.36) కర్ణాటకకు చెందిన తాన్య షడక్షరిని (17:41.45) ఓడించింది.

## అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో మురాద్, అనుష్కలకు స్వర్ణాలు



**న్యూఢిల్లీ:** జాతీయ అండర్ 20 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో పురుషుల 400 మీటర్ల హార్డిల్స్‌లో మురాద్ కొత్త మీట్ రికార్డును నెలకొల్పగా, మహిళల హ్యామర్ త్రోలో అనుష్క అదే స్థానాన్ని దక్కించుకుంది. ప్రయాగ్‌రాజ్ లోని మదన్ మోహన్ మాలవ్య స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన 23వ జాతీయ జూనియర్ (అండర్ 20) ఫెడరేషన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లలో గుజరాత్‌కు చెందిన మురాద్ సిర్మాన్ మరియు ఉత్తరప్రదేశ్‌కు చెందిన అనుష్క యాదవ్ కొత్త మీట్ రికార్డులను సృష్టించారు. పురుషుల 400 మీటర్ల హార్డిల్స్‌లో మురాద్ 50.75 సెకన్ల అద్భుతమైన సమయంతో స్వర్ణం సాధించాడు, 2012లో దుర్గేష్ కుమార్ పాల్ నెలకొల్పిన 51.26 సెకన్ల మీట్ రికార్డును బద్దలు కొట్టాడు. అలాగే మహిళల హ్యామర్ త్రోలో, అనుష్క 60.46 మీటర్ల దూరం నమోదు చేయడం ద్వారా అంచనాలను అధిగమించింది. 2022 నుండి తాన్యచౌదరి కలిగి ఉన్న 57.09 మీటర్ల మీట్ మార్కును అధిగమించింది. ఈ సంవత్సరం ప్రారంభంలో జరిగిన 2025 ఉత్తరాఖండ్ జాతీయ క్రీడలలో 62.89 మీటర్లు విసిరి అనుష్క ఇప్పటికే జూనియర్ జాతీయ రికార్డును కలిగి ఉండగా, ఇక్కడ ఆమె ఫామ్ ఆమె ఆధిపత్యాన్ని మరింత ధృవీకరించింది.



## టెస్టుల్లో టీమిండియా చెత్త రికార్డు

### బ్యాటర్లు రాణించినా ఫీల్డింగ్, బౌలర్ల వైఫల్యం

**న్యూఢిల్లీ:** టెస్టు క్రికెట్‌లో టీమిండియా చెత్త రికార్డును నమోదు చేసుకుంది. అంతకుముందు ఈ చెత్త రికార్డు ఆస్ట్రేలియా పేరిట ఉండేది. ఇంగ్లండ్‌తో జరిగిన తొలి టెస్టులో ఓటమి చెందడంతో టెస్టు క్రికెట్‌లో భారత్ చెత్త రికార్డు సంపాదించింది. ఒక టెస్టు మ్యాచ్‌లో ఐదు సెంచరీలు చేసి ఓటమిపాలైన తొలి జట్టుగా భారత్ నిలిచింది. ఐదు టెస్టు మ్యాచ్‌ల్లో భాగంగా లీడ్స్‌లోని హెడింగ్లీ మైదానంలో ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి టెస్టు మ్యాచ్‌లో ఇండియా ఓటమిపాలైంది. ఇందులో భారత్ బ్యాటర్లు అద్భుతంగా రాణించి సెంచరీల మోత మోగించారు. కానీ, ఫీల్డింగ్, బౌలింగ్‌లో ఆశించిన స్థాయిలో ప్రదర్శన కనబర్చలేదు. రెండో ఇన్నింగ్స్‌లో 371 పరుగుల భారీ లక్ష్యాన్ని ఐదోరోజు మ్యాచ్‌లో ఇంగ్లాండ్ సునాయసంగా ఛేదించింది. దీంతో తొలి టెస్టులో విజయాన్ని అందుకుంది. తొలి ఇన్నింగ్స్ రిషబ్ పంత్ 134, రెండో ఇన్నింగ్స్‌లో 118 పరుగులు చేశాడు. యశస్వీ జైస్వాల్ తొలి ఇన్నింగ్స్‌లో 101, శుభ్‌మన్ గిల్ తొలి ఇన్నింగ్స్‌లో 147, కేఎల్ రాహుల్ రెండో ఇన్నింగ్స్‌లో 137 పరుగులు. ఇలా రెండు ఇన్నింగ్స్‌లలో ఐదుగురు బ్యాటర్లు సెంచరీలు చేసినా టెస్టు మ్యాచ్‌లో భారత్ జట్టు ఓటమిచెందింది. అయితే ఈ చెత్త రికార్డు ఇప్పటి వరకూ ఆస్ట్రేలియా పేరిట ఉండేది. 1928-29లో జరిగిన యాషెస్ మ్యాచ్‌లో నాలుగు సెంచరీలు చేసినప్పటికీ ఆ జట్టు ఓడిపోయింది. డాన్ బ్రాడ్‌మాన్ ఆ మ్యాచ్‌లో తన తొలి సెంచరీ చేశాడు. ఇక ప్రస్తుత టెస్ట్ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 471 పరుగుల భారీస్కోరు చేయగా, ఇంగ్లాండ్ 465 పరుగులకు ఆలౌటైంది. ముఖ్యంగా ప్రసిద్ధ్ కృష్ణ, శార్దూల్ ఠాకూర్ ధారాళంగా పరుగులు సమర్పించుకున్నారు. కర్ణాటక పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ తొలి ఇన్నింగ్స్‌లో 20 ఓవర్లు బౌలింగ్ చేసి 3 వికెట్లు పడగొట్టినప్పటికీ, ఏకంగా 128 పరుగులు ఇచ్చాడు. అతని ఎకానమీ రేటు 6.40గా నమోదైంది. ఇది టెస్ట్ క్రికెట్‌లో అత్యంత చెత్త గణాంకాలలో ఒకటిగా నిలిచింది. ఇక రెండో ఇన్నింగ్స్‌లోనూ ప్రసిద్ధ్ తన వైఫల్యాన్ని కొనసాగించాడు. 6 ఓవర్లు వేసి వికెట్ తీయకుండా 38 పరుగులు ఇచ్చాడు. మరోవైపు, పేస్ ఆల్‌రౌండర్‌గా జట్టులోకి వచ్చిన లార్డ్ శార్దూల్ ఠాకూర్ బంతితో పాటు బ్యాట్‌తోనూ విఫలమయ్యాడు. తొలి ఇన్నింగ్స్‌లో కెప్టెన్ అతనికి కేవలం 6 ఓవర్లు మాత్రమే ఇచ్చాడు. అందులో శార్దూల్ వికెట్ తీయకుండా 38 పరుగులు సమర్పించుకున్నాడు (ఎకానమీ 6.33)గా ఉంది. రెండో ఇన్నింగ్స్‌లో అయితే పరిస్థితి మరింత దారుణంగా మారింది. కేవలం 3 ఓవర్లు వేసి 17 పరుగులు ఇచ్చాడు. రెండు ఇన్నింగ్స్‌లలోనూ ఒక్క వికెట్ కూడా పడగొట్టలేకపోయాడు.

## 'నేషన్స్ హాకీ'లో భారత్ ఓటమి

### 1-5 తేడాతో స్పెయిన్ విజయం

**న్యూఢిల్లీ:** 4నేషన్స్ హాకీ టోర్నమెంట్‌లో భారత జూనియర్ పురుషుల జట్టు స్పెయిన్ చేతిలో పరాభవం చెందింది. ఈ టోర్నీలో భారత జూనియర్ పురుషుల హాకీ జట్టు తమ మూడవ మరియు చివరి పూల్ దశ మ్యాచ్‌లో స్పెయిన్ చేతిలో 1-5 తేడాతో ఓడిపోయింది. స్పెయిన్ ఫ్రంట్ ఫుట్ ద్వారా ఆటను ప్రారంభించింది, మొదటి నిమిషాల్లోనే వరుసగా రెండుసార్లు గోల్ చేసింది. 2వ నిమిషంలో పెరె అమాట్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచాడు. ఆ తర్వాత శాంటి మార్టిన్ 3వ నిమిషంలో ఫీల్డ్ గోల్ చేసి స్పెయిన్‌కు 2-0 ఆధిక్యాన్ని అందించాడు. రెండవ క్వార్టర్‌లో రెండు జట్లు ఎండ్‌టుఎండ్ హాకీలో పాల్గొన్నాయి. ఇరు జట్లు గోల్ కోసం ప్రయత్నిస్తూ ఆధిక్యాన్ని పెంచుకోవాలని చూసినా ఏ జట్టు కూడా తమ అవకాశాలను మలచుకోలేకపోయింది. దీంతో హాఫ్ టైం ముగిసే సమయానికి స్కోరు 2-0తో స్పెయిన్‌కు అనుకూలంగా ఉంది. మూడో క్వార్టర్‌లో స్పెయిన్ తిరిగి నియంత్రణ సాధించి,



భారత్ రక్షణాత్మక లోపాలను సద్వినియోగం చేసుకుంది. పెరే అమత్ (42వ నిముషం) మరో పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మార్చడం ద్వారా మ్యాచ్‌లో తన రెండవ గోల్‌ను జోడించాడు. ఒక నిమిషం తర్వాత, జోసెప్ మార్టిన్ (43వ నిముషం)తో స్పెయిన్ ఆధిక్యాన్ని 4-0కి పెంచి ఫీల్డ్ గోల్ చేశాడు. ఇక నాల్గవ మరియు చివరి క్వార్టర్‌లో, మారియో మెనా (51వ నిముషం) చేసిన మరో పెనాల్టీ కార్నర్ ద్వారా స్పెయిన్ ఐదవ గోల్‌తో అంతరాన్ని మరింత పెంచింది. అరైజీత్ సింగ్ హుండాల్ (52వ నిముషంలో) ఫీల్డ్ గోల్ చేసి లోటును తగ్గించి క్లీన్ స్వీప్‌ను నివారించడంతో భారత్ దాదాపు వెంటనే ఒక గోల్‌ను వెనక్కి తీసుకోగలిగింది. ఈ ఫలితంతో, భారతదేశం తన పూల్ దశ మ్యాచ్‌లను ముగించింది.

# వాణిజ్యం

## టాటాప్లేకు పెరుగుతున్న నష్టాలు

### ఈ యేడాదిలోనే 529.43 కోట్ల నష్టం

**ముంబై, జూన్ 25:** డిజిటల్ రంగంలో మూడో అతిపెద్ద కంపెనీగా ఉన్న టాటాప్లే నష్టాలు పెరుగుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొత్తం నష్టం 529.43 కోట్లకుపెరిగింది. ఇతర డిటిహెచ్ ఆపరేటర్లు డిష్‌టివి, ఎయిర్‌టెల్ డిజిటల్‌టివి, డివి ఫ్రీడిష్‌లతో ఇపుడు పోటీపడుతోంది. 2024లో కంపెనీకి 353.88 కోట్లునష్టం వాటిల్లింది. కార్యకలాపాల ద్వారా వచ్చే రాబడులు 5.15 శాతం తగ్గి 4082.5కోట్లకు పెరిగాయి. నష్టాలకు తగిన కారణాలు మాత్రం కంపెనీ చెప్పలేకపోతోంది. మొత్తం ఆదాయం అన్ని వనరులనుంచి వచ్చిన రాబడులు కూడా 5.03శాతం తగ్గి 4109.3 కోట్లకు చేరింది. టాటాప్లే వ్యాపార ప్రకటనల ప్రమోషన్ ఖర్చులు 29.2 శాతం తగ్గి 124.28 కోట్లకు చేరాయి. అంతకుముందు ఏడాది 175.54 కోట్లుగా ఉన్నాయి. మొత్తం వ్యయాలు కూడా గణనీయంగా తగ్గించుకోగలిగింది. 3శాతం తగ్గి 4619.22కోట్లకు చేరాయి. అయితే కంపెనీ తన రుణభారాన్ని గణనీయంగా తగ్గించుకుంటున్నది. 3445.60 కోట్లనుంచి 4010.21 కోట్లుగా ఉంది. కంపెనీ మాతృసంస్థ టాటాసన్స్‌కు 60శాతం వాటాలున్నాయి. గత ఏడాది టాటాప్లేలో బ్రైట్ ఇన్వెస్ట్‌మెంట్స్ ద్వారా 10శాతం వాటాలు కొనుగోలు చేసింది. ఈ డీల్‌లో 100 మిలియన్ డాలర్ల డీల్‌గా నిలిచింది. టాటాసన్స్ తర్వాత నెట్‌వర్కక డిజిటల్ డిస్ట్రిబ్యూషన్ సర్వీసెస్ ఎఫ్‌జడ్, టిఎస్ ఇన్వెస్ట్‌మెంట్స్ కంపెనీలో రెండో అతిపెద్ద వాటాదారులు వారు 20శాతంచొప్పున వాటాలు కలిగి ఉన్నారు. ప్రస్తుతం టాటాసన్స్, టిఎస్ ఇన్వెస్ట్ రెండే అతిపెద్ద ప్రమోటర్లుగా ఉన్నారు. ఎయిర్‌టెల్, టాటాప్లేరెండింటినీ విలీనంచేయాలని గతంలో చర్చలు జరిగాయి. తర్వాత సంతృప్తికరంగా చర్చలు లేకపోవడంతో విలీనం డీల్‌ను రద్దు చేసుకుంటున్నట్లు తెలిపారు.




## అనిల్ అంబానీ బకాయిలు చెల్లింపు

**న్యూఢిల్లీ, జూన్ 25:** ఒకప్పుడు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న అనిల్ అంబానీ కంపెనీ ఇప్పుడు సరికొత్తగా మార్కెట్లోకి తిరిగొస్తోంది. అనిల్ అంబానీ కంపెనీ రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అనుబంధ సంస్థ జెఆర్ టోల్ రోడ్ ప్రైవేట్ లిమిటెడ్ (జెఆర్‌టిఆర్) ఇటీవల వడ్డీతో సహా రూ.273 కోట్ల బకాయి రుణాన్ని తిరిగి చెల్లించింది. ఇది యెస్ బ్యాంక్ ఇచ్చిన రుణం. ఇది మాత్రమే కాదు, గ్రూప్‌లోని మరో కంపెనీ ఇప్పుడు ఫ్రాన్స్‌కు చెందిన ప్రసిద్ధ ఏరోస్పేస్ కంపెనీ డసాల్ట్ ఏవియేషన్‌తో కలిసి ఇండియాలో బిజినెస్ జెట్‌లను తయారు చేయబోతోంది. 2013 సంవత్సరంలో జెఆర్‌టిఆర్ జైపూర్ నుండి రింగాస్ వరకు 52 కి.మీ పొడవైన హైవేను నిర్మించింది. ప్రారంభంలో అంతా బాగానే జరిగింది, కానీ కాలక్రమేణా ఖర్చు పెరిగింది, ఆదాయం తగ్గింది. రుణం తిరిగి చెల్లించడంలో డిఫాల్ట్‌లు జరిగాయి. బ్యాంక్ ఈ రుణాన్ని విశితి అంటే బ్యాడ్ లోన్‌గా ప్రకటించింది. పరిస్థితి చాలా తీవ్రంగా మారింది, కంపెనీ ఎన్‌హెచ్‌ఎఐపై కూడా కేసు వేసింది. జెఆర్‌టిఆర్ ఎస్ బ్యాంక్‌తో ఒప్పందం కుదుర్చుకుని మొత్తం రుణాన్ని తిరిగి చెల్లించింది. ఇప్పుడు ఆ గ్రూప్‌లోని మరో కంపెనీ రిలయన్స్ ఏరోస్ట్రక్చర్ లిమిటెడ్ (ఆర్ఎఎల్), డస్సాల్ట్ ఏవియేషన్‌తో కలిసి నాగ్‌పూర్‌లో




ఫాల్కన్ 2000 బిజినెస్ జెట్‌లను తయారు చేయనున్నట్లు ప్రకటించింది. మొదటి మేడ్ ఇన్ ఇండియా ఫాల్కన్ జెట్ 2028 నాటికి విమానాలను తయారు చేస్తుందని అంచనా. ఈ ప్లాంట్ ఫాల్కన్ 2000 తయారీకి మాత్రమే కాకుండా, డస్సాల్ట్ ఫాల్కన్ 6ఎక్స్, 8ఎక్స్ వంటి ఇతర మోడళ్ల తయారీకి కూడా అత్యుత్తమ కేంద్రంగా మారుతుంది. ఇది భారతదేశం అమెరికా, ఫ్రాన్స్, కెనడా, బ్రెజిల్ వంటి సొంత వ్యాపార జెట్‌లను తయారు చేసే దేశాల లీగ్‌లోకి తీసుకువస్తుంది.

## 2027 నాటికి మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా భారత్: పియూష్ గోయల్

**న్యూఢిల్లీ, జూన్ 25:** 2027 నాటికి భారత్ మూడో అతి పెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరిస్తుందని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ పేర్కొన్నారు. రాబోయే మూడేళ్లలో భారత్ 5 లక్షల కోట్ల డాలర్ల ఎకానమీని సాధించే దిశగా అడుగులు వేస్తోందని తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం, వ్యాపార సంఘాలు, పరిశ్రమలు సహా 140 కోట్ల మంది భారతీయులు.. ప్రధాని మోడీ వికసిత్ భారత్ దార్శనికతతో ముందుకు వెళ్తున్నారని అన్నారు. శక్తివంతమైన ఆర్థికవ్యవస్థగా మారేందుకు భారత్ సున్నితమైన సమస్యలు ఉన్న ప్రతిచోటా.. ప్రపంచదేశాలతో పోటీపడగలిగేలా తనను తాను మలుచుకుందని గోయల్ అన్నారు. నేడు భారత్ అంతర్జాతీయంగా అత్యున్నతస్థాయిలో ఉందని పేర్కొన్నారు. విదేశాలలో భారతీయ పౌరుల భద్రతకు ప్రభుత్వం చూపిస్తున్న నిబద్ధతకు ఇటీవల కేంద్రప్రభుత్వం నిర్వహించిన ఆపరేషన్ సింధు ఉదాహరణ అని తెలిపారు. ఆపరేషన్ సింధు ద్వారా ఇరాన్, ఇజ్రాయెల్‌లలో చిక్కుకున్న భారతీయులను మోడీ ప్రభుత్వం సురక్షితంగా తమ స్వస్థలాలకు తీసుకువచ్చిందని అన్నారు. బలమైన స్థూల ఆర్థిక పునాదితో దేశంలోని బ్యాంకింగ్ వ్యవస్థ దృఢంగా ఉందని గోయల్ అన్నారు. ఇప్పటివరకు లేని విధంగా దేశంలో ద్రవ్యోల్బణం అత్యల్పంగా 3 శాతానికి తగ్గిందని తెలిపారు. భారత్ 5 లక్షల కోట్ల డాలర్ల ఎకానమీని అందుకోవడం కోసం మూలధన వ్యయాల పెంపు, సులభతర వ్యాపార నిర్వహణ, వ్యాపార నిర్వహణ ఖర్చులు తగ్గడం, కార్మికులతో




తయారీకి ప్రాధాన్యం, ప్రపంచ మార్కెట్‌పై దృష్టిసారించడం వంటి చర్యలు ఎంతో కీలక మని పేర్కొన్నారు. ప్రస్తుతం వృద్ధి చెందుతున్న దేశీయ డిజిటల్ మార్కెట్.. రాబోయే దశాబ్ద కాలంలో భారత్‌కు చాలా కీలకమన్నారు. మార్చి కల్లా వైమానిక దళానికి 6 తేజస్ విమానాలు ప్రపంచంలో జపాన్‌ను అధిగమించి భారత్ నాలుగో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరించిందని ఇటీవల నీతిఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రహ్మణ్యం వెల్లడించారు. దేశ స్థూల దేశీయోత్పత్తి 4.19 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.356 లక్షల కోట్ల)కు చేరుకుందని.. జపాన్ కంటే 4.187 బిలియన్ డాలర్లు (సుమారు రూ.35,600 కోట్లు) అధికంగా మన ఆర్థికవ్యవస్థ ఉందన్న అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) అంచనా గణాంకాలను ఆయన ఉదహరించారు.

## రాణించిన అన్ని రంగాల షేర్లు

**ముంబై, జూన్ 25:** ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు చల్లారిన వేళ దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా రెండో రోజూ రాణించాయి. చమురు ధరలు దిగిరావడమూ మన మార్కెట్ సూచీలకు కలిసొచ్చింది. అన్ని రంగాల షేర్లు రాణించగా.. ఐటీ, మీడియా రంగ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ షేర్లు కూడా ఒకటిన్నర శాతం మేర రాణించాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 700 పాయింట్లకు పైగా లాభపడగా, నిఫ్టీ 25,250 స్థాయికి చేరువైంది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి బలమైన సంకేతాలతో సెన్సెక్స్ ఉదయం 82,448.80 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,055.11) వద్ద ఓ మోస్తరు లాభాల్లో ప్రారంభమైందది. రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 82,815.91 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 700 పాయింట్ల లాభంతో 82,755.51 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 200 పాయింట్ల లాభంతో 25,244.75 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.07గాఉంది. బీఈఎల్, కోటక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్ షేర్లు మినహా మిగిలిన అన్ని షేర్లూ లాభాల్లో ముగిశాయి. టైటాన్, ఇన్ఫోసిస్, మహీంద్రా అండ్ మహీంద్రా, భారతీ ఎయిర్‌టెల్, టీసీఎస్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 67.60 డాలర్ల వద్ద కొనసాగగా, బంగారం ఔన్సు 3340డాలర్లవద్ద ట్రేడవుతోంది.




## ఇంధన రంగంలో అతిపెద్ద జాయింట్ వెంచర్!

**ముంబై, జూన్ 25:** అదానీ టోటల్‌గ్యాస్, జియో బిపిలు వ్యూహాత్మక భాగస్వామ్యంలోకి వచ్చాయి. ఇకపై సంయుక్తంగా రిటైల్ ఔట్‌లెట్ల మార్కెటింగ్‌లో కొనసాగుతాయి. పెట్రోలు, డీజిల్, సిఎన్‌జిలను వాటి చమురు ఔట్‌లెట్లలో జాయింట్ విక్రయాలు జరుపుతాయి. దీని ప్రకారం అదాని టోటల్‌గ్యాస్ పెట్రోలు బంకుల్లో జియోబిపి హైలెవ్ పెట్రోలు, డీజిల్‌లను కూడా విక్రయిస్తారు. అలాగే జియోబిపి ఔట్‌లెట్లు అదానీ టోటల్‌గ్యాస్‌కు సంబంధించిన సిఎన్‌జిని విక్రయిస్తాయి. అదానీగ్రూప్, ఫ్రెంచ్ మేజర్ టోటల్ ఎనర్జీస్ సంస్థలు జాయింట్ వెంచర్‌లో అదానీ టోటల్ కొనసాగుతోంది. ఇపుడు ఈ కంపెనీ బయోగాస్, ఈవీఛార్జింగ్ స్టేషన్‌లు, రవాణా రంగానికి ఎల్ఎన్‌జిలను సరఫరా చేస్తోంది. అలాగే జియో బిపి అంటే రిలయన్స్, గ్లోబల్ ఎనర్జీ దిగ్గజం బ్రిటిష్ పెట్రోలియం కంపెనీతో జాయింట్ వెంచర్‌లో నడుస్తోంది. ఇంధన రిటైలింగ్, తక్కువ కర్బన ఉద్గారాలు వదిలే ఇంధన ఉత్పత్తులు తమతమ స్టోర్లలో విక్రయిస్తోంది. ఇకపై జాయింట్ వెంచర్ వల్ల కస్టమర్లకు హైక్వాలిటీ ఇంధన ఉత్పత్తులను అందించగలుగుతామని జియోబిపి ఛైర్మన్ శార్థక్ మెహూరియా వెల్లడించారు. అదానీ గ్యాస్‌కు సంబంధించి సిఇఒ సురేష్ పి మంగ్లాని మాట్లాడుతూ, కస్టమర్లకు మరిన్ని ప్రయోజనాలు అందించ గలుగుతున్నట్లు వెల్లడించారు. ఆదానికంపెనీకి ప్రస్తుతం 650 సిఎన్‌జి స్టేషన్లు ఉన్నాయి. జియోబిపికి 2000 కుపైగా ఇంధన స్టేషన్లున్నాయి. ఈ రెండు కలిపి జాయింట్ వెంచర్‌లో ఇపుడు మొబిలిటీ రంగానికి అత్యంత విలువైన ఇంధన ఉత్పత్తులు అందించ గలుగుతున్నట్లు వెల్లడించాయి. కంపెనీకి 125 జిల్లాల్లో 53 జిఎ స్టేషన్లు ఉన్నాయి.



## ఎయిరిండియా రోజువారీ కార్యకలాపాల పర్యవేక్షణ

**ముంబై, జూన్ 25:** ఎఐ 171 విమాన దుర్ఘటనను టాటా సంస్థ చాలా సీరియస్‌గా తీసుకొంది. ఎయిరిండియా రోజువారీ కార్యకలాపాల పర్యవేక్షణ బాధ్యతను నేరుగా టాటాసన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ చేతుల్లోకి తీసు కొన్నారు. సంస్థకు ఈ దుర్ఘటన పెనుసవాలుగా మారడంతో ఆయన ఈనిర్ణయం తీసుకొన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వంతో సంబంధాలు, ప్రయాణికుల సురక్షితను అంచనా వేయడం, విమానాల నిర్వహణ, సిబ్బంది సంక్షేమం వంటివి ఆయన పరిధిలోకి రానున్నాయి. తమ సంస్థలు కష్టాల్లో ఉన్నప్పుడు ఛైర్మన్లు స్వయంగా రంగంలోకి దిగి వాటిని ఎదుర్కోవడం టాటా గ్రూపులో ఎప్పటి నుంచో వస్తున్నసంప్రదాయం. 1989లో టాటాస్టీల్‌లో అగ్నిప్రమాదం చోటు చేసుకొని దాదాపు 50 మంది చనిపోయారు. నాడు జేఆర్‌డీ టాటా స్వయంగా రంగంలోకి దిగి ఈ సంక్షోభాన్ని ఎదుర్కొన్నారు. ఇక టాటా ఫైనాన్స్ కుంభకోణం, 26/11 తాజ్ హోటల్‌పై ఉగ్రదాడి సందర్భంగా ఆ వ్యవహారాలను నాటి ఛైర్మన్ రతన్ టాటా స్వయంగా పర్యవేక్షించారు. ఎన్.చంద్రశేఖరన్‌కు కూడా టీసీఎస్‌ను సంక్షోభాల నుంచి బయట పడేసిన రికార్డు ఉంది. ఎయిరిండియా సీఈవో క్యాంప్‌బెల్ విల్సన్, టాటా గ్రూప్ ఛైర్మన్ చంద్రశేఖరన్‌తో కలిసి పనిచేయనున్నారు. ఆ గ్రూపులో ఎయిరిండియా సంస్థకు ఇప్పుడు ప్రజల విశ్వాసం చూరగొనేందుకు వేగంగా, స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోవలసిన అవసరం ఉంది. అది గ్రూప్ ఛైర్మన్ మాత్రమే చేయగలరు. ఈ నేపథ్యంలో ఆయనే ఎయిర్‌లైన్స్ ప్రధాన కార్యాలయం నుంచి పనిచేయనున్నట్లు తెలుస్తోంది. భద్రతకు సంబంధించినఅంశాలపై ప్రస్తుతం సీఈవో వివిధ విభాగాల అధిపతులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.